


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com




visit us @ http://epaper.suryaa.com

శుక్రవారం | 2 ఫిబ్రవరి 2024 | విజయవాడ

సంపుటి 17 | సంచిక 99

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


అనుగ్రహం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉత్తరాయనం - హేమంత ఋతువు, పుష్య మాసం బహుల సప్తమి ఉ.10.30, స్వాతి రా.1.59 వర్జ్యం ఉ.8.00 నుంచి
రాహుకాలం మ.3.00 నుంచి 4.30 వరకు, దుర్ముహూర్తం ఉ.8.49 నుంచి 9.35 వరకు తిరిగి మ.12.38 నుంచి 1.24 వరకు

# మా బడ్జెట్ జనరంజకం

సబ్ కా సాత్ సబ్‌కా వికాస్ నినాదం భారత ఆర్థిక మూలాలను పటిష్టం చేసిందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. పదేళ్లలో మోడీ నాయకత్వంలో అమలు చేసిన సంస్కరణలు ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేశాయని స్పష్టంచేశారు. బాధ్యతాయుతంగా తీసుకున్న నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థలో కొత్త ఉత్సాహాన్ని నింపాయన్నారు.




- మొత్తం వ్యయం రూ. 47.66 లక్షల కోట్లుగా ప్రభుత్వ అంచనా
- గతేడాది మాదిరిగా ఈసారీ పేపర్‌లెస్ బడ్జెట్
- మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ రికార్డును సమం చేసిన నిర్మలా సీతారామన్
- సబ్ కా సాత్ సబ్‌కా వికాస్ నినాదం భారత ఆర్థిక మూలాల పటిష్టం
- మోడీ అమలు చేసిన సంస్కరణలు ఆర్థిక వ్యవస్థ బలోపేతం
- రైతులకు కనీస మద్దతు ధరను ఎప్పటికప్పుడు పెంపు



సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టారు. అంతకుముందు కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు రాష్ట్రపతి భవన్‌కు ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ వెళ్లారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి బడ్జెట్ సమర్పణకు అనుమతి తీసుకున్నారు. రాష్ట్రపతి భవన్ నుంచి పార్లమెంట్‌కు చేరుకుని పేదల ఆశలు, మధ్యతరగతి ఆకాంక్షలు, వ్యాపార వర్గాల భారీ అంచనాల నడుమ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు.
గతేడాది మాదిరిగా ఈసారీ పేపర్‌లెస్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టారు. మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తితో తయారుచేసిన ట్యాబ్ ద్వారా మంత్రి బడ్జెట్‌ను చదివి వినిపించారు. నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం వరుసగా ఇది ఆరోసారి.

వివరాలు-2లో

## లాభాల్లో స్టాక్ మార్కెట్‌లు



- కేంద్ర బడ్జెట్ రోజున తీవ్ర ఒడిదుడుకులకు గురైన స్టాక్ మార్కెట్‌లు
- 106 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
- 28 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ

5లో

## ముగిసిన కేఆర్ఎంబీ సమావేశం

- హాజరైన ఏపీ, తెలంగాణ ఈఎన్‌సీలు
- హైదరాబాద్‌లోనే కేఆర్ఎంబీ సమావేశం
- శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల నిర్వహణ కేఆర్ఎంబీకి అప్పగింత
- నీటి వాటాలపై తుది నిర్ణయం తీసుకునే అధికారం త్రిసభ్య కమిటీదే!
- నీటి నిర్వహణ అవుట్ లెట్స్ బోర్డుకు అప్పగింత

6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## హామీలపై వెనకంజ వేయం

- ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టీకరణ
- మరో రెండు గ్యారంటీలు అమలు చేద్దాం
- ఈ బడ్జెట్‌లోనే వాటికి నిధుల కేటాయింపు
- అర్హులందరికీ లబ్ధి చేకూరేలా పథకాల అమలు
- ఒక్క అర్హుడికి నష్టం జరగకుండా చూడాలి
- ప్రజా పాలన దరఖాస్తుల సమీక్షలో రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల్లో మరో రెండు గ్యారంటీలను అమలు చేద్దామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నఅర్హులందరికీ లబ్ధి జరిగేలా గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. మరో రెండు గ్యారంటీల అమలుకు సన్నాహాలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన దరఖాస్తులపై గురువారం సచివాలయంలో కేబినేట్ సబ్ కమిటీ మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.



3లో

## మధ్యంతర బడ్జెట్ భేష్

- 2047 నాటికి దేశ అభివృద్ధి షురూ
- ఈ బడ్జెట్ ఓ గ్యారెంటీ అంటూ మోడీ ప్రశంసలు

కొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలకు వెళ్లనున్న కేంద్ర ప్రభుత్వం.. గురువారం తాత్కాలిక బడ్జెట్ ను ప్రవేశపెట్టింది. దీనిపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తంచేశారు. దేశాభివృ్ాద్ధి కొనసాగిం పునకు ఈ బడ్జెట్ విశ్వాసాన్ని ఇచ్చిందన్నారు.సమ్మిళిత, సృాజనాత్మక నిర్ణయాలతో కూడిన మధ్యంతర బడ్జెట్ ఇది. దేశాభివృాద్ధి కొనసాగింపునకు విశ్వాసం కలిగించింది.

వివరాలు-2లో



## అంతా ఇంతే!




అప్పులు పెరగాలనేమో
అభివృద్ధి పెరగాలనేమో

## బడ్జెట్ 2024 నిరాశాజనకం

- మోడీ ప్రభుత్వం బడ్జెట్‌పై ప్రతిపక్షాల పెదవి విరుపు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా పలువురు నేతలు విమర్శలు



2లో

## బాబు వస్తేనే రాష్ట్రం బాగుపడుతుంది



7లో

- రెండోరోజు కొనసాగిన నిజం గెలవాలి కార్యక్రమం
- గుడ్లూరు మండలంలో మూడు కుటుంబాలను పరామర్శించిన నారా భువనేశ్వరి

## జోన్ లేట్ అందుకే

### ఏపీ ప్రభుత్వం భూమి ఇవ్వలేదు

- అందుకే విశాఖ రైల్వే జోన్ జాప్యం
- ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేసాం
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్
- తాత్కాలిక బడ్జెట్‌లో ఏపీలో రైల్వే అభివృద్ధికి రూ.9,138 కోట్లు,
- తెలంగాణకు రూ.5,071 కోట్లు కేటాయింపులు



3లో

విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటుకు 53 ఎకరాల భూమిని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఇప్పటికే అడిగామని, అయితే ప్రభుత్వం ఇంకా అప్పగించలేదని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. జోన్ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధమైందని, భూమి ఇస్తే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాజపా అధికారంలోకి రాకముందు 2009 నుంచి 2014 వరకు ఉమ్మడి ఏపీలో రైల్వే అభివృాద్ధికి రూ.886 కోట్ల నిధులు ఇవ్వగా, ప్రస్తుత బడ్జెట్లో ఒక్క ఏపీకే రూ.9,138 కోట్లు ( 2024) కేటాయించామని తెలిపారు.

## ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణస్వీకారం

శాసనసభ సభ్యుడిగా బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రమాణస్వీకారం చేశారు. స్పీకర్ ఛాంబర్లో సభాపతి గడ్డం ప్రసాద్ కేసీఆర్తో ప్రమాణం స్వీకారం చేశారు.



6లో

- విపక్ష నేతగా తొలిసారి టీఎస్ అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్
- స్పీకర్ ఛాంబర్‌లో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం
- హ్యాండ్ స్టిక్ సాయంతో ఎవరి సహాయం లేకుండా నడిచిన కేసీఆర్

సూర్య
విజయవాడ
శుక్రవారం
2 ఫిబ్రవరి 2024





## రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగినులు కూడా రెండేళ్ల చైల్డ్ కేర్ లీవ్‌లు మంజూరు చేయాలి

విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : భారత దేశంలో మహిళలు ఎక్కడ ఉద్యోగాలు చేస్తున్నాసరే వారికి ఏర్పడే ఇబ్బందులు ఒక్కటిగానే ఉంటాయి కాబట్టి ప్రభుత్వాలు మాత్రం కేంద్రప్రభుత్వంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ లీవ్ లు రెండు సంవత్సరాలు ఇస్తున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఆరునెలలు మాత్రమే చైల్డ్ కేర్ లీవులు ఇస్తున్నారు. సౌకర్యాలు కల్పించి స్టేట్ గవర్నమెంటు ఉమెన్ ఉద్యోగుల అందరికీ కూడా వర్తించేలా ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని ఏపిజేఏసి అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జెనరల్ పలిశెట్టి దామోదరరావు విజ్ఞప్తి చేసారు. గురువారం రెవిన్యూభవన్ లో ఏపిజేఏసి అమరావతి కేపిటల్ యూనిట్ ఉమెన్ వింగు కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులూ అన్ని రంగాల లో రాజకీయంగా గాని, ఉద్యోగపరంగా గాని ఏ అవకాశం ఇచ్చినా సరే విజయవంతంగా పనిచేస్తున్నారు. నేడు మహిళా ఉద్యోగులు అన్ని రంగాలలో 50 శాతం వరకు పనిచేసే పరిస్థితులు ఉన్నాసరే మహిళలు కనీసం పనిచేసే ప్రదేశాలలో టాయిలెట్సు సౌకర్యాలు కూడా లేని పరిస్థితులు చాలా చోట్ల ఉన్నాయి. ఆపరిస్థితిలేకుండా అన్నిచోట్లా టాయిలెట్సు సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ లు వేయాలని, శిశు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, చైల్డ్‌కేర్ లీవులు కేంద్ర ప్రభుత్వఉద్యోగుల మాదిరిగా రెండు సంవత్సరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# మా బడ్జెట్ జనరంజకం

● మొత్తం వ్యయం రూ. 47.66 లక్షల కోట్లుగా ప్రభుత్వ అంచనా ● గతేడాది మాదిరిగా ఈసారీ పేపర్‌లెస్ బడ్జెట్ ● మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ రికార్డును సమం చేసిన నిర్మలా సీతారామన్ ● సబ్ కా సాత్ సబ్‌కా వికాస్ నినాదం భారత ఆర్థిక మూలాల పటిష్టం ● మోడీ అమలు చేసిన సంస్కరణలు ఆర్థిక వ్యవస్థ బలోపేతం ● రైతులకు కనీస మద్దతు ధరను ఎప్పటికప్పుడు పెంపు



సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టారు. అంతకుముందు కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు రాష్ట్రపతి భవన్‌కు ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ వెళ్లారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి బడ్జెట్ సమర్పణకు అనుమతి తీసుకున్నారు. రాష్ట్రపతి భవన్ నుంచి పార్లమెంట్‌కు చేరుకుని పేదల ఆశలు, మధ్యతరగతి ఆకాంక్షలు, వ్యాపార వర్గాల భారీ అంచనాల నడుమ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. గతేడాది మాదిరిగా ఈసారీ పేపర్‌లెస్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టారు. మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తితో తయారుచేసిన ట్యాబ్ ద్వారా మంత్రి బడ్జెట్‌ను చదివి వినిపించారు. నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం వరుసగా ఇది ఆరోసారి. దీంతో మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ రికార్డును ఆమె సమం చేశారు. దేశంలో తొలి పూర్తి స్థాయి మహిళా ఆర్థిక మంత్రిగా ఘనత సాధించిన ఆమె..



2019 జులై నుంచి ఇప్పటివరకు ఐదు పూర్తి స్థాయి బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. తాజాగా లోక్‌సభ ఎన్నికల ముందు తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్ 2024-25ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఆర్థిక సంవత్సరం 2025 మొత్తం వ్యయం రూ. 47.66 లక్షల కోట్లుగా ప్రభుత్వం అంచనా వేస్తోందన్నారు. రుణేతర ఆదాయం రూ.30.80 లక్షల కోట్లు ఉండొచ్చని, నికర రుణాలు రూ. 11.75 లక్షల కోట్లుగా ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేసింది.

సబ్ కా సాత్ సబ్‌కా వికాస్ నినాదం భారత ఆర్థిక మూలాలను పటిష్టం చేసిందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. పదేళ్లలో మోదీ నాయకత్వంలో అమలు చేసిన సంస్కరణలు ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేశాయని స్పష్టంచేశారు. బాధ్యతాయుతంగా తీసుకున్న నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థలో కొత్త ఉత్సాహాన్ని నింపాయన్నారు.

వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా ఆర్థిక విధానాలు ఉండబోతున్నాయని తెలిపారు.

భారత్‌కు మాత్రమే ప్రత్యేకమైన డెమొక్రసీ, డెమొగ్రఫీ, డైవర్సిటీ త్రయానికి దేశ ప్రజల ఆకాంక్షలను సాకారం చేసే సత్తా ఉందన్నారు. గురువారం లోక్‌సభలో తాత్కాలిక బడ్జెట్ 2024ను ప్రవేశపెడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

### 80 కోట్ల మందికి ఉచిత రేషన్..

గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయి. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణలు ఫలితాలిస్తున్నాయి. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు.పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నాం. దాదావు 80 కోట్ల మంది దీని వల్ల లబ్ధి పొందారు. రైతులకు కనీస మద్దతు ధరను ఎప్పటికప్పుడు పెంచుతున్నాం. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

### అభివృద్ధి చెందిన భారతే లక్ష్యం..

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గతంలో సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే ఉండేది. కానీ, మేం దాన్ని అమలు చేసి చూపుతున్నాం. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించింది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం. నూతన సంస్కరణలతో కొత్త పారిశ్రామికవేత్తలు పుట్టుకొచ్చారని ఆర్థికమంత్రి పేర్కొన్నారు. ఆత్మనిర్భర భారత్ నిర్మాణంలో ప్రతి వ్యక్తి భాగస్వాములయ్యారని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దశ, దిశ ఏర్పడిందని వివరించారు. సమ్మిళిత, సంతులిత ఆర్థిక విధానాలతో చిట్టచివరి వ్యక్తికీ ప్రగతి ఫలాలు అందాయన్నారు.



### భారీ ఎత్తున రుణసాయం..

పీఎం స్వానిధి ద్వారా 78 లక్షల వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు చేశాం. మరో 2.3 లక్షల మందికి కొత్త రుణాలు ఇవ్వనున్నాం. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా జన్ ధన్ ఖాతాలకు రూ.34 లక్షల కోట్లు బదిలీ చేశాం. దీనివల్ల ప్రభుత్వానికి రూ.2.7లక్షల కోట్లు ఆదా అయ్యింది. స్కిల్ ఇండియా మిషన్ కింద 1.4 కోట్ల యువకులకు నైపుణ్య శిక్షణ అందించాం. పీఎం ముద్ర యోజన కింద రూ.22.5 లక్షల కోట్లు విలువ చేసే 43 కోట్ల రుణాలను మంజూరు చేశాం.

### ఏటా 11.8 కోట్ల రైతన్నలకు పీఎం కిసాన్..

పీఎం కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా ఏటా 11.8 కోట్ల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సాయం అందిస్తున్నాం. పీఎం ఫసల్ బీమా యోజన కింద నాలుగు కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోంది. ఇంటింటికీ విద్యుత్ సరఫరా చేస్తున్నామని నిర్మలమ్మ చెప్పారు. ఇబ్బందుల్లో వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి ఊదామన్నారు. మద్దతు ధరలు, పెట్టుబడి రాయితీలతో రైతులకు ప్రయోజనాలు కల్పించామని చెప్పారు.

### రాష్ట్రాలకు సహకారం అందిస్తాం..

భారత ఆర్థిక వ్యవస్థను సంఘటితపర్చడానికి డిజిటల్ ఇండియా చాలా కీలకం. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడింది. మూలధన పెట్టుబడులకు గిఫ్ట్ ఒక ప్రధాన మార్గంగా అవతరించింది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చింది. సామరస్యంతో కూడిన ప్రకృతి, ఆధునిక మౌలిక సదుపాయాలే వికసిత్ భారత్ విజన్. ఆశావహ జిల్లాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సాయం అందిస్తుంది. భారత వృద్ధి పథంలో తూర్పు భాగంలోని రాష్ట్రాలు కీలక పాత్ర పోషించేలా కృషి చేస్తాం అని సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా అవతరించేందుకు కృషి చేస్తున్నామని నిర్మలా సీతారామన్ కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. పేదలు, మహిళలు, యువత, అన్నదాలను శక్తిమంతం చేశామన్నారు.కుల, మత ఆర్థిక బేధాలు లేకుండా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2047నాటికి అసమానత, పేదరికం కనబడకుండా చేయాలన్నదే మోదీ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పేదరికం నిర్మూలనకు బహుముఖీయ విధానాలతో పనిచేశామని నిర్మలమ్మ చెప్పారు.పేదలకు జన్‌ధన్ ఖాతాల ద్వారా రూ.34లక్షల కోట్లు అందించామన్నారు. 78 లక్షల మంది వీధి వ్యాపారులకు ఆర్థికసాయం అందించామని తెలిపారు.రూ.2.20 లక్షల కోట్ల పూచీకత్తు లేని రుణాలు అందించామని వెల్లడించారు.

### 40 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ

స్కిల్‌ఇండియా మిషన్‌తో కోటి 40 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ అందించామన్నారు. యువతకు ముద్రా యోజనతో రూ.25 లక్షల కోట్లు రుణాలుగా ఇచ్చామని నిర్మలా సీతారామన్ తెలిపారు. స్టార్టప్ ఇండియా ద్వారా యువతను పారిశ్రామికవేత్తలుగా తయారు చేశామని చెప్పారు. గత పదేళ్లలో జాతీయ విద్యా విధానం ద్వారా అనేక మార్పులు తీసుకొచ్చాం 7 ఐఐటీలు, 16 ట్రిపుల్ ఐటీలు, 7 ఐఐఎంలు, 15 ఎయిమ్స్‌లు, 390 యూనివర్సిటీలు ఏర్పాటు చేశామన్నారు. 10 ఏళ్లలో ఉన్నత విద్య చదివే అమ్మాయిల సంఖ్య 28శాతం పెరిగిందన్నారు. జీఎస్టీ లాంటి ట్యాక్స్ సంస్కరణలు ట్యాక్స్ పరిధిని పెంచాయన్నారు. క్రీడల్లో సాధించిన పతకాలు యువతలో ఆత్మ స్థైర్యాన్ని నింపుతున్నాయన్నారు. మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించామన్నారు. ట్రిపుల్ తలాక్ చట్ట విరుద్ధమని ప్రకటించామన్నారు.

### అన్ని రంగాల్లో ఆర్థికవృద్ధి

ప్రజల ఆదాయం 50శాతం పెరిగిందని నిర్మలమ్మ ప్రకటించారు. ప్రపంచదేశాలు ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయన్నారు. భారత్ మాత్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని స్పష్టంచేశారు. అన్ని రంగాల్లో ఆర్థికవృద్ధి కనబడుతోందన్నారు. జీడీపీ అంటే గవర్నెన్స్, డెవలప్‌మెంట్, పెర్ఫార్మెన్స్ అని కొత్త అర్థం ఇచ్చామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పీఎం ఆవాస్ యోజన ఇళ్లలో 70 శాతం మహిళల పేరుపైనే ఇచ్చామని తెలిపారు. ఈ పదేళ్లలో ద్రవ్యోల్బణాన్ని సమతుల్యంగా ఉంచామన్నారు. జిల్లాలు, బ్లాక్‌ల అభివృద్ధి కోసం రాష్ట్రాలతో కలిసి పనిచేస్తున్నామన్నారు నిర్మలా సీతారామన్. రూఫ్ టాప్ సోలార్ పాలసీ కింద కోటి ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. బస్తీలు, అద్దె ఇళ్లలో ఉండేవారి సొంత ఇంటి కలను నిజం చేస్తామన్నారు.

## ఆదాయపన్ను వర్గాలకు లభించని ఊరట

త్వరలో జరగబోయే ఎన్నికల నేపథ్యంలో ఆదాయ పన్ను వర్గాలకు ఊరట కల్పించేలా ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ నిర్ణయం తీసుకుంటారని భావించిన వారికి నిరాశే ఎదురైంది.

గతేడాది ప్రతిపాదించిన కొత్త పన్ను విధానాన్నే ఈసారీ కొనసాగించారు. రూ.7 లక్షల వరకు ఎలాంటి పన్ను భారం లేకుండా రిబేటు ఉంటుందని తెలిపారు.

ఇందులకు ఎలాంటి పొదువు, పెట్టుబడులతో పని ఉండదు. అంతకుమించి ఆదాయం కలిగిన వారికి శ్లాబుల ప్రకారం పన్ను వర్తిస్తుంది.

పలు సెక్షన్ల కింద మినహాయింవులను అనుమతించే పాత పన్నుల విధానంలో మాత్రం ఎలాంటి మార్పులనూ ప్రతిపాదించలేదు.

కొత్త పన్ను విధానంలో మినహాయింవును రూ.3 లక్షలకు పెంచగా, ఈసారి దాన్నే కొనసాగించారు. పాత పన్ను విధానంలో ఆదాయ పరిమితి రూ.2,50,000 గానే ఉంటుంది.

పాత పన్ను విధానంలోనూ పన్ను వర్తించే ఆదాయం రూ.5 లక్షల లోపు ఉన్నప్పుడు ఎలాంటి భారం ఉండదు.

కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయింపులు ఇలా..

గ్రామీణ ఉపాధి హామీ పథకం: రూ. 86 వేల కోట్లు
ఆయుష్మాన్ భారత్: రూ. 7,500 కోట్లు
పారిశ్రామిక ప్రోత్సాహకాలు: రూ. 6,200 కోట్లు
సెమీ కండక్టర్స్, డిస్ప్లే ఎకో వ్యవస్థల తయారీ: రూ. 6,903 కోట్లు
సోలార్ విద్యుత్ గ్రిడ్: రూ. 8,500 కోట్లు
గ్రీన్ హైడ్రోజన్ మిషన్: రూ. 600 కోట్లు
రక్షణ: రూ 6.2 లక్షల కోట్లు
ఉపరితల రవాణా, జాతీయ రహదారులు: రూ. 2.78 లక్షల కోట్లు
రైల్వే: రూ. 2.55 లక్షల కోట్లు
వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ: రూ. 2.13 లక్షల కోట్లు
హోం శాఖకు: రూ. 2.03 లక్షల కోట్లు
గ్రామీణాభివృద్ధి: రూ. 1.77లక్షల కోట్లు
రసాయనాలు, ఎరువులు: రూ. 1.68 లక్షల కోట్లు
కమ్యూనికేషన్లు: రూ. 1.37 లక్షల కోట్లు
వ్యవసాయం, రైతు సంక్షేమం: రూ. 1.27 లక్షల కోట్లు


2024-25 సంవత్సరానికిగానూ దాదావు గంట పాటు సాగిన ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రసంగం హైలెట్స్
విమానయాన రంగంలో 2,3 తరగతి నగరాలకు కొత్త విమాన సర్వీసులు
రైలు మార్గాల్లో హైట్రాఫిక్, హైడెన్సిటీ కారిడార్లలో నూతన మౌలిక సదుపాయాలు ఏర్పాటు
రైలు బోగీలన్నింటినీ వందే భారత్ ప్రమాణాలతో మార్పు
మన విమానయాన సంస్థలు.. వెయ్యి విమానాలకు పైగా ఆర్డర్ చేశాయి.

## ఎఫ్‌డీఐ అంటే ఫస్ట్ డెవలప్ ఇండియా

ఎఫ్‌డీఐ పెట్టుబడులు పెరిగాయి. విదేశీ పెట్టుబడులకు ఇది స్వర్ణయుగం. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో రాష్ట్రాలకు తోడ్పాటు అందిస్తాం సంస్కరణలు అమలుకు రాష్ట్రాలకు 50 ఏళ్ల పాటు రూ.75వేల కోట్ల వడ్డీలేని రుణాలు పిల్లల ఆరోగ్యం కోసం ఇంద్రధనుస్సు కార్యక్రమం, భారత్ నుంచి మధ్య ప్రాచ్యం మీదుగా యూరప్‌నకు ప్రత్యేక కారికాడర్, మౌలిక వసతుల రంగానికి రూ.11.11 లక్షల కోట్లు కేటాయింపు, దేశ తూర్పు ప్రాంతాన్ని నూతన అభివృద్ధి రథంగా మారుస్తున్నాం డెమోగ్రఫీ, డెమోక్రసీ, డైవర్సిటీ మూల సూత్రాలుగా భారత్ ముందడుగు వేస్తోంది 2047 నాటికి ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలు సాధించే దిశగా ముందడుగు వేస్తున్నాం. అవకాశాల సృష్టితో ఆకాశమే హద్దుగా భారత్ ముందడుగు వేస్తోంది కొత్త ప్రపంచంతో అనుసంధానమవుతూ భారత్ దిక్సూచిగా నిలబడుతోంది. విద్యుత్ బిల్లుల నుంచి విముక్తికి కొత్త సోలార్ పథకం ప్రకటించాం దేశంలో కొత్తగా ఐదు సమీకృత ఆక్వా పార్కులు పాడి రైతుల ప్రోత్సాహానికి ప్రత్యేక సమగ్ర కార్యక్రమం నానో యూరియా తర్వాత పంటలకు నానో డీఏపీ కింద ఎరువులు అందిస్తాం. ఆయిల్ సీడ్స్ రంగంలో ఆత్మనిర్భరత సాధిస్తాం స్వయం సహాయక బృందాల్లో కోటి మంది మహిళలు లక్షాధికారులు అయ్యారు లక్ పతీ దీదీ టార్గెట్‌ను రెండు కోట్ల నుంచి మూడు కోట్లకు పెంచుతున్నాం పరిశోధన, సృజనాత్మకతకు రూ.లక్షల కోట్ల నిధి ఏర్పాటు చేస్తాం మౌలిక వసతుల రంగం 11.1శాతం వృద్ధితో రూ.11లక్షల 11 వేల 111 కోట్ల కేటాయింపు ఆశాలు, అంగన్‌వాడీలకు ఆయుష్మాన్ పథకం వర్తింపు 9-18 ఏళ్ల బాలికలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా చర్యలు మరిన్ని మెడికల్ కాలేజీల కోసం కమిటీలు ఏర్పాటు చేస్తాం మధ్యతరగతి కోసం ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం, జిల్లాలు, బ్లాక్‌ల అభివృద్ధి కోసం రాష్ట్రాలతో కలిసి పనిచేస్తున్నాం. రూఫ్ టాప్ సోలార్ పాలసీ కింద కోటి ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్.బస్తీలు, అద్దె ఇళ్లలో ఉండేవారి సొంత ఇంటి కలను నిజం చేస్తాం. వచ్చే ఐదేళ్లలో పీఎం ఆవాస్ యోజన కింద 2కోట్ల ఇళ్ల నిర్మాణం. జీడీపీకి ఈ ప్రభుత్వం కొత్త అర్థం చెప్పింది. స్టార్టప్ ఇండియా ద్వారా యువతను పారిశ్రామికవేత్తలుగా తయారు చేశాం. గ్రామీణ ప్రాంతాల్లో పీఎం ఆవాస్ యోజన ఇళ్లలో 70శాతం మహిళల పేరుపైనే ఇచ్చాం. జీడీపీ అంటే గవర్నెన్స్, డెవలప్‌మెంట్, పెర్ఫార్మెన్స్ అని కొత్త అర్థం ఇచ్చాం. ఈ పదేళ్లలో ద్రవ్యోల్బణాన్ని సమతుల్యంగా ఉంచాం. ప్రజల ఆదాయం 50శాతం పెరిగింది ప్రపంచదేశాలు ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయి. భారత్ మాత్రం వాటికి అతీతంగా అభివృద్ధి పథంలో పయనిస్తోంది అన్ని రంగాల్లో ఆర్థికవృద్ధి కనబడుతోంది. ట్రిపుల్ తలాక్ చట్ట విరుద్ధమని ప్రకటించాం. యువతకు ముద్రా యోజనతో రూ.25లక్షల కోట్లు రుణాలుగా ఇచ్చాం. జీఎస్టీ వంటి ట్యాక్స్ సంస్కరణలు ట్యాక్స్ పరిధిని పెంచాయి. క్రీడల్లో సాధించిన పతకాలు యువతలో ఆత్మ స్థైర్యాన్ని నింపుతున్నాయి. మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించాం. 4.50 కోట్ల మందికి బీమా సౌకర్యం 11.8 కోట్ల మంది రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించాం. వ్యవసాయ రంగంలో కొత్త సాంకేతికతతో విలువ జోడించే విధానాలు తెచ్చాం. స్కిల్‌ఇండియా మిషన్‌తో కోటి 40లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ అందించాం 4 కోట్ల మంది రైతులకు ఫసల్ బీమా యోజన కింద పంట బీమా అందజేస్తున్నాం గత పదేళ్లలో 7 ఐఐటీలు, 16 ట్రిపుల్ ఐటీలు, 7 ఐఐఎంలు, 15 ఎయిమ్స్‌లు, 390 యూనివర్సిటీలు ఏర్పాటు చేశాం.

## తెలుగు రాష్ట్రాలకు పంగనామం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పెట్టిన బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న ఏ అంశం గురించీ ప్రస్తావనకు రాలేదు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీకీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనైనా ఏపీకి కొన్ని ఊరట కలిగించే నిర్ణయాలు ప్రకటిస్తాయని భావించిన వారికి మరోసారి నిరాశే ఎదురైంది. ముఖ్యంగా ఏపీకి జీవనాడిగా చెబుతున్న పోలవరం గురించి ఒక్కమాటైనా మాట్లాడలేదు. నిర్వాసితులకు రూ.32 వేల కోట్ల రూపాయలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తేల్చినా.. నేటి బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పెండింగ్ పనులు, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం వంటి పలు రైల్వేలైన్ల ముచ్చట లేనేలేదు. విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.683 కోట్లు కేటాయించాలనీ, సంస్థను ప్రైవేట్ పరం చేయొద్దనీ కోరుతున్న ఏపీ ప్రజల ఆకాంక్షలను అనుగుణంగా నేటి బడ్జెట్‌లో ఎలాంటి హామీ లభించలేదు.రాజధాని లేని రాష్ట్రంగా చెప్పబడుతున్న ఏపీకి కనీసం.. మౌలిక సదుపాయాల కల్పన కోసమైనా ఏదైనా ప్రకటిస్తారనే ఆశ కూడా అడియాశగానే మిగిలింది.అతిపెద్ద తీరప్రాంతం ఉన్న ఏపీకి ఓడరేవుల అభివృద్ధికి గానీ, పెండింగ్‌లో ఉన్న భోగాపురం విమానాశ్రయ నిర్మాణానికి నిధుల జాడ గానీ బడ్జెట్‌లో కనిపించనే లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సెంట్రల్ యూనివర్శిటీ, పెట్రోలియం యూనివర్శిటీలకు నిధుల కేటాయింపులు, ఆక్వా సాగుకు ప్రోత్సాహకాల వంటి అంశాలనూ నిర్మలమ్మ పద్దు మూలన పారేసింది.అటు తెలంగాణలోని పెండింగ్ అంశాల గురించి కూడా ఆమె పట్టించుకోనేలేదు. పారిశ్రామిక పార్కుల కేటాయింపు, సింగరేణి ఐఐటీ హైదరాబాద్, మణుగూరు ప్లాంట్లకు నిధుల కేటాయింపు గురించిన ప్రస్తావన లేనేలేకపోయింది.హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ వ్యవసాయ పరిశోధన సంస్థ ఏర్పాటు చేయాలనే డిమాండ్ గురించీ మాట్లాడనే లేదు.ఇక.. పదేళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాలు రెండూ ఉమ్మడిగా కేంద్రాన్ని కొన్ని అంశాలమీద దృష్టి పెట్టాలని కోరుతూ వచ్చాయి. వాటిలో కేంద్ర పన్నుల్లో లభిస్తున్న వాటా పెంపు, పెట్రోలు, డీజిల్ ధరలపై సుంకాలు, పీఎం ఆవాస్ యోజన కేటాయింపుల పెంపు తదితర అంశాల గురించీ ఈ బడ్జెట్ మాటమాత్రంగానైనా ప్రసావించలేదు.




## మధ్యంతర బడ్జెట్ భేష్



ఢిల్లీ: కొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలకు వెళ్లనున్న కేంద్ర ప్రభుత్వం.. గురువారం తాత్కాలిక బడ్జెట్ ను ప్రవేశపెట్టింది. దీనిపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తంచేశారు. దేశాభివృద్ధి కొనసాగింపునకు ఈ బడ్జెట్ విశ్వాసాన్ని ఇచ్చిందన్నారు.సమ్మిళిత, సృజనాత్మక నిర్ణయాలతో కూడిన మధ్యంతర బడ్జెట్ ఇది. దేశాభివృద్ధి కొనసాగింపునకు విశ్వాసం కలిగించింది. వికసిత భారత్‌కు మూలస్తంభాలైన యువత, పేదలు, మహిళలు, రైతుల సాధికారతకు ఇది కృషి చేస్తుంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించేందుకు ఈ బడ్జెట్ ఓ గ్యారెంటీ ఇచ్చింది. ఇది యువ భారత ఆకాంక్షలకు ప్రతిబింబం. సాంకేతికత రంగంలో పరిశోధన, సృజనాత్మకత కోసం రూ.లక్ష కోట్ల నిధి ఏర్పాటుచేశాం. అలాగే బడ్జెట్‌లో చెప్పిన మూలధన వ్యయంతో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు యువతకు ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. పీఎం ఆవాస్ యోజన కింద రాబోయే ఐదేళ్లలో 2 కోట్ల ఇళ్ల నిర్మాణం గురించి ప్రకటించాం. మహిళలను లక్షాధికారుల్ని చేసే లఖ్‌పతి డిడిస్' పథకాన్ని మూడుకోట్ల మందికి విస్తరించనున్నాం. ఆయుష్మాన్ భారత్ కింద ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు లబ్ధి పొందనున్నారు. సామాన్య పౌరులపై భారం పడకుండా జీవనశైలిని మరింత సులభతరం చేయడం ఈ బడ్జెట్ ఉద్దేశం అని మోదీ అన్నారు.

## బడ్జెట్ 2024 నిరాశాజనకం



న్యూఢిల్లీ ... మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. వారి 'మిత్ర కాల్' బడ్జెట్‌లో ఉద్యోగాలను సృష్టించే ఆలోచన లేదని, అలాగే ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవటానికి ఎటువంటి ప్రణాళిక లేదని ఎద్దేవా చేశారు. దేశ భవిష్యత్తును నిర్మించడానికి కేంద్రానికి ఎలాంటి రోడ్‌మ్యాప్ లేదని అన్నారు. మరోవైపు దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలను పరిష్కరించేందుకు ఈ కేంద్ర బడ్జెట్ ప్రయత్నించడం లేదని కేరళ సీఎం పినరయి విజయన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో మధ్యంతర బడ్జెట్‌పై డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ మాట్లాడుతూ 'బడ్జెట్‌లో ప్రత్యేకత ఏమీ లేదన్నారు. మెరుగైన భవిష్యత్తుకు సంబంధించి ఎలాంటి వాగ్దానాలు కనిపించడం లేదని చెప్పారు. వచ్చే పూర్తి బడ్జెట్ కోసం తాము ఎదురుచూస్తున్నామని, అయితే దానిని భారత్ కూటమి సమర్పిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ మధ్యంతర బడ్జెట్‌ను డల్‌గా అభివర్ణించారు. ఈ బడ్జెట్ ఎక్కడుంది ఏదైనా ప్రకటన ఉందా అని ప్రశ్నించారు. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి ఏదైనా ప్రయత్నం ఉందా? విదేశీ రుణాన్ని తగ్గించుకోవడానికి ఏమైనా పరిష్కారాలు ఉన్నాయా? ద్రవ్యోల్బణం, నిరుద్యోగం గురించి ఏమైనా చెప్పారా? అంటూ ప్రశ్నలు సంధించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, రైతులు, కార్మికులు, యువత, మహిళల గురించి మాట్లాడే భారత బడ్జెట్ వస్తుందని తాము తీసుకొస్తామని హామీ ఇచ్చారు. మధ్యంతర బడ్జెట్ పేరుతో మోదీ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల లాలీపాప్ ఇచ్చిందని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి నీలభ్ శుక్లా మండిపడ్డారు.

## 5 నుండి అసెంబ్లీ సమావేశాలు




వెలగపూడి, సూర్య బ్యూరో ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈనెల 5వ తేదీ సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురువారం రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారని అసెంబ్లీ కార్యదర్శి డా.పిపికె రామాచార్యులు తెలిపారు. 5వ తేది సోమవారం ఉదయం 10 గం.లకు వెలగపూడిలోని రాష్ట్ర అసెంబ్లీ భవనంలో శాసన మండలి, అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయని ఆయన తెలిపారు.

## సుప్రీంలో సోరెన్ సవాల్



రాంచీ: భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన అరెస్టును సవాలు చేస్తూ గురువారం ఆయన పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం కోర్టు విచారణ జరపనుంది. అరెస్టుకు ముందు రాష్ట్ర ప్రజలు, పార్టీ నేతలను ఉద్దేశించి సోరెన్ ఓ వీడియోను రికార్డు చేశారు. బుధవారం రికార్డు చేసిన ఆ వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈడీ నన్ను అరెస్టు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. దానికి నేనేమీ బాధపడటం లేదు. ఎందుకంటే నేను శిబుసోరెన్ కుమారుడిని. రోజంతా ప్రశ్నించిన తర్వాత నాకు సంబంధంలేని కేసులో అధికారులు అరెస్టు చేయాలని నిర్ణయానికి వచ్చారు. వారు ఎలాంటి ఆధారాలను గుర్తించలేదు. దిల్లీలోని నివాసంలో సోదాలు నిర్వహించి నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు యత్నించారు. పేదలు, ఆదివాసీలు, దళితులు, అమాయక ప్రజలపై అరాచకాలకు పాల్పడే వారిపై ఇప్పుడు సరికొత్త పోరాటం చేయాల్సి ఉంది అని సోరెన్ ఆ వీడియోలో అన్నారు.

## సాగు ఉత్పత్తుల కోసం గిడ్డంగులు, ప్రాసెసింగ్ కోసం ఆర్థిక సాయం



నూనె గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి కోసం కొత్త పథకం పాడి అభివృద్ధి కోసం రైతులకు ఆర్థిక సాయం రాష్ట్రీయ డెయిరీ ప్రాసెసింగ్ గోకుల మిషన్ ద్వారా ఆర్థికసాయం పన్ను రేట్ల హేతుబద్ధతతో పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గించాం ఫేస్‌లెస్ విధానంతో పారదర్శకత, సత్వర రిటర్న్‌ల చెల్లింపులు సరాసరి నెలవారీ జీఎస్టీ ఆదాయం రూ.1.66కోట్లకు చేరింది. జీఎస్టీ ముందున్న విధానం కన్నా ప్రస్తుత ఆదాయం రెట్టింపు అంతర్జాతీయ వాణిజ్యంలో కొత్త సంస్కరణలు జల, వాయు మార్గాల్లో కొత్త కంటెయినిరిటీ పోల్ ఏర్పాటు చేస్తున్నాం వికసిత భారత్ కోసం రాష్ట్రాలకు 50ఏళ్ల వ్యవధితో రూ.75వేల కోట్ల రుణాలు సాగు ఉత్పత్తుల విలువ జోడింపుతో రైతులకు అధిక ఆదాయం సమకూర్చే పథకాలు.



# సబ్సిడీలకు కోతలు.. తగ్గిన కేటాయింపులు

న్యూఢిల్లీ ... కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను పలు సబ్సిడీలకు కేటాయింపుల్లో కోతలు పెట్టింది. రైతులకు అందించే ఎరువులు, ఆహార, పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించిన కేటాయింపులను ఈ బడ్జెట్లో గణనీయంగా తగ్గించింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 మధ్యంతర బడ్జెట్లో ఎరువుల సబ్సిడీకి రూ.1.64 లక్షల కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయించిన రూ.1.89 లక్షల కోట్లతో పోల్చితే 13.2 శాతం తగ్గించారు. అలాగే 2023-24 బడ్జెట్లో 1.75 లక్షల కోట్లు కేటాయించారు.కేంద్రం యూరియాపై సబ్సిడీ, ఇతర ఎరువులపై పోషకాల ఆధారిత సబ్సిడీ ఇస్తుంది. అంతర్జాతీయ ధరలు తగ్గుముఖం పట్టడం, బయో, సేంద్రియ ఎరువుల కోసం ఒత్తిడి పెరగడం , నానో-యూరియా వినియోగం పెరిగిన నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎరువు సబ్సిడీకి కేటాయింపు తగ్గుదల కనిపించింది. దేశం మొత్తం ఎరువుల వినియోగంలో యూరియా 55-60 శాతం ఉంటోంది. రైతులకు సబ్సిడీ యూరియా 45 కిలోల బ్యాగ్ రూ.242లకు లభిస్తోంది. దీనికి పన్నులు, వేప పూత ఛార్జీలు అదనం. అయితే ఇదే బ్యాగ్ అసలు ధర సుమారు రూ.2,200 ఉంది.ఇక ఆహార, పెట్రోలియం ఉత్పత్తులపై ఇస్తున్న సబ్సిడీకి సంబంధించిన కేటాయింపులను 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం తగ్గించింది. ఈ బడ్జెట్లో రూ.2,05,250 కోట్లు కేటాయిం చింది. ఇది గతేడాది కేటాయించిన రూ.2,12,332 కోట్లతో పోల్చితే 3.33 శాతం తక్కువ. అలాగే పెట్రోలియం ఉత్పత్తులపై ఇచ్చే సబ్సిడీ కోసం గతేడాది కేటాయించిన రూ. 12,240 కోట్ల కంటే 2.6 శాతం తక్కువగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.11,925 కోట్లు కేటాయించింది.

# ఏపీ ప్రభుత్వం భూమి ఇవ్వలేదు




**● అందుకే విశాఖ రైల్వే జోన్ జాప్యం ● ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేసాం ● రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ● తాత్కాలిక బడ్జెట్‌లో ఏపీలో రైల్వే అభివృద్ధికి రూ.9,138 కోట్లు, ● తెలంగాణకు రూ.5,071 కోట్లు కేటాయింపులు**

దిల్లీ: విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటుకు 53 ఎకరాల భూమిని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఇప్పటికే అడిగామని, అయితే ప్రభుత్వం ఇంకా అప్పగించలేదని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. జోన్ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధమైందని, భూమి ఇస్తే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాజపా అధికారంలోకి రాకముందు 2009 నుంచి 2014 వరకు ఉమ్మడి ఏపీలో రైల్వే అభివృద్ధికి రూ.886 కోట్ల నిధులు ఇవ్వగా, ప్రస్తుత బడ్జెట్లో ఒక్క ఏపీకే రూ.9,138 కోట్లు ( 2024) కేటాయించామని తెలిపారు. ఆంధ్రాలో ఏడాదికి 240 కి.మీ. మేర నూతన ట్రాక్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. 98 శాతం లైన్ల విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయన్నారు.

తెలంగాణకు రూ.5,071 కోట్లు

తెలంగాణలో రైల్వేల కోసం రూ.5,071 కోట్లు కేటాయించినట్లు అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో వంద శాతం విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. గత పదేళ్లలో వివిధ చోట్ల 414 ఫ్లైఓవర్లు, అండర్ పాసేజ్లు నిర్మించినట్లు తెలిపారు. రైల్వేపై రాష్ట్రంలో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయన్నారు. ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేసిన ఆయన.. పనులు జరుగుతున్నట్లు చెప్పారు.



# ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పులు లేవు

**● రూ.7 లక్షల వరకూ పన్ను మినహాయింపు యధాతధం ● ఇన్‌కమ్ ట్యాక్స్‌పై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన**

న్యూఢిల్లీ ... : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇన్కమ్ ట్యాక్స్పై కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త ట్యాక్స్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆదాయవు పన్నులను మరింత సులభతరం చేస్తామి వెల్లడించరు. కొత్త ట్యాక్స్ విధానంలో 7 లక్షల వరకూ ఎలాంటి పన్ను లేదని తేల్చి చెప్పారు. పన్నుల శ్లాబులు యథాతథంగా ఉంటాయని వెల్లడించారు.. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానంలో ఎలాంటి మార్పులు లేవని వెల్లడించారు. కార్పొరేట్ ట్యాక్స్ను 30% నుంచి 22%కి తగ్గించామని తెలిపారు. ప్రత్యక్ష పన్నుల వసూళ్లు మూడు రెట్లు పెరిగాయని తెలిపారు.

# 'దేశంలో 9 - 14 బాలికలకు క్యాన్సర్ వ్యాక్సినేషన్'

**● కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు**
**● కేంద్ర బడ్జెట్‌లో మహిళలకు కేంద్రం గుడ్ న్యూస్**

న్యూఢిల్లీ... దేశంలో 9 నుంచి 14 ఏళ్ల బాలికలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా వారికి వ్యాక్సినేషన్ చర్యలు చేపడతామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈసారి పెద్దగా కీలక పథకాల జోలికి పోకుండా.. మౌలిక సదుపాయాల కల్పనపైనే దృష్టి సారించారు. వైద్య రంగానికి సంబంధించి కీలక ప్రకటనలు సహా.. మహిళల కోసం కూడా కొన్ని ప్రకటించారు. దేశంలో మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని, వాటి వల్ల వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. స్వయం సహాయక బృందాల్లో కోటి మంది మహిళలు లక్షాధికారులు అయ్యారని వివరించారు. 'లఖ్పతి దీదీ' పథకం కింద దేశంలో కోటి మంది లబ్ధి పొందుతున్నారు. ఈ టార్గెట్ ను 2 కోట్ల నుంచి 3 కోట్లకు పెంచి 3 కోట్ల మంది మిలియనీర్లను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్మల పేర్కొన్నారు. పీఎం ఆవాస్ కింద మహిళలకు 70 శాతం ఇళ్లను అందించామని అన్నారు.



**నిర్మలమ్మ ఏం చెప్పారంటే.?**

ప్రజలకు సేవ చేయాలన్న యువత ఆశయాలకు అనుగుణంగా, ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలను ఉపయోగించుకుని మరిన్ని మెడికల్ కాలేజీలు అందుబాటులోకి తెస్తామని నిర్మల సీతారామన్ చెప్పారు. దీన్ని పరిశీలించి సిఫార్సులు చేసేందుకు ఓ కమిటీని నియమిస్తామని అన్నారు.

9 నుంచి 14 ఏళ్ల బాలికలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్) బారిన పడకుండా వ్యాక్సినేషన్ పై దృష్టి సారిస్తామని చెప్పారు. కాగా, దేశంలో ఎక్కువగా సోకే క్యాన్సర్లలో గర్భాశయ క్యాన్సర్ 15 – 20 శాతంతో మూడో స్థానంలో ఉంది. 15 – 23 ఏళ్ల లోపు మహిళలు ఎక్కువగా దీని బారిన పడుతున్నారు.

సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్న ప్రతి నలుగురిలో ఒకరు మన దేశంలోనే ఉండడం గమనార్హం. తాజా గణాంకాల ప్రకారం ఏటా దేశంలో 80 వేల మంది ఈ క్యాన్సర్ బారిన పడుతున్నారు. 35 వేల మంది ఈ వ్యాధి కారణంగా మరణిస్తున్నట్లు తేలింది.

పిల్లల్లో రోగ నిరోధకత పెంచడం కోసం తీసుకొచ్చిన 'మిషన్ ఇంద్రధనుస్సు'ను నిర్వహించేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన 'యు విన్' ప్లాట్ ఫాం దేశవ్యాప్తంగా విస్తరిస్తామని అన్నారు. అలాగే, మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కోసం అమలు చేస్తోన్న పథకాలను 'సమగ్ర ప్రోగ్రామ్' కిందకు తీసుకొస్తామని చెప్పారు.

'అయ్యూష్మాన్ భారత్' ఆరోగ్య సంరక్షణ పథకాన్ని ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలకు విస్తరిస్తామని వెల్లడించారు.

సాక్షమ్ అంగన్వాడీ పథకం కింద అంగన్వాడీ కేంద్రాలను ఆధునీకరిస్తామని ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. చిన్నారుల ఎదుగుదల కోసం పోషకాహార పంపిణీని మెరుగ్గా అందించేందుకు 'పోషణ్ 2.0' కార్యక్రమాన్ని అప్ గ్రేడ్ చేస్తామని చెప్పారు.

# బడ్జెట్‌లో రైతులకు మొండి చేయి

న్యూఢిల్లీ ... కేంద్ర ప్రభుత్వం తాజాగా బడ్జెట్ను ఆవిష్కరించింది. మధ్యంతర బడ్జెట్ తీసుకువచ్చింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ను ప్రజల ముందుంచారు. ఈ బడ్జెట్లో పలు కీలక ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. మహిళలను లక్షాధికారులను చేయడం, వడ్డీ లేని రుణాలు, మధ్యతరగతికి 2 కోట్లకు పైగా ఇళ్ల నిర్మాణం, అంగన్వాడీలు/ఆశా వర్కర్లకు ఆయుష్మాన్ భారత్ స్కీమ్ వర్తింపు ఇలా పలు రకాల కీలక ప్రకటనలు చేశారు. అయితే ఈసారి బడ్జెట్లో మోదీ సర్కార్ రైతులకు మొండి చేయి చూపించిందని చెప్పుకోవచ్చు. ఎందుకంటే అన్నదాతల కోసం కీలక ప్రకటనలు ఏమీ లేవని చెప్పుకోవచ్చు. ఇది కాస్త నిరాశ కలిగించే అంశం అని అనుకోవచ్చు. లోక్ సభ ఎన్నికలు జరగనున్నాయి. అందువల్ల ఈసారి బడ్జెట్లో పలు కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని చాలా మంది భావించారు. ఇందులో ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకానికి సంబంధించి ముఖ్యమైన ప్రకటన ఉండొచ్చని చాలా మంది అంచనా వేశారు. పలు మీడియా నివేదికలు కూడా ఇదే విషయాన్ని పేర్కొన్నారు. పీఎం కిసాన్ స్కీమ్ కింద అందించే డబ్బులను మోదీ సర్కార్ ఈసారి బడ్జెట్లో పెంచొచ్చని పలు నివేదికలు వెలువడ్డాయి. అయితే తాజా బడ్జెట్లో పీఎం కిసాన్ స్కీమ్ డబ్బులు పెంపు ప్రకటన లేదు. మీడియా నివేదికలు పీఎం కిసాన్ స్కీమ్ కింద రైతులకు అందించే సాయాన్ని రూ. 12 వేలకు పెంచొచ్చని పేర్కొన్నాయి. కొన్ని నివేదికలు అయితే పీఎం కిసాన్ డబ్బులను రూ. 8 వేలకు పెంచొచ్చని అంచనా వేశాయి. ఇలా పీఎం సాయం పెరగొచ్చని వెల్లడించాయి.అయితే తాజా మధ్యతర బడ్జెట్ 2024లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎలాంటి ప్రకటన చేయలేదు. అంటే డబ్బుల పెంపు అంశంపై కేంద్రం ఆలోచించనే లేదు. ఇది అన్నదాతలకు నిరాశ కలిగించే అంశం అని చెప్పుకోవచ్చు. కాగా మోదీ సర్కార్ పీఎం కిసాన్ స్కీమ్ తీసుకువచ్చిన దగ్గరి నుంచి అన్నదాతలకు ఏటా రూ. 6 వేలు అందిస్తూ వస్తోంది. ఈ డబ్బులు ఒకేసారి కాకుండా మూడు విడతల్లో అన్నదాతల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ అవుతూ వస్తున్నాయి. అంటే 4 నెలలకు ఒకసారి పీఎం కిసాన్ స్కీమ్ డబ్బులు అన్నదాతల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతూ వస్తున్నాయని చెప్పుకోవచ్చు. ఇప్పటి వరకే 15 విడతల డబ్బులు వచ్చేశాయి. అంటే అన్నదాతలకు రూ. 30 వేలు అందాయని చెప్పుకోవచ్చు. కాగా త్వరలోనే పీఎం కిసాన్ స్కీమ్ కింద 16వ విడత డబ్బులు కూడా అన్నదాతల బ్యాంక్ ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ డబ్బులు కూడా వచ్చేస్తే.. మొత్తంగా అన్నదాతలకు రూ. 32 వేలు లభించినట్లు అవుతుంది. ఇకపోతే పీఎం కిసాన్ స్కీమ్ డబ్బులు పొందే వారు కచ్చితంగా ఇ-కేవైసీ పూర్తి చేసుకోవాలి. అప్పుడే డబ్బులు క్రమం తప్పకుండా వస్తాయి.




# ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పులు లేవు

**ఇన్‌కమ్ ట్యాక్స్‌పై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన**

న్యూఢిల్లీ ... : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇన్కమ్ ట్యాక్స్పై కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త ట్యాక్స్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆదాయవు పన్నులను మరింత సులభతరం చేస్తామి వెల్లడించరు. కొత్త ట్యాక్స్ విధానంలో 7 లక్షల వరకూ ఎలాంటి పన్ను లేదని తేల్చి చెప్పారు. పన్నుల శ్లాబులు యథాతథంగా ఉంటాయని వెల్లడించారు.. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానంలో ఎలాంటి మార్పులు లేవని వెల్లడించారు. కార్పొరేట్ ట్యాక్స్ను 30% నుంచి 22%కి తగ్గించామని తెలిపారు. ప్రత్యక్ష పన్నుల వసూళ్లు మూడు రెట్లు పెరిగాయని తెలిపారు.


# ధరలు పెరిగేవి, తగ్గేవి ఏవీ లేవు

న్యూఢిల్లీ .. లోక్సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం ఏర్పడే వరకు మధ్యంతర బడ్జెట్ను తీసుకువచ్చారు. దీని ద్వారా ప్రభుత్వం ఆర్థిక అవసరాలను చూసుకుంటుంది. ఎన్నికల తర్వాత ఏర్పాటు అయ్యే కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ను ప్రవేశపెడుతుంది.

తాజా బడ్జెట్ను పరిశీలిస్తే.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు కీలక అంశాలను వెల్లడించారు. అయితే పన్నులు, కొత్త కొత్త స్కీమ్స్, రాయితీలు వంటివి మాత్రం ఏమీ లేవు.

అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వవు తాజా బడ్జెట్లో ధరలు పెరిగేవి ఏవి? తగ్గేవి ఏవి? అనే అంశానికి సంబంధించి కూడా ఎలాంటి ముఖ్యమైన ప్రకటనలు లేవు. ఎందుకంటే ఇది మధ్యతర బడ్జెట్ అందువల్ల బడ్జెట్ 2024 వల్ల ధరలు తగ్గేవి, పెరిగేవి అంటూ ఏమీ లేవు. అందువల్ల ప్రజలు ఈ విషయాన్ని గుర్తించుకోవాలి. బడ్జెట్ అనగానే వేటి ధరలు తగ్గుతాయి? పెరుగుతాయి? అని చాలా మంది ఆసక్తిగా ఎదురు చూస్తారు.

కానీ ఈసారి మాత్రం ఇలాంటివి ఏమీ లేవని చెప్పుకోవచ్చు. అంటే ఇది నిరాశ కలిగించే అంశం. అయితే ప్రభుత్వం మాత్రం మధ్యతరగతికి, హెల్త్ వర్కర్లకు, యువతకు ఈ బడ్జెట్లో కాస్త ఊరట కలిగే ప్రకటనలు చేసింది.

మహిళల కోసం ల్యాక్ దిది స్కీమ్ విస్తరణ, ఎంట్రప్రెన్యూర్లకు వడ్డీ లేని రుణాలు, టూరిజం డెవలప్మెంట్కు వడ్డీ లేని రుణాలు, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ స్కీమ్ కింద 2 కోట్లకు పైగా ఇళ్ల నిర్మాణం ఇలా పలు కీలక ప్రకటనలు వెలువడ్డాయి.

కాగా 2023 బడ్జెట్ ప్రసంగాన్ని గమనిస్తే.. సీతారామన్ కార్లు, స్మార్ట్ఫోన్లు, టీవీలు, అనేక ఇతర వస్తువులపై కస్టమ్ డ్యూటీలను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు.

ఈ ఉత్పత్తుల తయారీకి అవసరమైన కొన్ని భాగాల దిగుమతులపై సెస్, పన్నులను తగ్గిస్తున్నట్లు తెలిపారు. సీతారామన్ ప్రకటన ప్రకారం కార్లు, స్మార్ట్ఫోన్లు, టీవీలు, ఇతర వస్తువులు తగ్గిన సుంకాల తర్వాత చౌకగా లభిస్తాయి. సిగరెట్లపై పన్నులను 16 శాతం పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. అంటే సిగరెట్లు ప్రియం. బంగారం, ప్లాటినమ్తో తయారు చేసిన వస్తువులకు ధర పెరిగింది. సిల్వర్ డోర్లు, బార్లు, ఆర్టికల్స్, కాపర్ స్క్రాప్, కాంపౌండ్ రబ్బరు మరింత ప్రియం అయ్యాయి.

## 'ప్రజలకు 300 యూనిట్ల విద్యుత్ ఉచితం' : రూఫ్ టాప్ సోలార్ స్కీమ్ అమలు

న్యూఢిల్లీ : ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే, సమ్మిళిత వృద్ధికి దారితీసే ఆర్థిక విధానాన్ని ప్రభుత్వం అవలంబిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. బడ్జెట్ – 2024 ప్రసంగంలో కీలక ప్రకటన చేశారు. ఆర్థిక విధానాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్రాలతో కలిసి పనిచేస్తున్నామని అన్నారు. 3 కోట్ల ఇళ్లు నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యం పూర్తయిందని, వచ్చే ఐదేళ్లలో 2 కోట్ల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. రూఫ్ టాప్ సోలార్ స్కీమ్ కింద ప్రజలకు 300 యూనిట్ల విద్యుత్ ను ఉచితంగా అందిస్తామని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి తెలిపారు.

'జన్ ధన్ ఖాతాల్లో డబ్బుతో రూ .2.7 లక్షల కోట్లు ఆదా'

జన్ ధన్ ఖాతాల్లో డబ్బు వేయడం ద్వారా రూ.2.7 లక్షల కోట్లు ఆదా అయ్యాయని, ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ అత్యున్నత స్థాయిలో ఉందని, ఇదిదేశానికి కొత్త దిశను, కొత్త ఆశలను ఇచ్చిందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశ ఆర్థిక పురోగతిలో దేశంలోని అన్ని రాష్ట్రాలు, వర్గాలు సమిష్టిగా లబ్ధి పొందేలా మోదీ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఆర్థిక రంగాన్ని మరింత పటిష్ఠం చేసి, మరింత సులభంగా ఆపరేట్ చేయగలుగుతున్నాం. దేశ ద్రవ్యోల్బణంతో ఎదుర్కొన్న కఠిన సవాళ్లను అధిగమించి ద్రవ్యోల్బణ గణాంకాలు తగ్గుముఖం పట్టాయి.

## వచ్చే ఐదేళ్లలో 2 కోట్ల ఇళ్లు కట్టించి ఇస్తాం - నిరుపేదలకు నిర్మలమ్మ భరోసా

**● 2024: వచ్చే ఐదేళ్లలో ప్రధాని ఆవాస్ యోజన కింద 2 కోట్ల ఇళ్లు కట్టించి ఇస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు**
**● వచ్చే ఐదేళ్లలో 2 కోట్ల ఇళ్లు కట్టించి ఇస్తాం ● నిరుపేదలకు నిర్మలమ్మ భరోసా**

న్యూఢిల్లీ... వచ్చే ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం 2 కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ప్రధాన మంత్రి ఆవాస్ గ్రామీణ యోజన పథకం కింద ఈ ఇళ్ల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం 2 కోట్ల ఇళ్లను నిర్మించి ఇస్తుంది. ప్రధాన మంత్రి ఆవాస్ గ్రామీణ యోజన కింద ఈ నిర్మాణం చేపడతాం. ప్రస్తుతం దేశంలో జనాభా పెరుగుతోంది. అర్హుల సంఖ్యా పెరుగుతోంది. ఈ పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా ఇళ్ల నిర్మించి ఇస్తాం అన్నారు. కొవిడ్ సంక్షోభ సమయంలో ఇళ్ల నిర్మాణానికి ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయని తెలిపారు. అయినా ఆ సవాళ్లను అధిగమించి లక్ష్యం సాధించామని స్పష్టం చేశారు. ఎన్ని సమస్యలు ఎదురైనా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని కొనసాగించామని తేల్చి చెప్పారు.

కరోనా సంక్షోభ సమయంలో ఇళ్ల నిర్మాణంలో చాలా సవాళ్లు ఎదురయ్యాయి. అయినా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని మేం కొనసాగించాం. 3 కోట్ల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ లక్ష్యానికి చేరువలో ఉన్నాం. వచ్చే ఐదేళ్లలో మరో 2 కోట్ల ఇళ్లు కట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అర్హుల కుటుంబాల సంఖ్య పెరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నాం అని నిర్మలా సీతారామన్ చెప్పారు.

# రాష్ట్ర అభివృద్ధికి అండ

**● సీఎం రేవంత్ రెడ్డితో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు డైరెక్టర్ జనరల్ పాండియన్**
**● మూసి రివర్ ప్లాంట్ ఏరియా, మెట్రో రైల్ ప్రాజెక్టు విస్తరణ అంశాలను ప్రస్తావించిన సీఎం**

తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్:న్యూ డెవలప్మెంట్ బ్యాంకు డైరెక్టర్ జనరల్ డా. డి .జె. పాండియన్ గురువారం నాడు డా బి ఆర్ అంబెడ్కర్ తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ రేవంత్ రెడ్డి తో సమావేశం అయ్యారు. ఈ సమావేశములో ముఖ్యమంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ లో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. మూసి రివర్ ఫ్రంట్ ఏరియాను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి కి ప్రణాళికలు వేసినట్లు తెలిపారు. నదిని సంరక్షిస్తూ, నదీ జలాలను సుస్థిరంగా ఉంచటం దీని ద్వారా స్థానికులకు ఎక్కువ ప్రయోజనముండే విధంగా ఈ ప్రాజెక్టును మరింత అత్యుత్తమంగా తీర్చిదిద్దే విధంగా పనులు చేపట్టనున్నట్లు సీఎం అన్నారు. అలాగే మూసి నది అభివృద్ధిలో పర్యావరణాన్ని కాపాడుతూ, కాలుష్య రహితంగా, సహజ వనరులకు విఘాతం కలగకుండా అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు.సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే హైదరాబాద్ లోని రెండవ దశలో చేపట్టే మెట్రో రైల్ ప్రాజెక్ట్ కు, రాష్ట్రములో శిక్షణ, సాంకేతిక నైపుణ్యాలు అందించే శిక్షణ సంస్థలు ఏర్పాటు కు సహకరించాలని. హాస్పిటల్స్ నిర్మాణమునకు, విద్యాసంస్థల హాస్టల్ బిల్డింగ్స్ నిర్మాణానికి, రాష్ట్రప్రభుత్వం చేపట్టే గృహ నిర్మాణాలకు అలాగే వేస్టేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ ను ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించాలని అన్నారు. అనంతరం పాండియన్ మాట్లాడుతూ రాష్ట్ర పురోభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఈ సమావేశములో డిప్యూటీ ముఖ్య మంత్రి మల్లు బట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం ప్రిన్సిపాల్ సెక్రటరీ శేషాద్రి, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.



# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిశ్చయం

**● కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ● వెల్లడించిన రహదారులు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: తెలంగాణకు సంబంధించి అన్ని విధాలుగా అభివృద్ధికి సహకరిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి హామీ ఇచ్చినట్టు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. గురువారం ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. అన్ని రోడ్లను హైవేలుగా మారుస్తామని గడ్కరీ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఫిబ్రవరి 11వ తేదీ న తెలంగాణకు రావాలని కోరినట్లు చెప్పారు. ట్రిపుల్ ఆర్ కు ఫాస్ట్ ట్రాక్ లో టెండర్లు పిలవాలని చెప్పారని, ఉప్పల్ ఘట్కేసర్ రహదారిని గత రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల పనులు జరగలేదని అన్నారు. వచ్చే వార్షిక ప్రణాళికలు నల్లగొండ బైపాస్ కు నిధులు మంజూరు చేయనున్నామని, ఫిబ్రవరి చివరినాటి వరకు హైదరాబాద్ విజయవాడ హైవే కి సంబంధించి పురోగతిని వివరించినట్టు చెప్పారు. పది సంవత్సరాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభేదాలతో అభివృద్ధి ఆగిపోయిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అంశాలపై రెండు గంటల పాటు కేంద్ర మంత్రి సమీక్ష చేశారని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరిలో నిర్మించ తలపెట్టి న మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణం మరియు స్విమ్మింగ్ పూల్ ఏర్పాడ్ గురించి క్రీడల శాఖ మంత్రికి డి పి ఆర్ ఇవ్వడం జరిగిందని తెలిపారు.



# సంపాదకీయం

editpage@suryaa.com

1858లో ఆల్ఫ్రెడ్ బి. గర్రోడ్ నామకరణం చేలిన "రుమటాయిడ్ ఆర్థరైటిస్" వ్యాధి నేడు ప్రపంచ దేశాల వృద్ధులను పట్టి పీడుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా కీళ్ళవాత సమస్యలు దీర్ఘకాలం పాటు వృద్ధులను వేధిస్తునే ఉన్నాయి. క్రోనిక్ ఆటోఇమ్యూన్ వ్యాధిగా పేరొందిన రుమటాయిడ్ ఆర్థరైటిస్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి 2013 నుంచి 'రుమటాయిడ్ పేషంట్స్ ఫౌండేషన్' చొరవతో ప్రపంచ దేశాలు 02 ఫిబ్రవరిన "రుమటాయిడ్ ఆర్థరైటిస్ అవగాహన దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. కీళ్ళవాత సమస్యలను త్వరగా నిర్థారించుకోవడం, సమర్థవంత నిర్వహణ, దీర్ఘకాలిక వైద్యం లాంటి అంశాలను ప్రజలకు అవగాహన పరచడానికి ఆ వేదిక ఉపయోగపడుతున్నది. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉన్న వయోవృద్ధులు కీళ్ళ నొప్పుల సమస్యలతో ఏమీ చేయలేక జీవితాలను, సమయాన్ని వృధా చేసుకుంటున్నారు. మానసికంగా శారీరకంగా బలహీనపరుస్తున్న కీళ్ళవాత సమస్యలు రానున్న భవిష్యత్తులో వయోజనులకు పెద్ద అవరోధంగా నిలుస్తూ ఉండనుంది. జెనెటిక్స్, పర్యావరణం, హార్మోన్లు లాంటివి కీళ్ళ వాత రోగానికి కారణం అవుతున్నాయి. కీళ్ళవాత వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే గుండె, ఊపిరితిత్తులు, నాడీ మండల సమస్యలకు కూడా దారి తీస్తాయని గమనించాలి.

02 ఫిబ్రవరి 2024న నిర్వహించుకుంటున్న 'రుమటాయిడ్ ఆర్థరైటిస్ దినం – 2024' నినాదంగా లివింగ్ వెల్ విత్ ఆర్ఏ : ఎర్లీ డయగ్నాసిస్, ఎఫెక్టివ్ మేనేజ్

## రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో వృద్ధాప్యం భారం

మెంట్, అండ్ ఏ బ్రైట్ ఫ్యూచర్" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. తొలి దశలో గుర్తించడంతో సమస్య పరిష్కారం సులభంగా దొరుకుతుంది. కీళ్ళవాత సమస్యలను గుర్తించిన వెంటనే వైద్య సలహాలు తీసుకుంటూ చికిత్సకు సహకరించాలి. కీళ్ళవాత వ్యాధి కట్టడికి ఆరోగ్యకర జీవనశైలి, వైద్యుల సూచనలు పాటించడం, కీళ్ళవాత రోగుల నుంచి అనుభవాలను రాబట్టుకోవడం లాంటివి ఆచరించాలి. కీళ్ళవాత వ్యాధికి ఆధునిక చికిత్సలు కూడా అందుబాటులోకి రావడంతో ఆధునిక వైద్య విధానాల సహాయంతో నయం కావడం సులభం అవుతున్నది.

రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధి కారణంగా కీళ్ళ వాపులు, నొప్పులు, కీళ్ళ దృఢత్వం, అలసట, జ్వర, ఆకలి లేమి, కండరాల బలహీనతలు, కీళ్ళ వైకల్యం లాంటి లక్షణాలతో కదలడంలో ఇబ్బందులు, అంగ వైకల్య భావనలు, కీళ్ళ విధ్వంసాలు, కణజాల విధ్వంసాలు కూడా కలుగుతాయి. అసాధారణ వ్యాధినిరోధక స్పందనల కారణాలతో కీళ్ళ వాతం సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. కీళ్ళ వాత వ్యాధి నిర్థారణకు రోగి మెడికల్ హిస్టరీ, భౌతిక పరీక్షలు, రక్త పరీక్షలు, ఎక్స్–రే, ఎంఆర్ఐ లాంటి పరీక్షలు నిర్వహిస్తారు. కీళ్ళవాత వాపులు, నొప్పులు, కీళ్ళ విధ్యంసాన్ని అదుపు చేసుకోవడం లాంటి వైద్య చర్యలు పాటించాలి. తొలి దశలో రోగ లక్షణాలను గమనిస్తూ వైద్య సలహాలు తీసుకుంటూ, పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగితే కీళ్ళవాత రోగానికి పరిష్కారం దొరుకుతుంది. కీళ్ళవాత వ్యాధి సాధారణ ప్రజలకు పట్ల అవగాహన, రోగులకు అవగాహన కల్పించడం, త్వరగా వ్యాధి నిర్థారణ చేసుకోవడం, కీళ్ళవాత సంబంధ చికిత్సలకు సంబంధించిన నిధులు కేటాయించడం నిరంతరం జరగాలి. ఆహారంలో పండ్లు, కూరగాయలు, చేపలు, ఆరోగ్యకర ఓమెగా–3తోనకూడిన కొవ్వులు లాంటివి తీసుకుంటూనే స్వల్ప వ్యాయామం/నడక/ఈత/బైకింగ్, బరువు తగ్గే విధంగా లావు తగ్గడం, విశ్రాంతి తీసుకోవడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని కట్టడి చేసుకోవడం లాంటివి పాటించాలి. ఈ విషయాలన్నింటినీ గమనిస్తూ కీళ్ళవాత సమస్యలను శాశ్వతంగా పొలిమేరలు దాటిద్దాం, ఆరోగ్యకర వృద్ధుల ప్రేమలను ఆస్వాదిద్దాం.

## పెద్దలసభకు పెద్దలనే పంపాలి

రాజ్యసభకు ఎవరెవరిని పంపాలి అనేసమస్యతో మనరాష్ట్రంలో రెండుపార్టీలు తలమునకలై ఉన్నాయి. పెద్దలసభకు పెద్దలనే పంపాలి. కేంద్రంలో రాజ్యసభను, రాష్ట్రంలో శాసనమండలిగా పెద్దలసభగా రాజ్యాంగమునిర్దేశించింది. రాజ్యసభను ఎగువసభ అని పిలుస్తారు. వివిధరంగాలలో నిష్ణాతులైనవారిని ఆయాపార్టీలవారు నామినేట్ చెస్తారు. ఎగువసభలో సభ్యులుదార్శనికంగా ఉంటారు. (ఇపుడులేరు )ఎగువసభవారు ఒకనూతన భావాల గనిగాఉండాలి. (ఇపుడులేరు )గతంలోప్రసిద్ధ రచయితలు ,చిత్రకారులు ,చలనచిత్ర నటులు ,చరిత్రకారులు ,సామాజికకార్యకర్తలు ఎగువసభకు నామినేట్ చెయ్యబడేవారు. లోక్‌సభానిర్ణయాలపై తమఅభిప్రాయాలనువెల్లడించేవారు. కానిఈనాడు అధికారపార్టీ నిర్ణయాలను సమర్ధించటమే చెస్తూన్నారు. అధికారపార్టీవారి తప్పుడునిర్ణయాలను ప్రశ్నించి తప్పుపట్టేవారు అరుదుగా కనిపిస్తున్నారు. అలాంటివారిలో అల్లాడి కుప్పుస్వామి అయ్యర్ ,తారాచంద్ , కుష్వన్తసింగ్ ,నార్లవెంకటేశ్వరరావు, పృధ్విరాజ్కపూర్ ,నర్గీస్ ,మృణాల్సేన్ , పణిక్కర్ , సి నారాయణరెడ్డి ,రాజారామన్న నారాయణ్ , చొ రామస్వామి , వైజయంతిమాల మొదలైనవారు ఎగువసభకు నామినెటే అయ్యేవారు. ఈసభ ఏర్పాటుచేసిన మొదటిలో రకరకాల సామాజిక సమస్యలపట్ల అవగహన ఉన్నవారిని ,మేధావులను , పార్టీరహితంగా ఆలోచించేవారిని పంపి , వారి సేవలను ఉపయోగించూలని ఎర్పాటుచేసారు. పార్టీలుకూడా శాసన సభ్యులచే కొంతమందిని ఎన్నుకోబడే విధంగా చట్టం చేసారు .రాష్ట్రపతి కుడా కొంతమందిని నియమిస్తాడు. అయితే ఈరొజు అలాంటి పెద్దలసభకు సారాయి వ్యాపారస్తులను , రౌడీలను , నేరస్తులను పంపుతున్నారు. పెద్దలసభ అనేదానికి అర్ధమే పోయింది. ఈరకంగా ఎన్నుకోబడ్డవారు రేపు సభలో ఏరకమైన నిర్ణయం తీసుకుంటాడు ?ఖచ్చితముగా ఆయాపార్టీల వారు ఏమిచెప్తే అదేచేస్తారు. కనుక రేపు రాజ్యసభకు జరిగె ఎన్నికలకు అర్హులైనవారిని , పార్టీరహితముగా అలోచించేవారిని , మేధావులైనవారిని , సేవాతత్పరులైనవారిని ఎన్నుకుంటే , వారు సభలో సమాజానికి పనికొచ్చే మంచినిర్ణయాలను ఆమోదిస్తారు. అలాంటివారికి సీట్లు ఇవ్వాలి.

నార్నెవెంకటసుబ్బయ్య 9290617819

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# 'పల్టీ పుత్రుడు' పేరు సార్ధకం చేసుకున్న నితీశ్ కుమార్

- "నవ్విపోదురుగాక ...నాకేమి సిగ్గు" అనే తీరుగా రాజకీయం
- సిద్ధాంతం,ఒక కట్టబాటు,ఒక నిబద్ధత గాలికొదిలేసిన తీరు
- .గత పదేళ్ళలో ఐదుసార్లు పార్టీలను మార్చిన ఘనుడు
- నితీష్ కు తలుపులు మూసేశామని,అవి ఎప్పటికీ తెరుచుకోవన్న నేతలే నేడు స్వాగతించారు
- బీజేపీ దృతరాష్టుని కౌగిలిలో చిక్కి నితీశ్ గిలగిలలాడే పరిస్థితి త్వరలో ఖాయం



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్,
9849328496.

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మరోసారి 'పల్టీ పుత్రుడు' అనే పేరును సార్ధకం చేసుకున్నాడు. కానీ, ఆయన అనుసరించిన రాజకీయ చతురతకు ఫిదా కాని రాజకీయ పార్టీలు లేవు.ఆయన ఎన్నిసార్లు పార్టీలు మారినా స్వాగతం చెప్పేందుకు మిగతా రాజకీయ పక్షాలు సిద్ధంగా ఉండేవి. ఈ స్వాగత సత్కారాలకు కారణం ఆయా రాజకీయ పార్టీల స్వార్ధ ప్రయోజనాలే కారణం తప్ప మరొకటి కాదు.ఈ పార్టీలకు ఒక సిద్ధాంతం,ఒక కట్టబాటు,ఒక నిబద్ధత అంటూ ఏమీ లేవు. వీటికి నైతిక రుజు వర్తనం అనే పదాలకు అర్థం కూడా తెలియదు.నితీశ్ తో రాజకీయంగా విభేధించిన పార్టీలు సైతం ఆయన రాక కోసం స్నేహ హస్తాన్ని చాచేవి. ఆయన ఎప్పుడు ఎవరితో స్నేహం చేస్తారో,ఎప్పుడు ఆపార్టీలతో సంబంధాలు తెగతెంపులు చేసుకుంటాడో ఎవరూ ఊహించలేరు.ఆయన వాక్ చాతుర్యానికి శత్రువులు కూడా మిత్రులుగా మారిపోతారు.బహుశా వారి అవసరాలు కూడా అలాంటి నిర్ణయాలు తీసుకోవటానికి ప్రేరణ కావచ్చు. "రాజకీయాలలో శాశ్విత మిత్రులు, శాశ్విత శతృవులు ఉండరు" కదా! ఇప్పుడు నితీశ్ కుమార్ మరోసారి బిజెపితో కలిసి, ఎన్డీఏలో చేరి తొమ్మిదో సారి బీహార్ ముఖ్యమంత్రిగా పదవీ భాధ్యతలు చేపట్టాడు.గత పదేళ్ళలో ఐదోసారి పార్టీలను మార్చిన ఘనత ఆయనకుంది.ఆయనను ఊసరవెల్లితో పోల్చినా బహుశా అవి సిగ్గుపడతాయి.చెట్టు కొమ్మలను చెంగు,చెంగున గెంతే కోతులు సైతం నితీశ్ లాఘవం చూసి నెవ్వరపోతాయి."నితీష్ కు తలుపులు మూసేశామని,అవి ఎప్పటికీ తెరుచుకోవని" స్వయంగా అమిత్ షాయే గతంలో ఆగ్రహంతో ప్రకటించారు. ఇప్పుడేమో ఎవరికీ,ఎప్పటికీ శాశ్వతంగా తలుపులు మూతపడవని" బీహార్ బిజెపి నాయకులు అంటున్నారు.అలాగే,"తాను చావనైన చస్తాను కానీ, మళ్ళీ బిజెపితో చేయి కలపను" అని నితీష్ కుమార్ రెండు నెలల క్రితం చేసిన వ్యాఖ్యలు బహుశా ఆయనకు ఇప్పుడు గుర్తుకు రావటం లేదు కాబోలు.రాజకీయ నేతలకు "....నేర్చాక ,బొంకులు చెప్పటం పరిపాటే" .ఇప్పుడు బిజెపితో దోస్తానా మరోసారి కుదిరాక ఆయనకు రాజకీయంగా అదనంగా ఒనగూరేది ఏమీ లేదు.ఆయన మొన్నటి వరకు మహా గఠ్బంధ్బంధనంలో ఉన్నంత వరకు బీజేపీ పైన ఆయన అనేక ఘాటు విమర్శలు చేశాడు. సూటీ,పోటీ విసుర్లకు కొదువ లేదు. ప్రతిపక్షాల్లో బీజేపీని కేసీఆర్ దూషించినంత రేంజ్ లో కాకపోయినా ఆయన తరువాత బహశా అంత తీవ్రంగా విమర్శించిన నేత నితీశ్ కుమార్ కాక మరొకరు కనిపించరు.సిగ్గు తప్పి నితేశ్ కుమార్ జత కడతానంటే మాత్రం... బీజేపీ మళ్ళీ ఎందుకు ఆయనతో చేతులు కలుపుతుందో విపక్షాలకు, ప్రజలకు కూడా తెలుసు.

నిజానికి 'ఇండియా' కూటమిలో నితీశ్ కుమార్ కు సముచిత స్థానమే దక్కింది.అయినా ఆయన కాంగ్రేసును బద్నాం చేయటమెందుకు.? బీజేపీ దృతరాష్ట్రుని కౌగిలిలో చిక్కి నితీశ్ గిలగిలలాడే పరిస్థితి త్వరలోనే వస్తుంది. మొన్నటికి మొన్న పార్లమెంటరీ శీతాకాల సమావేశాల్లో ఇతర 150 విపక్షాల ఎంపీలతో పాటు నితీశ్ పార్టీ సభ్యులను కూడా మోదీ ప్రభుత్వం మొఖమాటం లేకుండా నిష్కర్షగా బహిష్కరించిన వైనాన్ని కూడా ఆయన మరచిపోవటం ఆయన వెర్రితనమా? నేర్పరితనమా? అనేది త్వరలోనే తేలుతుంంది.

ఇక ఇంత కాలం కాంగ్రేసుతో అంటకాగి,ఇప్పుడు అవినీతి మరకలున్న ఆర్జేడీతో అధికారం పంచుకోవటం వల్ల నితీశ్ కుమార్ కు చెడ్డ పేరు వస్తుందని ఆయన అనుచరులు మాట్లాడటం కూడా విడ్డూరంగానే ఉంది.పైగా లాలూ కుమారులు ఇద్దరూ రాష్ట్రంలో అధికారం చెలాయిస్తునన్నారనీ, ముఖ్యమంత్రికి తెలియకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారనీ ఆయన సహచరులు ఆరోపించటం కూడా సహేతుకంగా లేదు.కారణం లేకుండా ఆర్జేడీని ఆడిపోసుకోవడం, తాను మరోసారి పిల్లిమొగ్గ వేయటానికి సాకులు వెతికినట్లుగానే ఉంది కానీ ,అబద్దం ఆడినా అతికినట్లు లేదు.

ఇప్పుడు నితీశ్ కుమార్ బీజేపీ నాయకులతోనూ,చిరాగ్ పాశ్వాన్ తోనూ పూర్వం తాను చేసిన ఆరోపణలను ఉపసంహరించుకొని వారితో సఖ్యతగా కలసి ఐక్యంగా పనిచేయగలరా? అలాగే, తనకు వెన్నుపోటు పొడిచిన జితిన్ రామ్ మాంఝీ కూడా మరో పక్కన ఉన్నప్పుడు వారితో ఏలా నెగ్గుకు వస్తాడో వేచి చూడాలి.ప్రస్తుతం రాబోయే లోక్ సభ ఎన్నికల్లో గణనీయంగా ఎంపీ స్థానాలు గెలవడానికి,బీహార్లో బీజేపీకి అవసరం ఏర్పడింది. కనుక, 40 స్థానాలు ఉన్న బీహార్ లోనే కాకుండా, 80 స్థానాలు ఉన్న యూపీలో కూడా ఓబీసీలు,దళితులు, నిమన్న వర్గాల ఓటర్లను దృష్టిలో పెట్టుకొని బీజేపీ... నితీశ్ తో స్నేహం నటిస్తుంది.ఈ మాత్రం ఇంగితం లేని అమాయకుడా నితీశ్!!? ప్రస్తుతం తాను ఎందుకు ప్లేటు ఫిరాయించటానికి సాకులు వెతుకుతూ ఇండియా కుటమినో, ఆర్జిడీనో, నిందించినంత మాత్రాన నితీశ్ పవిత్రుడైపోడు. ఇక నితీశ్ భవిష్యత్ పదవీకాలం అంతా బీజేపీ కరుణాకటాక్షలపై ఆధాంపడి వుండాల్సిందే.ఆయనకు మరో మార్గం లేదు.అదును చూసి లేవకుండా దెబ్బకొట్టడంలో బీజేపీని మించిన పార్టీ దేశంలో మరొకటి లేదు.అనేక రాష్ట్రాలలో సజావుగా సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వాలను అక్రమ మార్గంలో కూల్చివేసిన బీజేపీ కళింకిత చరిత్ర నితీశ్ కు తెలియదా?పార్టీలను చీల్చటంలోనూ, షిండేలను సృష్టించడంలోనూ ఆ పార్టీ నాలుగాకులు ఎక్కువే చదివింది. లోకసభ ఎన్నికల్లో తన అవసరం తీరిపోయాక నితీశ్‌ను ముఖ్యమంత్రిగా కొనసాగించవలసిన అవసరం దానికి ఏమాత్రం లేదు.2025 బీహార్ ఎన్నికల వరకు తన పార్టీ ముఖ్యమంత్రి పదవి కోసం ఎదురుచూడాల్సిన గతి దానికేమీ పట్టలేదు.150 స్థానాల నుంచి క్రమంగా 50 స్థానాలకు పడిపోయి, గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో మూడవ రాజకీయ శక్తిగా మిగిలిపోయిన నితీశ్ పార్టీ ఈ గోడ దూకుడు తర్వాత మెరుగుపడుతుందా? ఎన్డీయే లాభపడుతుందేమో కానీ, నితీశ్ పార్టీ మాత్రం మరింత శుష్కించవచ్చునని కొందరు జోస్యం చెబుతున్నారు. ఆయన నిష్క్రమణతో 'ఇండియా' కూటమి పరువు కాస్తా గంగలో కలిసింది. పర్యటనలతో, సమావేశాలతో విపక్షాలను సమకూర్చి,'భారత్' కూటమికి కాస్తంత గౌరవం తెచ్చిన ఆయనే 'భార త్ ' కు దూరం కావటం విచారకరం. ఇలా జరగటం బీజేపీకి కలిసివచ్చింది. ఇండియా కూటమి, సైద్ధాంతికంగా ఎంత బలహీనమైనదో ఆయా ప్రాంతీయ పార్టీల నాయకులు ఎంతటి స్వార్థపరులో, తమ రాజకీయ మనుగడ కోసం వెన్నుపోట్లకు సైతం ఎలా సిద్ధపడతారో నితీశ్ ను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. నాలుగు సార్లు భేటీ అయి, నితీష్ తో వేదిక పంచుకున్నప్పటికీ కాంగ్రెస్ అయినను పూర్తిగా నమ్మడం లేదని, ఇటీవల దాని చర్యలు చెబుతున్నాయి. అయినా కూటమికి తగిలిన ఈ పెద్ద ఎదురు దెబ్బనీ, ఆ అమమాన భారాన్ని భారత్ కూటమి భరించక తప్పదు.లాలూ పార్టీ నితీశ్ ను ఎందుకు, ఏ పరిస్థితుల్లో నమ్మిందో... లేదా నమ్మినట్టు నటించిందో తెలియదు కానీ,ఇప్పుడు దానితో నితీష్ చెలిమి ముగిసిపోయింది. ఇప్పటికైనా పట్టుదలతో, ఐక్యంగా 'భారత్' కూటమి,"మినిమం ఐక్య కార్యచరణ ప్రణాళికతో " భారత ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా అవి ముందుకు సాగాలి. గత పదేళ్ళలో బీజేపీ అనుసరించిన సాంఘీక, ఆర్థిక, పాలనా వైఫల్యాలను అంశాల వారీగా ఎండగట్టగలగాలి. ప్రజల ఆకాంక్షలను ప్రతిభింబించే ఐక్య మ్యానిఫెస్టో తో ప్రజల ముందుకు పోవాలి. ఒక్క నితీశ్ నిష్క్రమణతో విపక్షాలు డీలాపడరాదు.కృషిని నమ్ముకుంటే ఫలితం అనుకూలంగా రావచ్చు. అంతిమంగా ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణేతలు. వారి భవితను వారే నిర్ణయించుకుంటారు.

# షర్మిలను చేరదీత వెనుక కాంగ్రెస్ వ్యూహాలు

- షర్మిలతో కాంగ్రెస్ కు ఉపయోగం ఏమాత్రం
- ఇక అసెంబ్లీ ఎన్నికలలో గెలుపు మాదేనంటున్న నేతలు
- అవధులు లేని సంతోషం అంబరాన్ని అంటుతున్న వైనం
- రాజ శేఖర్ రెడ్డి గారి పాలనతోనే ఆమె మాటల గారడి
- తన పార్టీ ఏం చేయబోతోందో స్పష్టంగా చెప్పని షర్మిల

కనుమ ఎల్లారెడ్డి,
93915 23027

షర్మిల చేరికతో కాంగ్రెస్ సంబరపడిపోతోంది, నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో గెలుపు మాదే అన్న భ్రమలో ఉన్నారు. నిజానికి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ దాదాపు కనుమరుగే. తెలంగాణలో ఉన్న పరిస్థితులు వేరు. తెలంగాణ ఇచ్చేందే కాంగ్రెస్, పైగా అక్కడ చరిస్మా కలిగిన నాయకులు ఉన్నారు. వీరిలో ముఖ్యంగా రేవంత్ రెడ్డి గారు అత్యంత ప్రతిభాశాలి. వాగ్దాటి పుష్కలంగా ఉన్న వ్యక్తి. ఆయన చేరికతోనే కాంగ్రెస్, తెలంగాణ లో అధికారంలోకి వచ్చింది. రేవంత్ రాకతో రాజకీయ సీన్ మొత్తం మారిపోయింది. తెలంగాణాలో ఇక అధికారం మాదే అనే ధీమా తో ఉన్న బి. ఆర్. ఎస్ కు బంగపాటు కలిగింది. తెలంగాణ లో బి.ఆర్. ఎస్ ఓడి పోవడం సంచలనం కలిగించినా అది రేవంత్ ముందు నిలువలేకపోయింది. స్వయం కృతంతోనే అది ఓడింది. నాయకుల అత్యుసాహం, వివిధ జోష్యం వారిలో మాదే అధికారం అనే ధీమా మరింత ఎక్కువ చేసింది. ముఖ్యంగా రేవంత్ ఎదురు దాడిని బి. ఆర్. ఎస్. నాయకులు ఎదుర్కొలేకపోయారు. రేవంత్ లేకపోయి ఉంటే కాంగ్రెస్ అధికారం లోకి వచ్చేది కాదు. ఈ రోజు కాంగ్రెస్, తెలంగాణాలో అధికారం లో ఉన్నది అంటే అది రేవంత్ చలువే.

కాని ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు వేరు. ప్రస్తుతం చరిస్మా కలిగిన నాయకులు ఎవరూ లేరు. షర్మిల గారు, దివంగత రాజశేఖర్ రెడ్డి బిడ్డనే కాని ఆయన అంత 'పేస్ వాల్యూ 'లేదు. అది తెచ్చుకోవాలంటే ఇంకా టైం పడుతుంది.

ఇక్కడ కాంగ్రెస్ భ్రమ పడింది. తెలంగాణలో మాదిరి ఆంధ్రప్రదేశలో కూడా షర్మిల కాంగ్రెస్ ను అధికారంలోకి తెస్తుందని హై కమాండ్ ఆశించి ఉండొచ్చు. వాస్తవానికి

రాష్టం ను ముక్కలు చేయడం ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎవ్వరూ హర్షించలేదు. తెలంగాణ కాంగ్రెస్ ఇవ్వక పోతే భా. జా. పా ఇస్తుందని కాంగ్రెస్ కు తెలుసు. ఆ ఉద్దేశంతోనే తెలంగాణ ఇచ్చింది. ఇది ఆంధ్ర ప్రజలకు ఏ మాత్రం నచ్చలేదు. అందుకే కాంగ్రెస్ ను దూరం పెట్టారు.

అయితే షర్మిల ను చాలా తెలివిగా కాంగ్రెస్ చేరదీసింది. ఒక్కటే సారి ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిని చేసింది. దీనితో ఆంధ్రప్రదేశ్ రాష్టంలో కొంతవరకకు అయినా మనుగడ సాధించవచ్చని ఉహిస్తోంది. కాని అది అంతా సులువు కాదు. బలమైన తెలుగుదేశం ముందు కాంగ్రెస్ ఆటలు సాగవు. ఇక షర్మిల తో ఏమువుతుంది. ఆమె



ప్రసంగాలు గమనిస్తే దివంగత రాజశేఖర్ రెడ్డి గారు అది చేశారు, ఇది చేశారు అని తండ్రి పేరు వాడుకుంటుంది కాని మేము అధికారం లోకి వస్తే ఏమి చేస్తామో చెప్పడం లేదు. ఆమె మాటలలో రాజ శేఖర్ రెడ్డి గారి పాలనే చెబుతోంది. కాని కాంగ్రెస్ షర్మిల పై పెద్ద ఆశలు పెట్టుకున్నట్లు ఉంది. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ కు భంగ పాటు తప్పదు. అసలు ఎన్ని స్థానాలలో గెలుస్తారో కూడా తెలీదు. సాక్షాత్తు షర్మిల కూడా గెలుస్తారు అనే నమ్మకం లేదు. కాంగ్రెస్ అంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు నమ్మకం లేదు. రాష్టం విడిపోగానే ఆ నమ్మకం మరింత సడలింది.రాష్టం ఇవ్వక పోయి ఉంటే బాగుండేది. ఒక వేళ భారతీయ జనతా పార్టీ ఇచ్చినా, రాష్టంలో భా. జా. పా ఊసే లేకుండా పోయేది.

భా. జా. పా కు బయపడే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది. ఎందు కంటే వాళ్ళు మూడు రాష్టాలు ఇచ్చారు కదా అని ఇచ్చింది. పైగా తెలంగాణాలో మా పార్టీ అధికారంలోకి వస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో మాకు సీట్లు రాకుంటే మాని, తెలంగాణాలో సాలిడ్ ఓట్లు పడతాయి అనే ఆలోచన తోనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది. అదే ఆంధ్రప్రదేశ్ ప్రజల కోపానికి కారణమయింది.. ఇప్పుడు కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ లో ప్రజల మద్దతు లేని పార్టీ. ఎవరూ వచ్చినా ఆ పార్టీ కోలుకోవడం కష్ట సాధ్యమే. ఇక షర్మిల తో జవ సత్వాలు వస్తాయి. కాంగ్రెస్ కు మళ్ళీ మంచి రోజులు వస్తాయి అనుకోవడం కష్టమే. మొత్తానికి షర్మిలతో కాంగ్రెస్ కు లాభం కంటే తెలుగు దేశానికి మేలు కలిగిస్తుంది. షర్మిల తో కాంగ్రెస్ కు ఏమి ఉపయోగమో కొద్ది రోజులలో తెలుస్తుంది.

# రాజ్యసభ ఎన్నికలలో సీన్ రిపీట్‌కి సిద్ధపడుతున్న టిడిపి

- పోటీకి అభ్యర్ధిని సిద్ధం చేస్తున్న తెలుగుదేశం
- బలం లేకున్నా గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్న ఆ పార్టీ నేతలు
- వైసిపి అసంతృప్త ఎమ్మెల్యేల ఓట్లు తమకేనన్న ధీమాలో టిడిపి
- ఎమ్మెల్సీ ఎన్నికల షాక్‌తో జాగ్రత్త పడుతున్న వైసీపీ
- ఇప్పటికే ముగ్గురు అభ్యర్థుల్ని ప్రకటించిన వైఎస్ఆర్‌సీపీ




బి.వెంకట రమణ
94407 40015

(నిన్నటి తరువాయి)

మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. అయితే రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ రిలీజయ్యేంత వరకూ అనర్హతా వేటు పడలేదు కాబట్టి వారి ఓటుకు వచ్చిన ఢోకా ఏమీ లేదని నిపుణులుచెబుతున్నారు. స్పీకర్ అనర్హతా వేటు వేసినా ఈసీ వీరి ఓటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

గతేడాది జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక్క సీటు చేజార్చుకున్న వైసీపీ.. ఈసారి ఆ తప్పు దొర్లకుండా ఉండేందుకు ముందుగానే అలర్ట్ అయింది. వైసీపీ వద్ద ఐదుగురు ఎమ్మెల్యేల సంఖ్య తగ్గి 147 మంది బలంగా ఉంటుంది. రెబల్స్ అందరిపై అనర్హత వేటు పడితే వైసీపీ సులువుగా మూడు రాజ్యసభ స్థానాలను గెలుచుకోగలదు. ఒక వేళ రెబల్స్‌పై వేటు పడకున్నా.. మూడు రాజ్యసభ స్థానాలను గెలుచుకోవడానికి అవసరమైన బలంగా వైసీపీ వద్ద ఉన్నది. రెబల్స్ టీడీపీకి అనుకూలంగా మారినా.. వైసీపీకి నష్టమేమీ ఉండదు. అసెంబ్లీ ఎన్నికల ముంగిట్లో జరుగుతున్న ఈ ఎన్నికల్లో పొరపాట్లు జరగరాదని వైసీపీ జాగ్రత్తలు తీసుకుంటున్నది. ఇదే కారణంతో ప్రతిపక్షం ఎలాగైనా ఒక్క సీటు గెలవాలని అధికార పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టే అవకాశాలూ ఉంటాయి. అందుకే క్రాస్ వోటింగ్ జరగకుండా, ప్రతిపక్షానికి ఎలాంటి అవకాశం లేకుండా వైసీపీ జాగ్రత్త పడుతున్నది.

ఇప్పటికే వైసీపీ అధిష్టానం అభ్యర్థులను దాదాపు ఖరారు చేసింది. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసలు, వైవీ సుబ్బారెడ్డి పేర్లను వైసీపీ ఖరారు చేసింది. అయితే పార్టీకి అసంతృప్తి ఎమ్మెల్యేల టెన్షన్ పట్టుకుంది. ఇటీవలే మార్పులు–చేర్పులు భాగంగా కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీటు నిరాకరించింది వైసీపీ అధిష్టానం. కొందరు అసంతృప్తి ఎమ్మెల్యేలు ఇప్పటికే ఇతర పార్టీలతో టచ్ లోకి వెళ్లారు. అదే సమస్యగా మారింది. టీడీపీ ఒక్కసీటు గెలుస్తామనే ధీమాతో ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో లాగే, రాజ్యసభ ఎన్నికల్లో వైసీపీకి ఝలక్ ఇస్తామని అంటుంది టీడీపీ. వైసీపీ జాగ్రత్త పడుతున్నప్పటికీ తెలుగుదేశం పార్టీ మాత్రం ఒక సీటు తమకే వస్తుందని ధీమా వ్యక్తం చేస్తుంది. అందుకే రాజ్యసభ ఎన్నికల్లో తమ అభ్యర్థిని బరిలో దింపుతామంటున్నారు ఆ పార్టీ నేతలు.

కాగా.. రాజ్యసభ స్థానం దక్కాలంటే కనీసం 45 మంది ఎమ్మెల్యేల మద్ధతు అవసరమని టీడీపీ అంచనా వెస్తోంది. రాజ్యసభ ఎన్నికల ఓటింగ్ భిన్నంగా ఉంటుంది. ప్రస్తుతం వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలతో కలిసి టీడీపీ బలం 23కు చేరింది. గంటా రాజీనామా ఆమోదించడంతో 22 స్థానాలకు పడిపోయింది. కానీ ఇటీవల చాలా మంది టీడీపీతో టచ్ లోకి వచ్చారు. ఇంకా దాదాపు 25 మంది ఎమ్మెల్యేల మద్ధతు అవసరమని లెక్కలు వేసుకుంటుంది. అయితే ఇప్పటికే 50 మంది ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారని టీడీపీ చెబుతుంది. వైసీపీ అసంతృప్తి ఎమ్మెల్యేలే ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలో రాజ్యసభ ఎన్నికల్లోనూ అనూహ్య గెలుపు ఆశిస్తోంది టీడీపీ. వైసీపీలో సీట్లు దక్కని అసంతృప్త ఎమ్మెల్యేల ఓట్లతో రాజ్యసభ ఎన్నికల్లో గెలుపొందవచ్చని టీడీపీ అంచనా వేస్తోంది. టీడీపీ తరపున అభ్యర్థిని నిలపాలని వైసీపీ ఎమ్మెల్యేలే కోరుతున్నారని టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. రాజ్యసభ ఎన్నికల కోసం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, టీడీఎల్పీ ఎలక్షన్ కోఆర్డినేటర్ కోనేరు సురేష్, మరో మాజీ రాజ్యసభ ఎంపీ పేర్లను టీడీపీ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

రాజ్యసభ ఎన్నికలకు ఫిబ్రవరి ఎనిమిదిన నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకూ నామినేషన్ల దాఖలు చేయొచ్చు. 16వ తేదీన పరిశీలన జరుగుతుంది. 20వ తేదీన ఉపసంహరణకు చివరితేదీగా ప్రకటించారు. 27న ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగు జరుగుతుంది. సాయంత్రం ఐదుగంటల నుండి లెక్కింపు మొదలవుతుంది. అదేరోజు ఫలితాలు వెలువడనున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు ముందు పెట్టుకుని బలం ఉన్నా కూడా ఓ రాజ్యసభ స్థానాన్ని కోల్పోతే వైఎస్ఆర్‌సీపీకి నైతిక ధైర్యానికి భారీ దెబ్బ తగులుగుతుంది. అందుకే వైసీపీ హైకమాండ్ టెన్షన్ పడుతున్నట్లుగా కనిపిస్తోంది. ఈ అంశంపై టీడీపీ బలాన్ని వీలైనంతగా తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే ఎంత మందిని తగ్గించినా.. వైసీపీ అసంతృప్త ఎమ్మెల్యేలే అభ్యర్థిని గెలిపించే పరిస్థితి ఉందని టీడీపీ అంచనా వేస్తోంది. టిక్కెట్ల కసరత్తు విషయంలో ఎమ్మెల్యేల్ని బుజ్జగించే విషయంలో పెడసరంగా వ్యవహరించడం.. సరైన గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారన్న విమర్శల తరుణంలో టిక్కెట్ రాని వారు ఇక పార్టీతో సంబంధం ఏమిటన్న స్థితికి వస్తున్నారు. ఇంకా ఐదో జాబితాను వైసీపీ ప్రకటించబోతోంది. మొత్తంగా ఇప్పుడు రాజ్యసభ ఎన్నికలు టీడీపీకి చెలగాటం అయితే.. వైసీపీకి సంకటంగా మారాయని అనుకోవచ్చు. అయితే తమకు బలం తక్కువగా ఉన్నప్పటికీ పోటీలో అభ్యర్థిని నిలబెట్టడానికి కారణం లేకపోలేదంటున్నారు ఆపార్టీ నేతలు.

# గ్రీనరీకీ ప్రాధాన్యత ఇవ్వాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః గ్రీనరీకి ప్రాధాన్యత ఇస్తూ భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా లో ఏర్పాటు చేసిన 15వ గ్రాండ్ నర్సరీ మేళా ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో లభించే అనేక రకాల మొక్కలు ఒకే చోట లభించే విధంగా ఆల్ ఇండియా హార్టికల్చర్ పేరుతో గ్రాండ్ నర్సరీ మేళాను గత పదేళ్లుగా కంటిన్యూగా ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను ఆయన అభినందించారు. దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లోని నర్సరీల్లో పెరిగిన మొక్కలు, మెడిసినల్ ప్లాంట్లు, ఆర్గానిక్ ఫర్టిలైజర్స్ అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రజల ఇష్టాలకు అనుగుణంగా కిచెన్ గార్డెన్, వర్టికల్ గార్డెన్, టెర్రస్ గార్డెన్‌ను హ్యాబీగా చేసుకుని చిన్న పాటి గార్డెన్ ఏర్పాటు చేసుకుంటే ఆక్సిజన్‌తో పాటు వర్క్ ప్రెజర్ తగ్గి మానసిక ఉత్సాహాన్ని పొందగలుగుతామని అన్నారు. పచ్చదనం కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నగర వాసులకు మొక్కల పెంపకం చక్కటి ఆరోగ్యాన్ని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పొందేందుకు తోడ్పాటును అందిస్తాయన్నారు. నేడు మొక్కలను నాటడం భవిష్యత్ తరాలకు మేలు చేసిన వారం అవుతామని చెప్పారు. మొక్కల పెంపకాన్ని ఉద్యమంగా చేపట్టాలని సూచించారు. మేళా ఇంచార్జ్ ఖాలీద్ అహ్మద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 5 వరకు ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు గ్రాండ్ నర్సరీ మేళా జరుగుతుందని తెలిపారు. అంటుకట్టిన మొక్కలు అందుబాటులోకి తెచ్చామని ఖాలీద్ అహ్మద్ వివరించారు.





# ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణస్వీకారం

● స్పీకర్ ఛాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేయించిన సభాపతి గడ్డం ప్రసాద్ ● హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః శాసనసభ సభ్యుడిగా బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రమాణస్వీకారం చేశారు. స్పీకర్ ఛాంబర్లో సభాపతి గడ్డం ప్రసాద్ కేసీఆర్తో ప్రమాణం స్వీకారం చేశారు. కేసీఆర్ ప్రమాణస్వీకారం కార్యక్రమం సందర్భంగా అసెంబ్లీకి భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు తరలివచ్చారు. నవంబర్లో నెలాఖరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గజ్వేల్ శాసనసభ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన విషయం తెలిసిందే. డిసెంబర్లో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలందతో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ ప్రమాణం చేయించిన విషయం తెలిసిందే.అయితే, ఆ సమయంలో ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రంలో పడిపోగా.. తుంటికి గాయమైంది. ఆ తర్వాత ఆయన హైదరాబాద్లోని యశోద ఆసుపత్రిలోకి చికిత్స తీసుకొని కోలుకున్నారు. ఈ క్రమంలో ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణం అనంతరం అసెంబ్లీలోని ప్రతిపక్ష నేత కార్యాలయంలో పూజలు చేశారు. బీఆర్ఎస్ శాసనసభ పక్ష నేతగా కేసీఆర్ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎన్నుకున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్బాబు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు

# నాంది పలికిందే ఇంద్రవల్లి



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః ఇంద్రవెల్లి దళిత గిరిజన దండోరా సభ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు నాంది పలికిందని.. అందుకే సీఎం హోదాలో రేవంత్ రెడ్డి మొదటి సభ కూడా మళ్ళీ అక్కడే నిర్వహిస్తున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి అమర వీరుల స్మృతి వననానికి సీఎం భూమి పూజ చేస్తారని తెలిపారు. అమరవీరుల కుటుంబాలను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఇక్కడి అభివృద్ధిపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. లక్ష మందితో ఇంద్రవెల్లి సభ జరుగుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# కేఆర్ఎంబీ చేతికే ప్రాజెక్టుల నిర్వాహణ

● ఒప్పుకున్న తెలుగు రాష్ట్రాలు ● మాకు అభ్యంతరం లేదు: ఏపీ ఈఎన్‌సీ ● పూర్తిగా అప్పగించలేదు : తెలంగాణ ఈఎన్‌సీ



తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వాహణను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయి. గురువారం ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగింతపై జలసౌధలో కేఆర్ఎంబీ సమావేశం జరిగింది. కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన సమావేశానికి కొనసాగింపుగా ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు అంగీకరించాయి. అలాగే నీటి వాటాల పంపకం కోసం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. దీంతో వాటాల కేటాయింపుపై త్రిసభ్య కమిటీనే తుది నిర్ణయం తీసుకోనుంది. బోర్డు పరిధిలో మొత్తం 15 ఓటిసలలో 9 తెలంగాణ, 6 ఆంధ్రప్రదేశ్వి ఉన్నాయని ఏపీ ఈఎన్‌సీ నారాయణ రెడ్డి తెలిపారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింతపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఆపరేషనల్ కోసం ఇరు రాష్ట్రాల నుంచి స్టాఫ్ కేటాయింపు ఉంటుందని.. వాటర్ కేటాయింపులపై త్రిసభ్య కమిటీ దే తుది నిర్ణయమని తెలిపారు. ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రోటోకాల్ త్రిసభ్య కమిటీ అప్పుడున్న పరిస్థితుల్లో తీసుకుంటారన్నారు. లెఫ్ట్ మెన్ కెనాల్ నుంచి 2 టీఎంసీ, మార్చ్‌లో రైట్ మెన్ కెనాల్ నుంచి 3 టీఎంసీ ఏపీకి విడుదలకు ఒప్పుకున్నారన్నారు. ఏప్రిల్‌లో 5 టీఎంసీలు ఏపీకి ముందుగానే ఉన్నాయన్నారు. ప్రాజెక్టుల ఆపరేషనల్ కోసం తెలంగాణ ఒప్పుకుందని తెలిపారు. ప్రాజెక్టుల ఆపరేటింగ్ అంతా కేఆర్ఎంబీకి ఇవ్వడం జరిగిందని తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ అన్నారు. పవర్ స్టేషన్స్‌పై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. నాగార్జున సాగర్ తెలంగాణ, శ్రీశైలం ఏపీ చూసుకుంటుందని చెప్పారు. ప్రాజెక్టులన్నీ ఇక నుంచి బోర్డు పరిధిలో నడుస్తాయన్నారు. తమ డిమాండ్స్ అన్నీ కేంద్రానికి లేఖలు రాసామని.. ఇంకా అక్కడ నుంచి నిర్ణయం రాలేదన్నారు. నీటి వాటాల పంపకంపై త్రిసభ్య కమిటీనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రాజెక్టుల వద్ద భద్రత అనేది పరిస్థితిని భట్టి బోర్డు కనుసన్నల్లో జరుగుతుందని చెప్పుకొచ్చారు. కేఆర్ఎంబీ పరిధిలో ఉన్న 15 ప్రాజెక్టులన్నీ బోర్డు పరిధిలోకి వెళ్తాయన్నారు. ప్రాజెక్టులను పూర్తిగా అప్పగించలేదని... ఆపరేషనల్, నీటి విడుదల బోర్డు చూసుకుంటుందని తెలిపారు. సీఆర్‌పీఎఫ్ కూడా కృష్ణా బోర్డు పరిధిలోనే ఉంటాయన్నారు. నిర్వహణ కోసం స్టాఫ్ కేటాయింపు 40 : 45 కావాలని అడుగుతున్నారని వెల్లడించారు

# సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫైర్



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః సీఎం రేవంత్ రెడ్డి సిగ్గు, శరం లేకుండా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, మాణిక్ రావు అన్నారు. ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడుతూ.. కేసీఆర్ కొత్త ఇన్నింగ్స్ మొదలు కాబోతోందన్నారు. ఉద్యోగాలపై కాంగ్రెస్ నేతలు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని, అబద్దాల పునాదుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని ఆరోపించారు. ఈ రోజు ఫిబ్రవరి1 ..కాంగ్రెస్ జాబ్ కేలెండర్ ప్రకారం నేడు గ్రూప్ వన్ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. రేవంత్ రెడ్డికి ఏమైనా మతిమరుపు వచ్చిందా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఉదయం 6 గంటల నుంచి పని మొదలు పెట్టి రాత్రి రెండు గంటల వరకు ప్రజల కోసమే పని చేస్తాడు. అలాంటి వ్యక్తితో నీకు పోలికే దన్నారు. హరీశ్ రావు శ్రమ వల్లే నిన్న రేవంత్ ఇచ్చిన నర్సింగ్ ఆఫీసర్ల ఉద్యోగాలు సాకారం అయ్యాయని గుర్తు చేశారు. బిల్లా, రంగాలకు ప్రతి రూపం రేవంత్ రెడ్డి. అందుకే ప్రతి రోజూ వాళ్ల పేర్లు గుర్తుకు తెచ్చుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను బొంద పెడతా అని సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి మాట్లాడొచ్చా? రేవంత్ సీఎంలా వ్యవహరించాలి. కానీ రౌడీ లా కాదు అని హితవు పలికారు. కేసీఆర్ పాలనలో లోపాలు వెతకడం కాదు..ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఎవరు కూడా 200 యూనిట్ల వరకు కరెంటు బిల్లులు కట్టోదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తేనే హామీలు అమలు చేస్తామని రేవంత్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. రేవంత్ ఆటలు సాగనివ్వమన్నారు.



# సిట్టింగ్ ఎంపీకి టిక్కెట్ దక్కేనా

● సెంటిమెంట్ జిల్లాలో గులాబీ బాస్ చూపు ఎవరి వైపు ● ఓరుగల్లులో వేడెక్కుతున్న రాజకీయం

తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః పార్లమెంట్ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ అన్ని ప్రధాన రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు కొనసాగుతోంది. ప్రధానంగా ఎస్సీ ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై అన్ని పార్టీలు ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలకు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచిన వరంగల్ లోక్ సభ స్థానంపై ఫోకస్ పెంచాయి.కాంగ్రెస్ పార్టీ ఈసారి ఎలాగైనా ఓరుగల్లు ను తిరిగి కైవసం చేసుకుని కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే ఉక్కు సంకల్పంతో ఉంది ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జి కొండా సురేఖ గెలువు వ్యూహాలపై నేతలతో సమాలోచనలు జరువుతున్నారు. మరోవైపు భారతీయ జనతా పార్టీ సైతం వరంగల్ ఉమ్మడి జిల్లాపై పట్టు సాధించాలంటే ఈసారి ఎలాగైనా వరంగల్ పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకోవాలని కసరత్తు చేస్తోంది. బలమైన అభ్యర్థి ని బరిలోకి దింపే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు కమలనాథులు.అయితే ఇప్పటికే రెండు పర్యాయాలు వరుసగా గెలుస్తున్న బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయంపై గురి పెట్టింది. బలమైన అభ్యర్థి ఎంపికపై మేథోమథనం చేస్తోంది. గత రెండు పర్యాయాలు బీఆర్ఎస్ పార్టీ గాలిలో అలవోకగా తెలిసిన సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్‌కు ఈసారి విశ్రాంతి తప్పదని ప్రచారం జరుగుతుంది. మరీ ఆయన స్థానంలో ఎవరిని బరిలోకి దింవుతారు..? ఎవరికీ ఈ సీట్ కట్టబెట్టబోతున్నారు అనే చర్చ బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతోంది. ప్రస్తుతం ఐదుగురి పేర్లు ప్రచారంలో ఉన్నాయి.. వారిలో ముఖ్యంగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్య, నర్సంపేట ఎమ్మెల్యే సతీమణి స్వప్న, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ నాయకుడు జోరిక రమేష్, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కల్పన పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే, వీరిలో ఎవరిని నిలబెట్టినా ఎన్నికల ఖర్చు పార్టీ అధిష్టానమే భరించాల్సి వస్తుండడంతో వీరిలో బలమైన అభ్యర్థి ఎవరు.? ఎవరి వైపు ఓరుగల్లు ప్రజలు ఉన్నారు అనే దానిపైన సర్వేలు కొనసాగుతున్నాయట. ఆ సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పార్టీలో ఆసక్తికర చర్చ సాగుతోంది. మరి ఓరుగల్లు ప్రజల ఆశీర్వాదం ఎవరి వైపు ఉంటుందో..? ఈసారి కూడా బీఆర్ఎస్ కు హ్యాట్రిక్ విక్టరీ అందిస్తారా..? లేక అధికార కాంగ్రెస్ పార్టీకి ఓరుగల్లు పార్లమెంటు సీటు కట్టబెడతారా..? లేదంటే బీజేపీని ఇక్కడ నుండి గెలిపించి కాషాయ జెండా పాటుతారో వేచి చూడాలి..

# సర్పంచ్ పదవికి మాత్రమే విరమణ.. ప్రజా సేవకు కాదు

### ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసింది. శుక్రవారం నుంచి రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి రానుంది. ఈ క్రమంలో సర్పంచ్లు తమ పదవి నుంచి వైదొలగనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ (ఎక్స్ ) ద్వారా స్పందించారు. ఇది సర్పంచ్ పదవికి మాత్రమే విరమణ తప్ప ప్రజాసేవకు కాదని అన్నారు. ఐదేళ్ల కాలం తెలంగాణ ప్రజానీకానికి ఇతోధికంగా సేవచేసిన గ్రామ సర్పంచ్లు పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా వారికి కేటీఆర్ కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ గ్రామాల్లో నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠ ధామాలు నెలకొల్పడంలో, దేశానికి ఆదర్శంగా నిలిపిన కృషిలో సర్పంచ్ల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. వాళ్లు మరింతకాలం ప్రజాసేవలో ఉండాలని ఆశిస్తున్నానని అన్నారు.

# స్వరం మార్చిన మల్లారెడ్డి

● రేవంత్ రెడ్డి క్లోజ్ అంటూ వివరణ ● త్వరలో కాంగ్రెస్ గూటికి చేరుతారని ప్రచారం



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః మాజీమంత్రి, ఫైర్ బ్రాండ్ మల్లారెడ్డి స్వరం మార్చారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ నాటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిపై తొడగొట్టిన మల్లారెడ్డి ఇప్పుడు టోన్ మార్చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన దోస్త్ అని.. మంచి క్లోజ్ అని సెలవిచ్చారు. గురువారం నాడు మల్లారెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. రేవంత్ రెడ్డితో కలిసి తెలుగుదేశం పార్టీలో కలిసి పనిచేశామని వివరించారు. త్వరలో సీఎం రేవంత్‌ను కలుస్తానని స్పష్టంచేశారు. రేవంత్‌తో సమావేశం సానుకూలంగా జరుగుతుందని విశ్వాసంతో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతామని కలలో కూడా అనుకోలేదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తోందని ఊహించలేదని పేర్కొన్నారు. ఓటమి షాక్ నుంచి ఇంకా తేరుకోలేమని వివరించారు. మల్కాజిగిరి నుంచి లోక్ సభకు పోటీ చేయాలని తనను కేటీఆర్ అడిగారన్నారు. తన కుమారుడు భద్రారెడ్డిని బరిలోకి దింపాలని అనుకుంటున్నానని స్పష్టంచేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మల్లారెడ్డిపై కేసు నమోదైంది. గిరిజనుల భూమి కబ్జా చేశారని శామీర్ పేట్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఫైల్ అయ్యింది. మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో సర్వే నంబర్ 33, 34, 35లో గల 47 ఎకరాల 18 గుంటల భూమిని మల్లారెడ్డి పేరు రిజిస్ట్రేషన్ అయ్యింది. దానిపై భూమి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మల్లారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఆ కేసు నడుస్తుండగా మల్లారెడ్డి సీఎం రేవంత్ రెడ్డి తనకు క్లోజ్ అని కామెంట్స్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల సమయంలో భూ కబ్జాలు, బ్రోకర్ పనులు చేశావని రేవంత్ రెడ్డి ఆరోపించగా.. మల్లారెడ్డి తొడగొట్టి మరి సవాల్ విసిరారు. ఎన్నికలు జరిగి అధికార మార్పిడి జరిగింది. రేవంత్ రెడ్డి సీఎం కావడంతో ఓ కేసు నమోదైంది. ఇంతలో రేవంత్ తనకు దోస్త్ అంటున్నారు. దీంతో మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరతారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

# ప్రభుత్వ సలహాదారుగా హర్కర వేణుగోపాల్ రావు



తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా హర్కర వేణు గోపాలరావు గురువారం పదవీ భాద్యతలను స్వీకరించారు. బి.అర్.అంబేడ్కర్ సచివాలయంలో తన కార్యాలయంలో వేదపండితులు నిర్వహించిన పూజల అనంతరం పదవీ భాద్యతలను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోటోకాల్, ప్రజాసంబంధాల సలహాదారుగా పదవీ భాద్యతలు స్వీకరించిన హర్కర వేణుగోపాల్ రావును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమీషన్ చైర్మన్ కృష్ణ మోహన్ రావు, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ అశోక్ రెడ్డి, మాజీ ఎంపీలు వీ హనుమంత రావు, సుబ్బరామిరెడ్డి, మధు యాష్కీ, దీపా దాస్ తదితర ప్రజాప్రతినిధులు పూల గుచ్చాలతో అభినందించారు.

# డైరీని ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః సచివాలయంలో టిఎన్జీవోస్ ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ సెంట్రల్ ఫోరమ్ డైరీని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ ఆవిష్కరించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఫోరమ్ అధ్యక్షులు పొన్న మల్లయ్య, ఉపాధ్యక్షులు కెఎస్ ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఫారెస్ట్ డిపార్ట్ మెంటులో సూపరిండెంట్ లుగా పనిచేస్తున్న వారికి గెజిటెడ్ హోదా కల్పించాలని ఈ సందర్భంగా వారు మంత్రిని కోరారు. మేడారం వచ్చే భక్తులకు పర్యావరణ రుసుము నుంచి మినహాయింపు త్వరలో జరగనున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా జాతర ముగిసే వరకు అక్కడ అటవీశాఖ వసూలు చేస్తున్న పర్యావరణ రుసుమును నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని మంత్రి తెలిపారు. ఫిబ్రవరి 2 నుంచి 29 దాకా పర్యావరణ రుసుము (ఎన్విరాన్ మెంట్ ఇంపాక్ట్ ఫీజు) వసూలు నిలిపివేస్తున్నట్లు అటవీ శాఖ తెలిపింది. చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జాతరకు వచ్చే వాహనాలు, రద్దీ నియంత్రణ కూడా కొంత మేరకు సులువు అయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం ములుగు జిల్లా అటవీ అధికారి తక్షణ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో తెలిపారు.

ఏటూరు నాగారం అభయారణ్యం పరిధిలో పస్రా, తాడ్వాయి, ఏటూరు నాగారంల నుంచి వచ్చే వాహనాల నుంచి నామమాత్రపు పర్యావరణ రుసుమును ఇప్పటిదాకా అటవీ శాఖ వసూలు చేస్తోంది. ఇలా వచ్చే ఆదాయంలో అటవీ ప్రాంతాల రక్షణకు, ప్లాస్టిక్ ను తొలగించేందుకు, వన్యప్రాణుల రక్షణకు అటవీ శాఖ వినియోగిస్తోంది. అయితే వివిధ వర్గాల నుంచి విజ్ఞప్తి మేరకు జాతర ముగిసే దాకా ఈ ఫీజు వసూలు నిలిపివేస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులు అటవీ ప్రాంతాన్ని వీలైనంత పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని అటవీశాఖ కోరింది

కర్మన్ ఘాట్ దేవస్థాన ట్రస్ట్ బోర్డు, సభ్యులు, అర్చకులు మంత్రితో భేటీ కర్మన్ ఘాట్ శ్రీ ధ్యాన ఆంజనేస్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు, అర్చుకులు గురువారం సచివాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి స్వామి వారి ప్రసాదం, శేష వస్త్రాలు సమర్పించి, ఆశీర్వచనాలను అందించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాల్సిందిగా మంత్రిని ఆహ్వానించారు. ఆలయ ఈవో శ్రీనివాస శర్మ, ప్రధానార్చకులు అంబ ప్రసాద్ తదితరులు మంత్రిని కలసిన వారిలో ఉన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీసుకున్న సంచలన నిర్ణయం పట్ల రాష్ట్ర మాల మహానాడు దళిత నాయకుడు బత్తుల రవి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇక పై నంది అవార్డును ప్రజా గాయకుడు, ఉద్యమకారుడు గద్దర్ పేరిట అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రజా సంఘాలు, దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా బత్తుల రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రజా యుద్దనౌక గద్దర్ కీలకంగా వ్యవహరించారని, సీఎం రేవంత్ రెడ్డి, గద్దర్‌ను ప్రజలకు మరింత చేరువ చేశారని కొనియాడారు.



# సమస్యల సాధనకు ఉద్యమిద్దాం

● జర్నలిస్టుల సమస్యల పరిష్కార ఐక్యత సమావేశం పిలుపు
● జర్నలిస్టుల పోరాట ఐక్య వేదిక ఆవిర్భావం అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులందరు కలిసి ఉద్యమించాల్సిన అవసరం ఉందని జర్నలిస్టుల సమస్యల పరిష్కార ఐక్యత సమావేశం అభిప్రాయపడింది...తమ సమస్యల సాధనకోసం జర్నలిస్టులందరు కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని సమావేశం పిలుపునిచ్చింది. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉద్యమిద్దాం అనే నినాదంతో హన్మకొండలోని తోటాస్ బ్యాంకెట్ హాల్ లో గురువారం నిర్వహించిన సమావేశంలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ నాంపల్లి నంబూద్రి పాద్ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించి దాదావు సంవత్సర కాలం గడుస్తున్న ప్రెస్ క్లబ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ ని ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. గత పాలకవర్గం ప్రెస్ క్లబ్ ధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపణలు చేసిన ప్రస్తుత పాలకవర్గం ఆ డబ్బులను రాబట్టడంలో విఫలం ఐయిందన్నారు. జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ హామీల అమలు ఎప్పుడు అని ప్రశ్నించిన వారిని బెదిరించే ధోరణిలో మాట్లాడడం సరికాదన్నారు...ప్రశ్నించడం తమ హక్కన్న నంబూద్రి జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తాను ఎప్పుడు ప్రశ్నించే గొంతుకగానే ఉంటానన్నారు. మరో సీనియర్ జర్నలిస్ట్ కంజర్ల నర్సింహారాములు మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో అర్హులైన జర్నలిస్టులకు సభ్యత్వం కోసం కృాఎషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజం లో కొనసాగుతూ ఒక్కో జర్నలిస్ట్ ముప్పై సంవత్సరాల సీనియారిటీ ని కలిగి ఉన్న ఇప్పటికి ఇంటి స్థలం లేకపోవడం బాధాకరమన్నారు. ఇంటి స్థలాల కోసం జర్నలిస్టులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ మగ్ధుమ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. జర్నలిస్టులందరు ఐక్యంగా పోరాటం చేసి సమస్యలను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. సీనియర్ జర్నలిస్ట్ సిరిపురం తిరుపతి రెడ్డి మాట్లాడుతూ సమస్యల సాధన కోసం ఓ ఐక్య కార్యచరణతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ జర్నలిస్ట్ నూటంకి ప్రభాకర్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇంటి స్థలాల సాధన కోసం తాము నలభై రెండు రోజులు దీక్షలు చేపట్టామని...జర్నలిస్టుల దీక్ష శిబిరాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించి తమకు మద్దతు సైతం తెలిపారని గుర్తు చేశారు... అవసరమైతే సీ ఎం రేవంత్ రెడ్డి ని కలిసి ఇంటి స్థలాల విషయంలో ఓ మెమోరాండం సమర్పిస్తామన్నారు...సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు వేణుమాధవ్, చెన్న రామకృష్ణ,టి వి రాజు గౌడ్,తక్కెళ్లపల్లి శ్రీనివాస్,ఎం డి శెంషోద్దీన్, శివశంకర్ ,జర్నలిస్టులు లక్ష్మీనారాయణ, ఎం ఎస్ రావు,గడ్డం రాజేందర్, నమిడ్ల ప్రమోద్, దురిశెట్టి మధుకర్,తదితర సంఖ్యలో పాల్గొన్నారు.

జర్నలిస్ట్ పోరాట ఐక్య వేదిక ఆవిర్భావం : అడహక్ కమిటీ ఏర్పాతు

జర్నలిస్ట్ సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టుల ఆధ్వర్యంలో జర్నలిస్ట్ పోరాట ఐక్య వేదిక ఆవిర్భవించింది.వేదిక అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు జర్నలిస్టుల పోరాట ఐక్య వేదిక కన్వీనర్‌గా నాంపల్లి నంబూద్రి పాద్ సభ్యులుగా చెన్న రామకృష్ణ,నూటెంకి ప్రభాకర్,సయ్యద్ మగ్ధుమ్,సిరిపురం తిరుపతి రెడ్డి, ఆనంతుల రమేష్,ఎం డి శంషోద్దీన్,శివశంకర్,లక్ష్మినారాయణ, బూజుగుండ్ల శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడిగా టివిరాజుగౌడ్‌ను ఎన్నుకున్నారు.

### బడ్జెట్ నిరాశాజనకం...
## ప్రసంగమంతా సొంత డబ్బాలా ఉంది

- అది చేశాం... ఇది చేశామంటూ గొప్పలు చెప్పుకునే ప్రయత్నమని విమర్శ
- తెలంగాణకు బడ్జెట్‌లో మొండిచేయి చూపించారని బీఆర్ఎస్ ఎంపీల విమర్శలు
- నిర్మలా సీతారామన్ ప్రసంగం రాజకీయ ప్రసంగాన్ని తలపించిందని వ్యాఖ్య

హైదరాబాద్... కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్పై బీఆర్ఎస్ ఎంపీలు కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు స్పందించారు. ఈ బడ్జెట్ నిరాశాజనకంగా ఉందన్నారు. బడ్జెట్ ప్రసంగమంతా సొంత డబ్బాలాగా ఉందని విమర్శించారు. అది చేశాం... ఇది చేశామంటూ గొప్పలు చెప్పుకునే ప్రయత్నం తప్ప ఏమీ లేదన్నారు. తెలంగాణకు ఎప్పటిలాగే మొండిచేయి చూపించారని విమర్శించారు. విభజన హామీలు, తెలంగాణకు రావాల్సిన నిధుల గురించి ఎక్కడా ప్రస్తావించలేదన్నారు.

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం కోసం మాత్రమే బడ్జెట్ ప్రసంగాన్ని వాడుకున్నారని ఆరోపించారు. దేశ ప్రజల భవిష్యత్తుకు ఎలాంటి భరోసా కల్పించలేకపోయారన్నారు. కేంద్ర ఆర్థికమంత్రి ప్రసంగం రాజకీయ ప్రసంగాన్ని తలపించిందన్నారు. మధ్యంతర బడ్జెట్ ఏ వర్గాన్నీ సంతృప్తిపరచలేక పోయిందన్నారు. ఒక్క కొత్త సంక్షేమ పథకం బడ్జెట్లో ప్రస్తావించలేదని విమర్శించారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగ నిర్మూలనకు ఏం చేస్తారో చెప్పలేదన్నారు.



ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే ప్రణాళికలు లేవన్నారు.

రైతులకు... వ్యవసాయానికి ఏమాత్రం బడ్జెట్లో ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. సామాన్యులకు, ఉద్యోగులకు ఎలాంటి ఊరట దక్కలేదని ఆరోపించారు. అయ్యూష్మాన్ భారత్ పథకం కింద అందించే కవరేజ్ రూ.10 లక్షలకు పెంచుతారని ఎదురు చూసిన వారికి నిరాశే ఎదురైందన్నారు.

# బాబు వస్తేనే రాష్ట్రం బాగుపడుతుంది

- రెండోరోజు కొనసాగిన నిజం గెలవాలి కార్యక్రమం
- గుడ్లూరు మండలంలో మూడు కుటుంబాలను పరామర్శించిన నారా భువనేశ్వరి

కందుకూరు, మేజర్‌న్యూస్: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా 2వ రోజు నారా భువనేశ్వరి పర్యటన గుడ్లూరు మండలంలో కొనసాగింది. ముందుగా గుడ్లూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భువనేశ్వరిని చూసేందుకు వెల్లువలా తరలివచ్చారు. మహిళలు రోడ్డు కిరువైపులా బారులు తీరి స్వాగతం



పలికారు. తొలుత గుడ్లూరు లోని కర్పూరపు సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని నారా భువనేశ్వరి, టిడిపి కందుకూరు ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆమెతో కలసి పరామర్శించారు. సుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మూడు లక్షల రూపాయల చెక్కును సుబ్రమణ్యం భార్య రమాదేవికి అందజేశారు. మీ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెబుతూ, సుబ్రహ్మణ్యం లాంటి కార్యకర్తలను పోగొట్టుకోవటం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.భువనేశ్వరి వెంట అనంతరం గుడ్లూరులో పువ్వాడి చినవెంకయ్య కుటుంబాన్ని పరామర్శించారు. చినవెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు 3 లక్షల చెక్కును అందజేశారు. తదుపరి గుడ్లూరు మండలంలోని దారకానిపాడు గ్రామంలో చంద్రబాబు అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో మనోవేదనతో కన్నుమూసిన దగ్గుమాటి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, 3 లక్షల ఆర్థిక సహాయాన్ని, ఆయన భార్య కోటేశ్వరమ్మకు అందించారు.

**నేడు రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది...**

ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి తీరని అన్యాయం ద్రోహం జరిగాయని భువనేశ్వరీ పేర్కొన్నారు. మళ్లీ బాబు వస్తేనే రాష్ట్రం బాగుపడుతుంది, యువతకు ఉద్యోగాలు వస్తాయి. ప్రతి ఒక్కరికి తప్పకుండా మేలు జరుగుతుందిఅన్నారు. మహిళలు యువత ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం నిజంగెలవాలి ఉదయగిరి నియోజకవర్గంలో ప్రవేశించింది. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు, ఒంగోలు మాజీ



శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు టిడిపి ఇన్చార్జ్ బి.విజయ్ కుమార్, మాజీ శాసనసభ్యులు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ దివి శివరాం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ పరిశీలకురాలు కుసుమకుమారి, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు దివి సౌభాగ్య, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, గుడ్లూరు మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు జొన్నలగడ్డ రమణమ్మ, ఇతర నాయకులు పాల్గొన్నారు.



### భ్రమరాంబ, మల్లికార్జునస్వామి వారిని
## దర్శించుకున్న నారా లోకేశ్

శ్రీశైలం, సూర్య బ్యూరో ప్రతినిధి : శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారిని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయం వద్ద లోకేశ్తో పాటు ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్కు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి రుద్రభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అర్చకులు వారికి వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. తొలుత సాక్షి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

## రాజమండ్రి లోక్‌సభ బరిలో కంభంపాటి

- ఇప్పటికే నిర్ణయం తీసుకున్న టీడీపీ అధినేత
- తెలుగు దేశం పార్టీకి కంచుకోటలో జెండా ఎగరేసే యత్నం
- మరోసారి తమ ఖాతాలో వేసుకునేందుకు అధిష్టానం కీలక పావులు

రాజమండ్రి : ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ రాష్ట్రంలో రాజకీయం రంజుగా మారుతోంది. రోజుకొక కొత్తపేరు తెరపైకి వస్తుండటంతో సామాన్య కార్యకర్తలతోపాటు కాకలు తీరిన నేతలు సైతం తలలు పట్టుకుంటున్నారు. నిన్నటి వరకు సీటుపై ఉన్న గ్యారెంటీ తెల్లారితే ఉండటం లేదు. అన్న సీటు వచ్చి గెలిస్తే ఆదుకుంటాడని వెనక తిరిగి జేజేలు కొట్టిన అనుచరగణానికి ఏమీ అంతుబట్టడం లేదు. పొత్తులు, ఎత్తులు, కుల సమీకరణాలు బేరీజు వేసుకునిగానీ.. ప్రధాన పార్టీలు సీట్లు కన్ఫర్మ్ చేయడం లేదు.



ముఖ్యమైన సీట్లు, పార్టీకి పట్టున్న ప్రాంతాల్లో కాస్త పెట్టుబడి పెట్టగలిగిన వారి కోసమే అన్వేషిస్తున్నాయి. విశాఖ నుంచి విజయవాడకు మధ్యలో ఎంతో కీలకమైన రాజమహేంద్రవరం లోక్ సభ సీటుపై ప్రత్యేకంగా దృష్టిసారించాయి. తెలుగు దేశం పార్టీకి కంచుకోట అయిన ఈ స్థానాన్ని మరోసారి తమ ఖాతాలో వేసుకునేందుకు అధిష్టానం కీలక పావులు కదువుతోంది. గతంలో ఇక్కడి నుంచి విజయం సాధించిన పార్టీ సీనియర్ నేత మురళీమోహన్ కుటుంబం ఈసారి ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఆయన కోడలు రూప సైతం ఆసక్తి చూపకపోవడంతో తెలుగుదేశం కొత్త అభ్యర్థిని రంగంలోకి దించింది.

**చంద్రబాబుకు నమ్మినబంటు**

చంద్రబాబుకు నమ్మినబంటుగా ఢిల్లీస్థాయిలో చక్రం తిప్పగలిగే నేతగా, అత్యంత వివాదరహితుడిగా ఉన్న మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావును ఈసారి రాజమండ్రి బరిలో దింపేందుకు తెలుగుదేశం పార్టీ రంగం సిద్ధం చేస్తోంది. ఆర్థికంగానూ, సామాజికవర్గపరంగానూ అధికారపార్టీని ఢీకొట్టాలంటే గట్టి క్యాండెట్ ను నియమించాలని చంద్రబాబు నిర్ణయించుకున్నారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ విధేయుడిగా.. అధినేత చెప్పిన పని చెప్పినట్లు చేసి పెడతారని కంభంపాటి రామ్మోహనరావుకు పేరు. కష్టకాలంలో ఎంతోమంది పార్టీని వీడినా జగన్ వంటి నేతల బెదిరింపులకు తలొగ్గక ఎల్లప్పుడూ పార్టీనే అంటిపెట్టుకుని ఉండటం ఆయనకు కలిసొచ్చినట్లు ఉంది. లక్ష్మీ ఆటోమొబైల్స్ పేరిట రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వందల సంఖ్యలో బైక్ లు, కార్ల షోరూంలు కలిగిఉన్న కంభపాటి రామ్మోహనరావు ఆర్థికంగానూ మంచి స్థితిమంతుడు కావడంతో రానున్న ఎన్నికల్లో రాజమహేంద్రవరం నుంచి ఎంపీగా ఆయన పేరు ప్రస్ఫుటంగా వినిపిస్తోంది. ముఖ్యంగా వివాదరహితుడిగా ఉండటం, పార్టీలో అందరితోనూ కలువుగోలుతనంగా ఉండటం ఆయనకు కలిసొచ్చే అంశాలుగా చెబుతున్నారు.

**రిజర్వ్ బెంచ్ ఖాళీ లేదు**

ఒకవేళ కంభంపాటి రామ్మోహనరావు కాదనుకుంటే పార్టీ సీనియర్ నేత బొడ్డు భాస్కర రామారావు తనయుడు బొడ్డు వెంకటరమణతోపాటు గన్ని కృష్ణ, శిష్టా లోహిత్ పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో బొడ్డు వెంకటరమణ కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆయన తండ్రి భాస్కర రామారావు...తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఆ పార్టీలోనే పనిచేశారు. పెద్దాపురం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేశారు. వీరి కుటుంబానికి జిల్లాలో రాజకీయంగా మంచి పలుకుబడి ఉండటంతోపాటు రాజమండ్రి లోక్ సభ నియోజకవర్గం వ్యాప్తంగా అనుచరణం ఉంది. ఇప్పుడు తెలుగుదేశంలో ఉన్న చాలామంది నేతలు భాస్కర రామారావు శిష్యులే. దీంతో ఆయను వెంకటరమణ పేరు పరిశీలనలో ఉంది. మరో కీలక నేతలు గన్ని కృష్ణ శిష్టా లోహిత్ పేర్లు సైతం అధిష్టానం పరిశీలనలో ఉన్నాయి.

**లోక్ సభ బరిలో మంత్రి**

సిట్టింగ్ ఎంపీ మార్గాని భరత్ ను ఈసారి రాజమండ్రి సిటీ నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా వైకాపా బరిలో దించుతోంది. గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైకాపా ఫ్యాన్ గాలి వీచినా..రాజమండ్రిలో మాత్రం ఆ పార్టీకి ఉక్కపోత తప్పలేదు. సిటీ, గ్రామీణ రెండు సీట్లు తెలుగుదేశం ఎగరేసుకుపోయింది. ముఖ్యంగా సిటీలో ఆదిరెడ్డి వాసు ఆధిపత్యం అధికారపార్టీకి మింగుడుపడటం లేదు.

# ప్రజలను వేధిస్తే వేటే

- అధికారులను హెచ్చరించిన సీఎం రేవంత్ రెడ్డి
- మహబూబ్ నగర్‌లో అతి చేసిన విద్యుత్తు అధికారులపై చర్యలు
- డిస్కం డైరెక్టర్‌కు ఉద్వాసన
- ఎస్ఈపై బదిలీ వేటు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: ప్రజలను ఇబ్బంది పెట్టి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే అధికారులపై కఠినంగా ఉంటామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అధికారులు తమకు తోచినట్లుగా సొంత నిర్ణయాలు తీసుకుంటే సహించేది లేదని అన్నారు. ఇటీవల మహబూబ్నగర్ జిల్లాలో రైతులకు సంబంధించిన వ్యవసాయ కనెక్షన్లపై తనిఖీలు చేయటంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సచివాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల సమీక్ష జరుగుతుండగా ఈ అంశం చర్చకు వచ్చింది. రైతుల వ్యవసాయ కనెక్షన్లపై సర్వే చేయాలని చెప్పిందెవరు..? తనిఖీ చేయాలని ఆర్డర్లు ఇచ్చింది ఎవరు...? అని సమీక్షలో ఉన్న ట్రాన్స్ కో సీఎండీ రిజ్వి ని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకున్నారా, లేదా అని ఆరా తీశారు. సమావేశంలోనే ఉన్న ఉప ముఖ్యమంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పందించి.. రైతుల కరెంట్ కనెక్షన్ల తనిఖీ, సర్వే చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని సీఎంకు వివరించారు. శాఖాపరమైన నిర్ణయమేదీ లేకుండానే డిస్కం డైరెక్టర్ (ఆపరేషన్స్) జె.శ్రీనివాసరెడ్డి సొంతంగా ఆదేశాలు ఇచ్చాడని, ఆయన ఆదేశాల మేరకు అక్కడున్న ఎస్ఈ ఎన్ఎస్ఆర్ మూర్తి ఈ చర్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలోనే డైరెక్టర్ శ్రీనివాసరెడ్డిని విధుల నుంచి తొలగించామని, ఎస్ఇని అక్కడి నుంచి బదిలీ చేశామని ఉప ముఖ్యమంత్రి జరిగిన సంఘటనను మొత్తం వివరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ప్రయత్నిస్తే ఇలాంటి చర్యలు తప్పవని, తమకు తోచినట్లు సొంత నిర్ణయాలు తీసుకొని ఉద్యోగాలు పోగొట్టుకోవద్దని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు.

# విశాఖ ఎంపీగా బరిలోకి జీవీఎల్
## పురందేశ్వరికి ప్రత్యామ్నాయ సీటు!

### పావులు కదుపుతున్న భారతీయ జనతా పార్టీ

విశాఖపత్నం ..విశాఖపట్నం ఎంపీ స్థానం నుంచి బరిలోకి దిగేందుకు భారతీయ జనతా పార్టీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహ రావు జోరుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా పోటీ చేసినా, ఒంటిరిగా పోటీ చేసినా ఇక్కడి నుంచి బరిలో దిగేందుకు ఆయన సన్నాహాలు చేసుకుంటున్నారు. గడిచిన నాలుగేళ్ల నుంచి విశాఖ వేదికగానే ఆయన రాజకీయ కార్యాకలాపాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి సంబరాలు పేరుతో భారీ ఎత్తున పండగను నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను బీచ్ రోడ్డులో జీవీఎల్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు ఉత్సాహ భరిత వాతావరణంలో నిర్వహించారు. ఇవన్నీ నిర్వహించడం వెనుక వచ్చే ఎన్నికల్లో పార్లమెంట్ స్థానానికి జీవీఎల్ పోటీ చేయడమేనని చెబుతున్నారు. ఇందుకు కేంద్ర అధినాయకత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెబుతున్నారు. పొత్తు కుదిరితే ఉమ్మడి అభ్యర్థిగా విశాఖ నుంచి ఆయన బరిలో ఉంటారు. పొత్తు లేకపోయినా పోటీ చేసేందుకు ఆయన సన్నాహాలు చేసుకుంటున్నారు.

**పురందేశ్వరికి ప్రత్యామ్నాయ సీటు!**

టీడీపీ, జనసేనతో పొత్తు ఉంటే బీజేపీ నుంచి విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో దిగాలని మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి భావించారు. కానీ, జీవీఎల్ ఇక్కడ ముందుగానే కర్చీప్ వేయడం, దానికి అధినాయకత్వం నుంచి కూడా కొంత వరకు



మద్దతు ఉండడంతో ఆమె పునరాలోచనలో పడినట్టు చెబుతున్నారు. పొత్తు ఉంటే విశాఖ నుంచి పోటీ చేసేందుకు తుది వరకు ప్రయత్నించాలని ఆమె భావిస్తున్నారు. ఒకవేళ కాని పక్షంలో మరో చోట నుంచి పోటీ చేయనున్నారు. ఇందుకోసం మెరుగైన ఎంపీ సీటును ఆమె వెతికే పనిలో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. పొత్తుకు ఓకే అయితే బీజేపీకి ఐదు నుంచి ఏడు ఎంపీ స్థానాలు ఇచ్చే అవకాశముందని చెబుతున్నారు. విజయ వాడ, విశాఖ, రాజమండ్రి, రాజంపేటతోపాటు మరికొన్ని పార్లమెంట్ స్థానాలు ఉన్నట్టు చెబుతున్నారు.

**క్షేత్రస్థాయిలో జీవీఎల్ నరసింహరావు**

బీజేపీ ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాలని భావించిన జీవీఎల్ నరసింహారావు ముందు నుంచే ఆ దిశగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. స్టీల్ప్లాంట్ కోసం పార్లమెంట్లో చర్చ లేపడం, రైల్వే జోన్ గురించి మాట్లాడడం, స్థానికంగా ఉన్న సమస్యలపై పార్లమెంట్ వేదికగా ప్రస్తావించడంతోపాటు స్థానికంగా ఉండే కీలక వర్గాలతో ఆయన ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ వస్తున్నారు. ఇప్పటికే వివిధ సామాజికవర్గాలకు సంబంధించిన ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించారు. అసోసియేషన్లు, యూనియన్లతోనూ సత్సంబంధాలను నెరవుతూ వస్తున్నారు. విశాఖలో భారీగా ఉన్న ఉత్తరాది ఓటర్లు, ప్రధాని మోదీ మానియా, ఇతర అంశాలు తనకు కలిసి వస్తాయని ఆయన అంచనా వేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి విజయం సాధించి మరోసారి పార్లమెంట్లో అడుగుపెడతానని ఆయన సన్నిహితులు వద్ద చెబుతుండడం గమనార్హం.

# 2047 నాటికి అభివృద్ధి భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

- మౌలిక రంగానికి, స్కిల్ ఇండియాకు కేంద్ర తోడ్పాటును స్వాగతిస్తున్నాం
- విభజనచట్టం హామీల అమలుకు నిధులు సాధించడంలో జగన్ మరోమారు విఫలం
- వైసీపీకి 31 మంది ఎంపీలు ఉన్నా ఉపయోగం శూన్యం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె. అచ్చెన్నాయుడు

అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : స్వాతంత్ర్యం సాధించి 2047 నాటికి 100 ఏళ్లు పూర్తి చేసుకునే సమయానికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేలా కేంద్ర బడ్జెట్ ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు అన్నారు. బడ్జెట్ నిర్ణయాలు ఆ లక్ష్యసాధన దిశగా ఉన్నాయని ఆయన కొనియాడారు. మౌలిక రంగానికి, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వడం మంచి పరిణామని అచ్చెన్న అన్నారు. దేశ గతిని మార్చే మౌలిక రంగానికి 11 లక్షల కోట్లు కేటాయించడంతో పాటు 1.40 కోట్ల మంది యువతకు స్కిల్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని అమలు చేయాలనుకోవడం హర్షణీయం అన్నారు. 2014 – 2019 మధ్య కాలంలో నైపుణ్య శిక్షణ ద్వారా ఉద్యోగాల కల్పనలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2024లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి 10 ఏళ్ల కాలపరిమితి ముగుస్తున్నా రాష్ట్రానికి నిధుల సాధనలో జగన్ మోహన్ రెడ్డి



ప్రభుత్వం పూర్తిగా విఫమయ్యింది. గత 5 ఏళ్లలో వైసీపీ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయింది. 25 మంది ఎంపిలు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన జగన్ రెడ్డి 31 మంది ఎంపీలను పెట్టుకుని రాష్ట్రానికి ఏం తెచ్చారో చెప్పాలి. విభజన చట్టంలో కేటాయించిన 11 జాతీయ విద్యా సంస్థలను తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొస్తే వాటికి నిధులు కూడా తేలేకపోవడం జగన్ రెడ్డి వైఫల్యం కాదా?. కేంద్ర ప్రాయోజిక పథకాలకు రాష్ట్ర వాటా నిధులు కూడా ఇవ్వలేక వేల కోట్ల కేంద్ర నిధులను నిరుపయోగం చేయడం తప్ప జగన్ రెడ్డి చేసింది శూన్యం అన్నారు.

# కేంద్ర బడ్జెట్ ఎ.పి.కి టోపీ : డా.ఎన్. తులసీ రెడ్డి



విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మేడిపండు చందంగా వుందని, పైనాపటారం, లోన లొటారం అన్నట్టుగా వుందని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డా.ఎన్ తులసీ రెడ్డి ఎద్దేవా చేసారు. ఈ బడ్జెట్ లో రైతులకు తీరని అన్యాయం జరిగిందని తులసీ రెడ్డి ఆవేదన వెల్లబుచ్చారు. పి.యమ్. కిషాన్ యోజన క్రింద రైతులకిచ్చే ఆర్థిక సహాయాన్ని 6 వేల రూపాయల నుండి 12 వేల రుపాయల వరకు పెంచుతారని రైతులు ఎంతో ఎదురు చూసారు కాని ఒక్క రూపాయి కూడా పెంచలేదు వ్యవసాయనికి గిట్టుబాటూ లేక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యాలు చేసుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో వ్యవసాయ ఋణాలను మాఫీ చేస్తుందని రైతులు ఎంతో ఆశపడ్డారు కాని రైతులు ఆశలు నిరాశలయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడ లక్షల రూపాయల వరకు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తుందని తులసీ రెడ్డి అన్నారు. వంటగ్యాస్ సిలిండర్ ధర 1200 రుపాయల నుండి 500 రుపాయిలకు తగ్గిస్తుందని గృహిణులు చాలా ఆశగా చూసారు. కాని వారి ఆశలను నీరు కార్చారు. ఒక పైసా కూడా తగ్గించలేదు. కాంగ్రెస్ అధి కారంలోకి వస్తే 500 రూపాయలకే వంట గ్యాస్ సిలెండర్ సరఫరా చేస్తుం దని తులసీ రెడ్డి అన్నారు. నిరు పేద కుటుంబాలకు నెలకు కొంత మొత్తాన్ని ప్రతేక్ష ఆర్థిక సహాయం కింద అందిస్తుందని నిరు పేదలు ఆశపడ్డారు. ఆశలన్నీ ఆడిఆశాలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు 6 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తుందని తులసీ రెడ్డి అన్నారు. 14 లక్షల కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఖాళీగా వున్నాయి. ఈ ఖాళీలను బార్తి చేస్తామన్న హామీని ప్రభుత్వం ఇస్తుందని నురుద్యోగ యువత ఎదురు చూసారు. వారి భవిష్యత్తును అంధకారం లోకి నెట్టేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వస్తే ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్వోగాలని భర్తీ చేస్తుందని తులసీ రెడ్డి అన్నారు. కేంద్ర బజ్జెట్‌లో ఎపికి తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు ప్రత్యేన హోదా ప్రస్తావన లేదు రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్సేక అభివృద్ధి ప్యాకేజి అంశం ప్రసంగంలో లేక పోవటం శోచనీయం కడప జిల్లా సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం, దుగరాజ పట్నం ఓడ రేవు, పోలవరం, విశాఖ, విజయవాడ మెట్రో, విశాఖ చెన్నై పారిశ్రామిక కారిడార్, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ తదితర అంశాల ప్రస్తావనే లేదు. ఒక్క మాటలోచెప్పాలంటే మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బజ్జెట్ లో ప్రజలకు మట్టిముంత ఇచ్చి ప్రజల నుండి వెండి చెంబు లాకున్నట్టు ప్రజాలకు చాక్లెట్ ఇచ్చి వారి నుండి నక్లెస్ లాకున్నట్టు వుందని ఘాటుగా విమర్శించారు.

# ఎంపీ రేసులో ఆకుల లలిత

- నిజామాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు
- సోనియాగాంధీకి సన్నిహితురాలుగా గుర్తింపు
- సీనియర్ లెజిస్లేటర్‌గా రాణింపు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: నిజామాబాద్ లోక్సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు మరియు మాజీ శాసన సభ్యురాలు ఆకుల లలిత గురువారం గాంధీభవన్లో దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తరవున ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పార్టీలో సీనియర్ శాసన సభ్యురాలుగా రాష్ట్ర నాయకురాలుగా ఆమె పేరుంది. ప్రత్యేకించి పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి ఆమె అత్యంత సన్నిహితురాలు. సోనియాగాంధీ ప్రోత్సాహంతో ఆమె కాంగ్రెస్ పార్టీ తరవున ఎమ్మెల్సీగా ఎన్నికై సంచలనం సృష్టించారు.




# గోదావరి ఎక్స్‌ప్రెస్ స్వర్ణోత్సవం

## తెలుగు రాష్ట్రాలను కలుపుతున్న చుక్.. చుక్ రైలు

**గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలుకు అరుదైన గౌరవం దక్కింది. నేటితో ఆ రైలు పరుగులు 50 ఏళ్లు పూర్తి చేసుకుంది. గోదావరి ఎక్స్ ప్రెస్ సేవలు విశాఖ - హైదరాబాద్ డెక్కన్ మధ్య సుదీర్ఘంగా కొనసాగుతున్నాయి. సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. విశాఖ స్టేషన్‌లోని ప్లాట్‌ఫార్మ్‌పై రైల్వే అధికారులు, ప్రజలు కేక్ కట్ చేశారు. గోదావరి ఎక్స్‌ప్రెస్ వెళ్లే అన్ని ప్రధాన స్టేషన్లలో సంబరాలు చేసేందుకు రైల్వే ఏర్పాట్లు చేసింది. గురువారం రాత్రి 11 గంటలకు విజయవాడ రైల్వే స్టేషన్‌లో గోదావరి ఎక్స్‌ప్రెస్ సంబరాలు జరపుకున్నారు . ఈ రైలు గురించి మరిన్ని వివరాలలోకి వెళితే.**




.సరిగ్గా ఏభై ఏళ్ల క్రితం ప్రస్తుతం విశాఖ పట్నం - సికింద్రాబాద్ మధ్య భారత దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో నడుస్తున్న గోదావరి రైలు ప్రయాణం మొదలు పెట్టి 50 యేళ్లు పూర్తి చేసుకుంది.ప్రస్తుతం గోదావరి ఎక్స్ ప్రెస్ 12727, 12728 ట్రైన్ నంబర్ల తో విశాఖ పట్నం - హైదరాబాద్ మధ్య నడుస్తుంది. 50 వసంతాలు పూర్తి చేసుకున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ 1974 వ సంవత్సరంలో ఫిబ్రవరి ఒకటో తేదీన స్టీమ్ ఇంజన్‌తో మొట్టమొదటిసారి పట్టాలు ఎక్కింది. ఈ రైలు మొదటి సారి వాల్తేరు–హైదరాబాద్ మధ్య నడిచింది. గోదావరి ఎక్స్ ప్రెస్ వాల్తేర్ - హైదరాబాద్ మధ్య ట్రైన్ నంబర్ 7007 గా, సికింద్రాబాద్ - వాల్తేర్ మధ్య ట్రైన్ నంబర్ 7008 గా ప్రవేశ పెట్టడం జరిగింది. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గోదావరి ఎక్స్‌ప్రెస్ ఈ రైలు విశాఖపట్టణం నుంచి హైదరాబాద్‌ల మధ్యలో ఇప్పటికీ నడుస్తుంది.ఈ రైలుకు ఇప్పుడు చాలా ఆదరణ ఉంది. మరీ ముఖ్యంగా ఈ రైలుకు పూర్తి స్థాయి ఏ.సి సదుపాయం ఉన్న గరీబ్ రథ్, దురోంతో లు ప్రవేశపెట్టటంతో ఈ రైళ్ళలో ప్రజల రద్దీ ఇంకా పెరిగింది.
సమైక్య ఆంధ్రప్రదేశ్ లో ఉన్న కోస్తా ప్రాంతాలని అప్పటి రాజధాని హైదరాబాద్ (ఇప్పుడు తెలంగాణ రాజధాని) కు కలపాలనేదే గోదావరి ఎక్స్‌ప్రెస్ లక్ష్యం. ఈ రైలు విశాఖపట్నం లోని 5 స్టేషన్లు, పశ్చిమ గోదావరి లోని 3 స్టేషన్లు, తూర్పు గోదావరి లోని 6 స్టేషన్లు,, కృష్ణ జిల్లా విజయవాడలో ఆగుతుంది.

### అప్పటిలో

గతంలో ప్రారంభంలో ఈ రైలు ఒక రోజు విశాఖ నుంచి మరుసటి రోజు సికిందరాబాద్ నుంచి ప్రారంభమయ్యేది. అంటే విశాఖలో సాయంకాలం 5.20 కి బయలు దేరి మరుసటి రోజు ఉదయం 6.45 కు హైదరాబాద్ చేరుకునేది. ఆ రోజు హైదరాబాద్ లో ఇదే రైలు ఉదయం 5.10 కి బయలుదేరి విశాఖలో మరుసటి ఉదయం 5.50 కి చేరుకునేది. పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి ల ఉన్న 9 స్టేషన్లకు ఈ రైలు సదుపాయం ఉండటం వలన దీనికి అధికారికంగా గోదావరి ఎక్స్‌ప్రెస్ అని పరు పెట్టారు. 17 భోగిలున్న ఈ రైలను స్టీమ్ లోకోమోటివ్ ఇంజిన్ తో నడిపేవారు. సామర్లకోట నుండి రాజముండ్రి మధ్య గంటకు 50 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని చేరుకుంది. 1975 న ఈ రైలును కాకినాడ వరకు నడుపుతూ స్లిప్ సర్వీస్ను ప్రవేశపెట్టారు. దీనికి మరో 5 కోచ్ లు జోడించడం వలన విశాఖపట్నం నుండి రాజమండ్రి వెళ్ళే సింహాద్రి ఎక్ప్రెస్తో పాటు ఈ రైలు "రెక్ షేరింగ్ అగ్రిమెంట్"లో చేరింది. కానీ 1980 లో సింహాద్రి ఎక్ప్రెస్ ని భీమవరం వరకు పొడిగించి, కాకినాడ - సికింద్రాబాద్ మధ్య గౌతమి ఎక్ప్రెస్ని ప్రవేశపెట్టటంతో గోదావరి ఎక్ప్రెస్ కి రెక్ షేరింగ్, స్లిప్ సర్వీస్ ని రద్దు చేసారు. ఇచ్చిన 5 బోగీలు ఉంచుతూ, డీజిల్ లోకోమోటివ్ ఇంజిన్ ప్రవేశపెట్టారు. 1990 నాటికీ, గోదావరి ఎక్ప్రెస్ కి మంచి పేరు వచ్చింది. దీంతో ఈ రైలుకు మరింత రద్దీ పెరిగింది. అధికారులు మరో 2 భోగీలను ఇచ్చారు. దీనితో కలిపి 24 భోగీలతో గోదావరి ఎక్ప్రెస్ అప్పట్లో, దేశంలో పొడవైన రైలు సేర్వీసుల్లో ఒకటిగా నిలిచింది.



### ఇప్పటికి భారి రద్దీ

రెండు కొత్త రైళ్ళు ప్రవేశపెట్టినప్పటికీ, ఈ రైలుకి ఇప్పటికి భారి రద్దీ ఉంది . ప్రజల డిమాండ్ మేరకు కొన్నిమార్లు రిజర్వేషన్ లేని జనరల్ భోగీలను స్లీపర్, మూడవ క్లాసు భోగిలతో మారుస్తుంటారు.విశాఖ, హైదరాబాద్ మధ్య వెళ్ళు రైలు మార్గాలలో ఈ రైలు వెళ్ళే మార్గాన్ని ఉత్తమంగా భావిస్తారు. అందుకే అధికారులు దీన్ని శుభ్రంగా ఉంచుతారు. ఇది ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే ఆధీనంలో ఉంది .ఈ రైలును భుభనేశ్వర్ వరకు పొడిగించలనీ ప్రతిపాదనలు వచ్చిన ప్రజలు, రాజకీయ నాయకులూ దిన్ని తీవ్రంగా వ్యతిరేకించారు, ఆ తరువాత విశాఖ ఎక్ప్రెస్కి ప్రతిపాదనలు వచ్చాయి, వాటిని ఆమోదించారు. ఇప్పుడు ఆ రైలు ప్రయాణ సమయం గణనీయంగా పెరిగింది.

17 భోగీలతో ప్రయాణించే ఈ గోదావరి రైలు గంటకు 57 కిలో మీటర్లు (35 మైల్ ఫర్ అవర్) తో ప్రయాణిస్తుంది. దక్షిణ మధ్య రైల్వేలో మొదటి ఫస్ట్ క్లాస్ ఎయిర్ కండిషన్ లు మొదలయింది ఈ రైల్లోనే. 2000 సంవత్సరంలో 6 ఎయిర్ కండిషన్డ్ కోచ్ లున్న తొలిరైలుగా గుర్తింపు పొందింది.
2011 ఈ గోదావరి ఎక్స్ ప్రెస్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ అయింది. ఆయేడాదే రైలు నంబర్ ను 12727 గా మార్చారు. అంతేకాదు, వాప్-7 బండి అయింది. వాప్-7 అంటే బ్రాడ్ గేజ్ . ఈ రెండు నగరాలు మధ్య ఈ ట్రైను18 స్టేషన్లలో ఆగుతుంది. ప్రయాణ దూరం 710 కిలో మీటర్లు (440 మైల్స్) సగటు ప్రయాణ సమయం 12 గంటల 25 నిముషాలు గమ్యస్థానానికి చేరుకోవడానికి 12 గంటల 35 నిమిషాలు పడుతుంది.

### ప్రమాదాలు

1999లో ఈ రైలుకు వరంగల్ సమీపంలో ఘన్ పూర్ వద్ద తొలిసారి ప్రమాదానికి లోనయింది.
2023లో ఫిబ్రవరి 15 బుధవారం తెల్లవారుజామున సికింద్రాబాద్ డివిజన్‌లోని బీబీనగర్ మరియు ఘట్‌కేసర్ స్టేషన్‌ల మధ్య విశాఖపట్నం–హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. పట్టాలు తప్పిన ఘటనలో ఎవరూ గాయపడలేదు.
జూలై, ఆగస్టు 2011 లో, గోదావరి ఎక్ప్రెస్ ఎయిర్ కండిషన్డ్ కోచ్‌లను ప్రయాణికులు రెండుసార్లు దోచుకున్నారు, బూటకపు కాల్ రైలు ఆరో కోచ్ బాంబు గురించి చేయబడింది.ఫలితంగా, భద్రత విస్తరించింది.
ఇవే కాక చాలా సార్లు ప్రమాదాలకు గురైనా సురక్షిత ప్రయాణానికి ఎక్కువ మంది ఈ రౌలునే ఎంచుకుంకోవటం విశేషం..

### ఎన్నో రకాల సేవలు

ఈ 50 ఏళ్లలో ఎందరో ప్రయాణికులకు ఎన్నో రకాల సేవలు అందించిన ఘనత సాధించిన గోదావరి ఎక్స్ ప్రెస్ రైలు. రైలు మార్గంలో వెళ్లే కొన్ని ప్రధాన స్టేషన్లు విజయవాడ జంక్షన్, వరంగల్ మరియు విశాఖపట్నం. ఒక వారంలో, గోదావరి ఎక్స్‌పి సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శని, ఆదివారాల్లో పనిచేస్తుంది.
మీరు ఈ రైలులో ప్రయాణించాలని ప్లాన్ చేస్తున్నట్లయితే, మీరు క్లియర్‌ట్రిప్ యాప్ మరియు వెబ్‌సైట్ ద్వారా సులభంగా చేయవచ్చు. ఇది స్మార్ట్ యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్‌ని కలిగి ఉంది. కొన్ని సాధారణ ట్యాప్‌లతో, మీరు మీ టిక్కెట్‌ను సౌకర్యవంతంగా బుక్ చేసుకోవచ్చు. టికెట్ బుకింగ్ 120 రోజుల ముందుగానే ప్రారంభమవుతుంది, కాబట్టి ఆ సమయంలో బుక్ చేసుకోవడం మంచిది. క్లియర్‌ట్రిప్ మీ ప్రయాణాన్ని ప్లాన్ చేస్తున్నప్పుడు మీకు మృదువైన మరియు అప్రయత్నమైన అనుభవం ఉండేలా చేస్తుంది.

**సేకరణ– శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్**



## కెప్టెన్‌తో సహా.. ఫామ్‌లో లేని.. ఆ నలుగురు

మొదటి టెస్ట్ ఓటమితో టీమ్ ఇండియా వైఫల్యాలపై ప్రతి ఒక్కరూ బాణాలు ఎక్కుపెడుతున్నారు. అయితే ఎంత వెనకేసుకు వచ్చినా, గణాంకాలు అబద్ధాలు చెప్పవు కదా.. వాటిని ఆధారం చేసుకునే అందరూ మాట్లాడుతున్నారని అంటున్నారు. ప్రస్తుతం టీమ్ ఇండియాలో ఆడుతున్న నలుగురు ఆటగాళ్ల ఫామ్ అందరినీ కలవర పరుస్తోంది. వారిలో రోహిత్ శర్మ కూడా ఒకరనే విమర్శలు మిన్నంటుతున్నాయి. మిగిలిన ముగ్గురిలో శుభ్ మన్ గిల్, శ్రేయాస్ అయ్యర్ అనే సంగతి అందరికీ తెలిసిందే. ఇక నాలుగో క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కెప్టెన్ రోహిత్ శర్మ ఆడిన చివరి ఆరుటెస్టుల్లో అత్యధిక స్కోరు 39 మాత్రమేనని అంటున్నారు. శ్రేయాస్ అయ్యర్ గత పది టెస్ట్ ఇన్నింగ్స్ ల్లో చేసిన అత్యధిక స్కోరు 35 మాత్రమే..గిల్ అయితే సరేసరి. గత 11 టెస్ట్ మ్యాచ్ ల్లో ఒక సెంచరీ తప్ప, 40 అత్యధిక స్కోరు దాటలేదు. ఆరంభ ఓవర్లలో మహ్మద్ సిరాజ్ ని మించినవారు లేరు. కానీ తనకి బౌలింగ్ కోటా సరిగా ఇవ్వడం లేదనే విమర్శలున్నాయి. ఈ అంశంపై టీమ్ మేనేజ్మెంట్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మొన్నటి వరకు శుభ్ మన్ గిల్ పై ఫోకస్ పెట్టిన సోషల్ మీడియా ఇప్పుడు కెప్టెన్ రోహిత్ శర్మ మీద పడింది. దీంతో గిల్ బతుకుజీవుడా? అని రెండో టెస్ట్ కి మానసికంగా సిద్ధమవుతున్నాడు.
శ్రేయాస్ అయ్యర్ ని ఇప్పటికే రంజీ ట్రోఫీలు ఆడమని టీమ్ మేనేజ్మెంట్ సలహా ఇచ్చి ఆడించింది. ఆల్రెడీ గుర్తించిన వ్యక్తిని, మళ్లీ కొంపలు అంటుకుపోయినట్టు అర్జంటుగా ఇంగ్లాండ్ తో టెస్ట్ సిరీస్ కి తీసుకువచ్చారు. ఈ ఫలితాన్ని ప్రస్తుతం టీమ్ ఇండియా అనుభవిస్తోందనే విమర్శలున్నాయి.

# భారత్‌కు బిగ్ షాక్..

## సిరీస్ నుంచి ఆ స్టార్ పేసర్ ఔట్!



ఇంగ్లండ్తో ఐదు టెస్ట సిరీస్ నేపథ్యంలో టీమిండియాకు వరుస షాక్లు తగులుతున్నాయి. ఇప్పటికే వైజాగ్ వేదికగా శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న రెండో టెస్టు స్టార్ ఆల్రౌండర్ రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ దూరమయ్యారు. తొడ కండరాల గాయంతో జడేజా, కుడి తొడలో నొప్పితో కేఎల్ రాహుల్ బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్సీఏ)లో చేరారు. మూడో టెస్టోవు కేఎల్ రాహుల్ జట్టులోకి రీఎంట్రి ఇవ్వనుండగా.. జడేజా మాత్రం నాలుగో టెస్టు అందుబాటులోకి వస్తాడని ఎన్సీఏ వర్గాలు తెలిపాయి. తొడ కండరాల గాయం నుంచి జడేజా కోలుకోవడానికి 6-8 వారాలు పడుతుందని, ఈ క్రమంలోనే ఫిబ్రవరి 15 నుంచి రాజ్కోట్ వేదికగా జరిగే మూడో టెస్టు అందుబాటులోకి రాడని ఓ ఎన్సీఏ అధికారి తెలిపాడు.
చీలమండ గాయంతో భారత జట్టుకు దూరమైన స్టార్ పేసర్ మహమ్మద్ షమీ.. ఇంగ్లండ్తో చివరి మూడు టెస్టకు కూడా అందుబాటులో ఉండట్లేదని సమాచారం. ప్రస్తుతం మహమ్మద్ షమీ లండన్లో ఉన్నాడు. స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం చేయించుకుంటున్నాడు. గాయం నయమయ్యేందుకు అతను ఇంజెక్షన్స్ తీసుకుంటున్నాడని, ఈ పరిస్థితుల్లో అతను టెస్ట్ మ్యాచ్ ఆడలేడని, ఐపీఎల్ 2024లోనే రీఎంట్రి ఇస్తాడని ఓ ప్రముఖ వెబ్సైట్ పేర్కొంది. మహమ్మద్ షమీ గైర్హాజరీలో బరిలోకి దిగిన మహమ్మద్ సిరాజ్ తేలిపోయాడు. ఓ వైపు బుమ్రా సత్తా చాటినా మరోవైపు సిరాజ్ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాడు. దాంతో టీమిండియాలో షమీ లేని లోటు స్పష్టంగా కనబడుతోంది. బౌలింగ్తో పాటు లోయరార్డర్లో షమీ హిట్టింగ్ కూడా చేయగలడు. వ్యక్తిగత కారణాలతో తొలి రెండు టెస్టకు దూరంగా ఉన్న విరాట్ కోహ్లీ మూడో టెస్ట్ ఆడటంపై కూడా సందేహాలు నెలకొన్నాయి. ప్రస్తుతం విరాట్ కోహ్లీ విదేశాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అతను ఎప్పుడు వస్తాడనేదానిపై క్లారిటీ లేదు. తన తల్లి అనారోగ్యం గురించి జరిగిన ప్రచారం అవాస్తవమని కోహ్లీ సోదరుడు వికాస్ సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశాడు. ఐదు టెస్ట సిరీస్ను ఓటమితో ప్రారంభించిన టీమిండియా వైజాగ్ వేదికగా జరిగే రెండో టెస్టు ముందు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటుంది. సీనియర్ ఆటగాళ్ల గైర్హాజరీలో కుర్రాళ్లతో బరిలోకి దిగనుంది. మిడిలార్డర్లో శుభ్మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ పేలవ ఫామ్ టీమిండియాను కలవరపెడుతుంది. సునాయసంగా గెలవాల్సిన హైదరాబాద్ టెస్టు టీమిండియా చేజేతులా చేజార్చుకుంది. 231 పరుగుల లక్ష్యాన్ని చేధించలేక 28 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.

## ఉత్కంఠ పోరులో
# క్వార్టర్ ఫైనల్‌కు ఇరాన్



ఆసియా కప్లో అయిదు సార్లు టైటిల్ను అందుకున్న జపాన్ ఈసారి అదే జోరును కొనసాగిస్తుంది. బుధవరాం బహ్రెయిన్ను 3-1తో చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్కు జపాన్ అర్హత సాధించింది. గ్రూప్-డిలో ఇరాక్ చేతిలో అనూహ్య ఓటమి ఎదురైన తర్వాత గొప్పగా పుంజుకుని విజయాలతో హోరెత్తిస్తుంది. శనివారం ఇరాన్తో క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. జపాన్ జట్టులో రిట్సు డోన్, టేక్ఫుసా కుబో, అయాసే ఉడా గోల్లు కొట్టారు. మరోవైపు బహ్రెయిన్ జట్టులో జియోన్ సుజుకి మాత్రమే గోల్ సాధించాడు. అతడి పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలగింది. 31వ నిమిషంలో జపాన్ డిఫెండర్ సేయా మైకుమా లాంగ్-రేంజ్ షాట్ పోస్ట్ అనంతరం మ్యాచ్ మలుపు తిరిగింది. డోన్ రీబౌండ్లో గోల్గా మార్చాడు. రెండో అర్ధభాగం ప్రారంభమైన నాలుగు నిమిషాలకు జపాన్ మరో గోల్ సాధించింది. కుబో గోల్ కొట్టి ఆధిక్యాన్ని రెట్టింపు చేసాడు. స్పిన్ చేస్తూ దగ్గరి నుండి గోల్ చేశాడు. అనంతరం ఆట ఆసక్తిగా సాగింది. అయితే బహ్రెయిన్ కీపర్ ఇబ్రహీం లుట్ఫాల్లాను బోల్తా కొట్టించడానికి అయాసే సుమారు ఎనిమిది నిమిషాల పాటు పోరాడి గోల్ కొట్టాడు. మరో మ్యాచ్లో సిరియాపై ఇరాన్ పెనాల్టీ షూట్ అవుట్లో నెగ్గి క్వార్టర్స్కు చేరింది. తొలుత 1-1తో మ్యాచ్ టైగా ముగిసింది. కానీ ఆ తర్వాత పెనాల్టీ షూట్ మూడు సార్లు ఛాంపియన్ ఇరాన్ 5-3తో గెలిచింది. ఆసియా కప్లో మొదటిసారి నాకౌట్ దశకు చేరుకున్న సిరియా పోరాటం ఈ మ్యాచ్తో ముగిసింది. మరోవైపు ఇరాన్ క్వార్టర్ ఫైనల్కు చేరడం వరుసగా ఇది ఎనిమిదోసారి.

## అండర్-19 వరల్డ్ కప్ లో
# భారత్ ఘన విజయం



అండర్-19 వరల్డ్ కప్లో భారత జట్టు విజయపరంపర కొనసాగుతోంది. లీగ్ దశలోని మూడు మ్యాచ్లకు మూడు మ్యాచుల్లో విజయం సాధించిన యువ భారత జట్టు.. సూపర్ సిక్స్లో ఆడిన తొలి మ్యాచ్లను భారీ విజయాన్ని నమోదుచ చేసింది. మంగళవారం రాత్రి వరకు బ్లూంఫోంటీన్లోని మౌంగాంగ్ ఓవల్ మైదానంలో జరిగిన మ్యాచ్లో భారత జట్టు న్యూజిలాండ్పై 214 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లు నష్టానికి 295 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు భారత బౌలర్ల అద్భుత ప్రదర్శనతో 28.1 ఓవర్లలో 81 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో ఎస్కే పాండే నాలుగు వికెట్లు తీసి ఆ జట్టు పతనాన్ని శాసించగా, ఆర్ లింబాని రెండు, ముషీర్ ఖాన్ రెండు, ఎన్ తివారీ, ఏ కులకర్ణి చెరో వికెట్ తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

ముషీర్ ఖాన్ ఆల్రౌండ్ షోతో ఘన విజయం
భారత జట్టు కీలక ఆటగాళ్లు ఈ మ్యాచ్లో రాణించడంతో మెరుగైన స్కోర్ను చేయగలిగింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్కు దిగిన భారత జట్టులో ఓపెనర్ ఆదర్శ్ సింగ్ 52(58) పరుగులు చేయగా, వన్డౌన్లో వచ్చిన ముషీర్ ఖాన్ అద్భుతమైన ఆటతీరుతో అదరగొట్టాడు. 126 బంతుల్లో మూడు సిక్సులు, 13 ఫోర్ల సహాయంతో 131 పరుగులు చేసిన ముషీర్ ఖాన్ జట్టు భారీ స్కోర్ చేసేందుకు బాటలు వేశాడు. కెప్టెన్ యూ సహారన్ 57 బంతుల్లో 34 పరుగులు చేశాడు. వికెట్ కీపర్ ఏఏ రావు 17(18), పి మోల్యా 10(12), ఎస్ దాస్ 15(11) పరుగులు చేసి జట్టుకు మెరుగైన స్కోరును అందించి పెట్టారు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఎం క్లార్కే నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఓపెనర్ ఆదర్శ్ సింగ్, వన్ డౌన్ ఆటగాడు ముషీర్ ఖాన్ అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించడంతో భారత్ జట్టు భారీ పరుగులు చేయగలిగింది. తొలుత నెమ్మదిగా ఆడిన వీరిద్దరూ ఆ తరువాత గేర్లు మార్చడంతో భారీగా స్కోరు బోర్డుపై పరుగులు చేరాయి.

తడబడిన న్యూజిలాండ్ జట్టు
లక్ష్యం పెద్దదే అయినా కష్టసాధ్యమైనది అయితే మాత్రం కాదు. కానీ, న్యూజిలాండ్ జట్టు ఘోరమైన ఆటతీరుతో లక్ష్యాన్ని చేరుకోవడంలో చతికిలపడింది. భారత బౌలర్లు ధాటికి న్యూజిలాండ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. ఓపెనర్ టి జోన్స్ ఎదుర్కొన్న తొలి బంతికే అవుట్ కావడంతో డకౌట్గా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ వన్డౌన్ బ్యాటర్ ఎస్ఆర్ దేవిరెడ్డి 0(4) డకౌట్ కాగా, ఎల్ స్టాక్ పోలే 5(9), కెప్టెన్ ఓటీ జాక్షన్ 19(38), ఓ తివాటియా 7 (14), జెడ్ఏజె కమింగ్ 16(26), వికెట్ కీపర్ ఏఎక్స్ థామ్సన్ 12(27), ఈడబ్ల్యు స్కెడూర్ 7(17), ఆర్ సోగర్స్ 0(3) పరుగులు చేశారు. ఎం క్లార్కే మూడు బంతులు ఆడి పరుగులేమీ చేయకుడా నాటౌట్గా నిలిచాడు. భారత బౌలర్లలో కేఎస్ పాండే నాలుగు వికెట్లతో న్యూజిలాండ్ జట్టు పతనాన్ని శాసించాడు. ఆర్ లింబానీ రెండు, ముషీర్ ఖాన్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఏ కులకర్ణి, ఎన్ తివారీ ఒక్కో వికెట్ పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.



## వైజాగ్ టెస్టుకు ముందు
# ఇంగ్లండ్‌కు గట్టి ఎదురుదెబ్బ!



వైజాగ్: శుక్రవారం నుంచి భారత్‌తో రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కాబోతున్న వేళ ఇంగ్లండ్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మోకాలి గాయం కారణంగా ఇంగ్లండ్ స్టార్ స్పిన్నర్ జాక్ లీచ్ రెండో టెస్టు మ్యాచ్‌కు దూరమయ్యాడు. హైదరాబాద్ వేదికగా జరిగిన మొదటి టెస్టు మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ లీచ్ గాయడపడ్డాడు. అతని మోకాలికి గాయమైంది. అయినప్పటికీ గాయంతో బాధపడుతూనే బౌలింగ్ చేశాడు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండడంతో విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రెండో టెస్టు మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కూడా అధికారికంగా ధృవీకరించాడు. దురదృష్టవశాత్తూ జాక్ లీచ్ రెండో టెస్టుకు దూరమయ్యాడు. అతడి కుడి కాలిలో వాపు వచ్చింది. జాక్ లీచ్ జట్టుకు దూరం కావడం మాకు గట్టి ఎదురుదెబ్బ. చాలా రోజుల తర్వాత జాక్ లీచ్ జట్టులోకి వచ్చాడు. కానీ ఇంతలోనే ఇలా జరగడం బాధకరం. అని చెప్పాడు. కాగా హైదరాబాద్ టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో 26 ఓవర్లు బౌలింగ్ చేసిన లీచ్ ఒక వికెట్ తీశాడు. రెండో ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీశాడు.

# అందరినీ పిలిచేవాడిని.. డక్ అవుట్ అయిపోయేవాడిని.. సచిన్..!

ఇండియన్ క్రికెట్లోకి 16 ఏళ్ల వయసులో వచ్చాను. అయితే నా క్రికెట్ ట్రైనింగ్ అంతా, మా కాలనీలోనే జరిగిందని, వాళ్లే నా మొదటి ప్రేక్షకులని సచిన్ టెండుల్కర్ అన్నాడు. తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒక పోస్ట్ పెట్టాడు.
అప్పుడు నేను బాగా చిన్నవాడిని, మా సాహిత్య సహవాస్ కాలనీలో క్రికెట్ టీమ్ ఒకటి ఉండేది. అందులో నేనే ప్రధాన బ్యాటర్. ఆరోజు మా ఫ్రెండ్స్తో ఒక మ్యాచ్ ఏర్పాటు చేశా. ఈరోజు మ్యాచ్ ఉంది రమ్మనమని ఇంటింటికి వెళ్లి చెప్పా.. స్కూల్ నుంచి రాగానే, నా పని ఇదే.. క్రికెట్ ఒకటే ప్రపంచంగా ఉండేది.
నా టెక్నిక్ని ముందు కనిపెట్టినవాడు మా అన్నయ్య. తనే నన్ను ప్రోత్సహించాడు. సరే, కాలనీలో ఖాళీగా ఉన్నపెద్దవాళ్లు వచ్చారు, నా ఫ్రెండ్స్ వచ్చారు, నేను వారందరి ముందు బ్యాట్ పట్టుకు వీరోచితంగా వెళ్లాను. కానీ మొదటి బాల్ కి డక్ అవుట్ అయ్యాను. అయ్యో.. అని మా కాలనీవాసులందరూ బాధపడ్డారు.
కానీ నాకు చాలా సిగ్గేసింది. చాలా బాధపడ్డాను. బాల్ చాలా తక్కువ ఎత్తులో వచ్చింది, అందుకే అవుట్ అయ్యానని అన్నాను. కరెక్టే అని వాళ్లు కూడా ఒప్పుకున్నారు. అయితే నా వయసు వల్ల అలా చెప్పారో లేక నిజంగా అన్నారో తెలీదు. తర్వాత మళ్లీ పట్టుదల వచ్చింది. మరో సండే మ్యాచ్ పెట్టి, ఎప్పటిలా ఇంటింటికి వెళ్లి అందరినీ పిలిచాను.
పాపం ఆరోజు కూడా అందరూ వచ్చారు. మళ్లీ నా రెండో మ్యాచ్ మొదలైంది. నేను సీరియస్ గా వెళ్లి, మళ్లీ సున్నాకే అవుట్ అయిపోయాను. ఈసారి పిచ్ బాగాలేదు, అక్కడ రాయి ఉంది, దాని మీద బాల్ పడి పైకి లేచింది, అని కుంటి సాకులు చెప్పాను. పాపం వాళ్లు దానికీ ఒప్పుకున్నారు. నన్ను కించపరచలేదు. సరికదా, నా ఉత్సాహాన్ని నీరుగార్చలేదు.



మూడోవారం సండే, మళ్లీ అందరి ఇంటికి వెళ్లి పిలిచాను. వాళ్లు నాలో ఉత్సాహాన్ని చూసి సరే, వస్తామని తెలిపారు. బహుశా ఆదివారం ఖాళీగా ఉండటం వల్ల అనుకుంటా, ఫ్రెండ్స్తో కలిసి పేరెంట్స్ వచ్చారు. సరే, నా మూడో మ్యాచ్ స్టార్ట్ అయ్యింది. ఈసారి ఒక్క పరుగు మాత్రమే చేసి రన్ అవుట్ అయిపోయాను.
చిన్నోడు కదా.. పరుగెత్తలేకపోయాడని అంతా అనుకున్నారు. కానీ నా మనసులో, ఆ పదిమందిలో చేసిన ఒక్క పరుగు అలా నిలిచిపోయింది. శివాజీ పార్క్ నుంచి బాంద్రాకు స్కూల్ బస్సులో వెళ్లేటప్పుడు, ఆ చిన్న గ్రౌండ్ చుట్టూ తిరిగి వెళుతుంటే ఆ రన్, నన్ను ఇన్స్పైర్ చేసేది. ఇంకా ఎక్కువ చేయాలి, ఇంకా ఎక్కువ రన్స్ చేయాలనే ఒక ఇన్స్పిరేషన్ బలంగా నాటుకుపోయింది. ఆ ఒక్క పరుగు నా ఆలోచనా విధానాన్నే మార్చేసిందని అన్నాడు.
ఆ రోజు నేనే ఇంటింటికి వెళ్లి నా మ్యాచ్ ఉంది రమ్మనమని పిలిచేవాడిని, కానీ ఇండియన్ క్రికెట్లోకి వచ్చాక, పిలవకుండానే గ్రౌండ్కి వచ్చేవారు. గ్రౌండ్లో, టీవీల ముందు ప్రజలను చూస్తుంటే, నా చిన్నప్పటి రోజులే గుర్తొచ్చేవి..
ఒకప్పుడు నా క్రికెట్ని నేనే ప్రేమించేవాడిని, అందరూ నా ఆటని చూడాలని అనుకునేవాడిని, ఇప్పుడు భారతీయులందరూ నా ఆటని ప్రేమిస్తున్నారు. పిలవకుండానే అందరూ వస్తున్నారు. ఈ అభిమానం, భయం, బాధ్యత అన్నీ నాలో రోజురోజుకి పెరిగాయి. అందుకే అన్నేళ్లు క్రికెట్ ఆడగలిగానని తెలిపాడు. నిరంతరం బ్యాటింగ్లో కొత్త విషయాలు నేర్చుకుని, నన్ను నేను మార్చుకునేవాడినని తెలిపాడు.
నిజానికి సచిన్ టెండుల్కర్ తన చిన్ననాటి జ్ఞాపకాన్ని చెప్పినా, నేటి యువతకు అందులో స్ఫూర్తిదాయకమైన అంశాలెన్నో ఉన్నాయని, మనకి ఏదైతే ఇంట్రస్టు ఉందో, దానిపై మనసు పెట్టి పనిచేయాలని, విజయం దానంతటదే వెతుక్కుంటూ వస్తుందని నెట్టింట పలువురు కామెంట్ చేస్తున్నారు.

# విశంభరకి సిద్ధమవుతున్న మెగాస్టార్

మెగాస్టార్ చిరంజీవి మెగా ఫాంటసీ అడ్వెంచర్ 'విశ్వంభర'. ఇప్పటికే విడుదలైన ఈ మాగ్నమ్ ఓపస్ స్పెల్ బైండింగ్ గ్లింప్స్ గ్లోబల్‌గా ట్రెండ్ అయ్యింది. మెగా మాస్ బియాండ్ యూనివర్స్ 'విశ్వంభర' కోసం మెగాస్టార్ చిరంజీవి జిమ్‌లో కసర త్తులు చేస్తూ ప్రత్యేకంగా సిద్ధమౌతున్నారు. దీనికి సంబధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో టాప్ ట్రెండ్‌లో వైరల్ అవుతోంది. వీడియో చివర్లో "గెట్టింగ్ రెడీ ఫర్ విశ్వంభర' అని మెగాస్టార్ చెప్పడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ నెల నుంచి 'విశ్వంభర' షూటింగ్‌లో జాయిన్ అవుతున్నారు మెగాస్టార్ చింజీవి. బింబిసార ఫేమ్ వశిష్ట ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్లు అత్యంత భారీ బడ్జెట్తో నిర్మిస్తునారు. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా, ఛోటా కె నాయుడు సినిమాటోగ్రాఫర్. ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ కాగా, సుస్మిత కొణిదెల కాస్ట్యూమ్ డిజైనర్. కోటగిరి వెంకటేశ్వరరావు, సంతోష్ కామిరెడ్డి ఈ చిత్రానికి ఎడిటర్లుగా వ్యవహరి స్తున్నారు. శ్రీ శివశక్తి దత్తా, చంద్రబోస్లిరిక్ రైటర్స్. శ్రీనివాస్ గవిరెడ్డి, గంటా శ్రీధర్, నిమ్మగడ్డ శ్రీకాంత్, మయూఖ్ ఆదిత్య స్క్రిప్ట్ అసోసియేట్లుగా ఉన్నారు. 2025 సంక్రాంతికి సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు.



## శేఖర్ కమ్ముల, శ్రీ వెంకటేశ్వర కొలాబరేషన్ అనౌన్స్‌మెంట్



అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అద్భుతమైన చిత్రాలను రూపొందించడంలో మంచి పేరు తెచ్చు కున్న సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ప్రస్తుతం సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జునతో మల్టీ స్టారర్ చేస్తున్నారు. శ్రీ నారాయణ్ దాస్ కె నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పి (ఏషి యాన్ గ్రూప్ యూనిట్) బ్యానర్ పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నారు. తాజాగా ప్రొడక్షన్ హౌస్ తమ కొత్త చిత్రాన్ని ప్రకటించింది. నాగ చైతన్య, సాయి పల్లవితో క్లాసిక్ 'లవ్ స్టోరీ', ప్రస్తుతం జరుగుతున్న డిఎన్ఎస్ తరువాత, ఈ మాగ్నమ్ ఓపస్ మూవీ ఎస్విసిఎల్ఎల్పి తో శేఖర్ కమ్ముల థర్డ్ కొలాబరేషన్. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సోనాలి నారంగ్ సమర్పిస్తున్నారు. ఈ కొత్త చిత్రం లార్జర్ దెన్ లైఫ్‌గా ఉండబోతోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. శేఖర్ కమ్ముల, ఎస్విసిఎల్ఎల్పి హ్యాట్రిక్ మూవీ హై బడ్జెట్, టాప్-క్లాస్ సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో రూపొందనుంది. ప్రస్తుతం జరుగుతున్న డిఎన్ఎస్ పూర్తయిన తర్వాత ఇది ఫ్లోర్స్ పైకి వెళ్తుంది. మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.

## రామ్‌చరణ్16 కోసం ఉత్తరాంధ్ర రాబోతున్న టీమ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన తదుపరి పాన్ ఇండియా చిత్రం- రామ్‌చరణ్16 కోసం 'ఉప్పెన'తో బ్లాక్ బస్టర్ డెబ్యు చేసిన యంగ్ ట్యాలెంటెడ్ దర్శకుడు బుచ్చిబాబు సానతో జతకట్టనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సగర్వంగా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై అత్యంత భారీ బడ్జెట్, భారీ స్థాయిలో వెంకట సతీష్ కిలారు నిర్మించనున్నారు. అద్భుతమైన సాంకేతిక నిపుణులు పని చేస్తున్న ఈ చిత్రానికి ఉత్తరాంధ్ర స్లాంగ్లో డైలాగ్లను అనర్గళంగా చెప్పగల నటీనటులు అవసరం. అందుకే ఉత్తరాంధ్రలో టాలెంట్ హంట్ కోసం ఆర్సీ16 టీమ్ వస్తోంది. ఔత్సాహిక నటీనటులందరినీ సిద్ధంగా ఉండమని వారు కోరుతున్నారు. ఫిబ్రవరి నెలలో విజయనగరం, సాలూరు, శ్రీకాకుళం, విశాఖపట్నంలలో 5వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆడిషన్స్ జరుగుతాయి. దాదాపు 400 మంది వివిధ వయసుల నటీనటులు ఈ సినిమా కోసం కాస్ట్ చేయనున్నారు. బుచ్చిబాబు యూనివర్సల్ అప్పీల్ ఉండే పవర్ఫుల్ స్క్రిప్ట్ని సిద్ధం చేశారు. ఆస్కార్ అవార్డ్ విన్నింగ్ కంపోజర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేస్తారు మేకర్స్.

## అంబాజీపేట మ్యారేజి బ్యాండు

### బిగ్ టికెట్ రిలీజ్ చేసిన విజయ్ దేవరకొండ



సుహాస్ హీరోగా నటించిన సినిమా అంబాజీపేట మ్యారేజి బ్యాండు. ఈ చిత్రాన్ని జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించాయి. అంబాజీపేట మ్యారేజి బ్యాండు సినిమాకు దుశ్యంత్ కటికినేని దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఈ నెల 2న థియేటర్స్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇవాళ హైదరాబాద్‌లో అంబాజీపేట మ్యారేజి బ్యాండు సినిమా బిగ్ టికెట్ ను హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేశారు. ఈ సినిమాను చూసిన విజయ్ దేవరకొండ మూవీ చాలా బాగుందంటూ ప్రశంసించారు. ఇదొక స్పెషల్ ఫిల్మ్ అని, తప్పకుండా ఘన విజయం సాధిస్తుందని చెప్పారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ అంబాజీపేట మ్యారేజి బ్యాండు బిగ్ టికెట్ లాంఛ్ చేయడం సంతోషంగా ఉంది. ఇలాంటి మంచి సినిమా ప్రమోషన్ లో భాగమవడం హ్యాపీగా ఉంది. ఈ సినిమా టీజర్ దగ్గర నుంచి ఒక ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తూ వచ్చింది. ఈ మూవీ టీమ్ లోని ప్రతి ఒక్కరూ నాకు దగ్గర వాళ్లు. ఈ నెల 2న థియేటర్స్‌లోకి ఒక స్పెషల్ మూవీ రాబోతోంది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు సినిమా చూశాను. ఫస్ట్ హాఫ్ అద్భుతంగా ఉంది. మ్యూజిక్, ఆర్టిస్టుల పర్ ఫార్మెన్స్ లు నెక్ట్ లెవెల్ లో ఉన్నాయి. సుహాస్ ఎప్పటిలాగా చాలా బాగా నటించాడు. శరణ్య అద్భుతంగా పర్ ఫార్మ్ చేసింది. ఏ సినిమాకైనా ఫస్ట్ హాఫ్ చూశాక కొంత విరామం తీసుకునే నేను ఈ సినిమాకు కంటిన్యూగా ఫుల్ మూవీ చూశాను. అంత క్యూరియస్‌గా అనిపించింది. మీరు కూడా థియేటర్ లో ఇదే ఫీల్ అవుతారు. అని అన్నారు.

## ఈగల్ మ్యూజిక్ ఎక్స్ ట్రార్డినరీగా వుంటుంది

మాస్ మహారాజా రవితేజ మోస్ట్ ఎవైటెడ్ యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ ఈగల్. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కావ్య థాపర్, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫిబ్రవరి 9న ఈగల్ ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈగల్ సంగీత దర్శకుడు డేవ్ జాంద్ చిత్ర విశేషాలని విలేకరుల సమావేశంలో పంచుకున్నారు. నేను సెల్ఫ్ ఫ్రీ లాన్స్ మ్యుజిషియన్ ని. హీరో శ్రీ విష్ణు, నేను గీతం కాలేజ్ లో క్లాస్ మేట్స్. శ్రీ విష్ణు గారిని కలవడం, అప్పుడే కార్తిక్ గారికి నా ట్యూన్స్ వినిపించేవాడిని. ఆయన రాసుకున్న ప్రతి స్క్రిప్ట్‌కి ముందు నుంచే మ్యూజిక్ కంపోజ్ చేయడం, అలా కార్తిక్ గారితో జర్నీ కొనసాగింది.



రవితేజగారితో ఈగల్ సినిమా ఓకే అయిన తర్వాత "ఆయన్ని ఒప్పించి నిన్ను ప్రాజెక్ట్ లోకి తీసుకురాలేను' అని కార్తిక్ ముందే చాలా స్పష్టంగా చెప్పారు. రవితేజ గారి సినిమాకి సహజంగానే వండర్ ఫుల్ బిగ్ కంపోజర్స్ పని చేస్తారు. అయితే నా ప్రయత్నంగా మూడు ట్రాక్స్ కంపోజ్ చేసి కార్తిక్ కి ఇచ్చాను. ఈ మూడు ట్రాక్స్ రవితేజ గారు విన్నారు. ఆయనకి చాలా నచ్చాయి. అలా ఈ ప్రాజెక్ట్ లోకి తీసుకున్నారు.

పదో తరగతి నుంచి నా మ్యూజిక్ జర్నీ మొదలైయింది. పియానో, గిటార్, డ్రమ్స్, ప్రోగ్రామింగ్ చేసేవాడిని. సోని ఎంటర్ నేషనల్ గేమ్స్ కి మ్యూజిక్ చేసేవాడిని. మొదటి నుంచి ఫిల్మి స్ట్రక్చర్ పై ఒక అవగాహన వుంది. స్క్రీన్ ప్లే లోని షిష్ట్ ని అర్థం చేసుకునేవాడిని. అలాగే కార్తిక్ కూడా చాలా సపోర్టివ్. చాలా విషయాలు చెప్పేవాడు. అలాగే ఏఆర్ రెహమన్, అనిరుద్, దేవిశ్రీ ప్రసాద్, తమన్ ఇలా అందరి సంగీతంపై లోతైన పరిశీలన వుంది. ఇవన్నీ కూడా సినిమా సంగీతంపై పూర్తి అవగాహన వచ్చేలా చేశాయి. ఈగల్ లో నేపథ్యం సంగీతం విని అద్భుతంగా చేశానని రవితేజ గారు ప్రశంసించారు. అది చాలా తృప్తిని ఇచ్చింది. రవితేజ గారితో మాట్లాడినపుడు చాలా స్ఫూర్తిదాయకంగా వుంటుంది. ఈగల్ లో చాలా కొత్త తరహా సంగీతం చేశాం. ఈగల్ ఆన్ హిస్ వే అనేది కంప్లీట్ ఇంగ్లీష్ ట్రాక్. రవితేజ గారికి ప్రోపర్ ఇంగ్లీష్ ట్రాక్ చేసే అవకాశం రావడం అదృాఎష్టంగా భావిస్తున్నాను. ఈగల్ సినిమాలో స్క్రీన్ ప్లే, యాక్షన్, దర్శకుడు తీసిన విధానం చాలా యూనిక్ గా వుంటాయి. ఇందులో చాలా గూస్ బంప్స్ మూమెంట్స్ వున్నాయి. ఆడు మచ్చా పాట మాస్ ని మెస్మరైజ్ చేస్తుంది. గల్లంతు పాట మనసుని హత్తుకునే మెలోడీ. రాబోతున్న నాలుగో ట్రాక్ కూడా గూస్ బంప్స్ తెప్పిస్తుంది. ఈగల్ మ్యూజిక్ కీలక పాత్ర పోషిస్తుంది. రవితేజ గారి యాక్షన్ ఎపిసోడ్స్, ఎక్స్ ట్రార్డినరీ ఫైట్స్, లవ్ ట్రాక్, పోలెండ్ లో షూట్ చేసిన ఇంటర్ నేషనల్ ఎపిసోడ్స్ వున్నాయి. వీటన్నటిలో మ్యూజిక్ చాలా కీ రోల్ ప్లే చేస్తుంది. సౌండ్ డిజైన్ చాలా కేర్ ఫుల్ గా చేశాం. రవితేజ గారిని తొలిసారి కలిసినప్పుడు షాక్ అయ్యాను. పక్కన కూర్చోమని పూతరేకులు తెప్పించారు. దాదావు గంటపాటు మ్యూజిక్ గురించి మాట్లాడుకున్నాం. చాలా మోటివేట్ చేశారు. రవితేజ గారు వండర్ ఫుల్ పర్సన్. ఆయన అభిమానులకు, కార్తిక్ రాసుకున్న కథకు నా మ్యూజిక్ తో న్యాయం చేకూరేలా చూడాలనే భాధ్యతతో పని చేశాను. రవితేజ గారు చాలా సపోర్ట్ చేశారు. చాలా విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు.

## గేమ్ ఆన్‌తో కొత్త గేమ్ వరల్డ్ లోకి వెళ్లిపోతారు

గీతానంద్, నేహా సోలంకి జంటగా దయానంద్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం గేమ్ ఆన్. సీనియర్ నటులు మధుబాల, ఆదిత్య మీనన్ శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషించారు. కస్తూరి క్రియేషన్స్ అండ్ గోల్డెన్ వింగ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్పై రవి కస్తూరి ఈ సినిమాను నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమా రిలీజ్ సందర్భంగా హీరో గీతానంద్ చెప్పిన విశేషాలు. ఇదొక యూనిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా డిఫరెంట్ గా చేయాలని ప్రయత్నించాం. హీరో లూజర్ నుంచి విన్నర్ గా ఎలా మారాడు అనేది ఆసక్తికరంగా ఉంటుంది. దీనిలో భాగంగా ఉండే టాస్కులు ప్రేక్షకులని ఆకట్టుకుంటాయి. డైరెక్టర్ దయానంద్ మా తమ్ముడు కావడంతో స్క్రిప్ట్ విషయంలో ఇద్దరం బాగా డిస్కస్ చేసుకునే వాళ్ళం. మేమిద్దరం కలిసి చాలా షార్ట్ ఫిలిమ్స్ చేశాం. తమ్ముడు స్టోరీ రాస్తే నేను యాక్ట్ చేసే వాడిని.. లేదంటే వాడి స్టోరీను నేను డైరెక్ట్ చేసే వాడిని. అలా మా ఇద్దరి మధ్య మంచి బాండింగ్ తో పాటు సింక్ ఉండేది. ఈ సినిమా విషయంలో మాకు ఆ ఎక్స్పీరియన్స్ బాగా ఉపయోగపడింది. రియల్ టైం సైక లాజికల్‌గా సాగే ఈ సినిమాతో ప్రేక్షకులు గేమ్ వరల్డ్‌లోకి వెళ్ళిపోతారు. యాక్షన్ సీక్వెన్స్ కూడా చాలా కొత్తగా ఉంటాయి. నేహా సోలంకి, నాకు మధ్య ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ బాగుంటుంది. ఆమె కూడా ఇందులో కీ రోల్ లో కనిపిస్తుంది.



సీనియర్ ఆర్టిస్టులు మధుబాలగారు, శుభలేఖ సుధాకర్‌గారు, ఆదిత్య మీనన్‌గారు, ఇందులో నటించ డం సినిమా నెక్స్ట లెవెల్ కి వెళ్ళింది. మధుబాలగారు ఇప్పటివరకు కనిపించని కొత్త క్యారెక్టర్ లో కనిపిస్తారు. ఇందులో క్రేజీ బ్యాక్ స్టోరీ ఉంటుంది. ప్రేక్షకులు ఎవరు ఊహించలేరు అనేంతగా ఉంటుంది. ఆదిత్య మీనన్ గారు గ్రేషేడ్ లో కనిపిస్తారు. శుభలేఖ సుధాకర్ గారు మా తాత పాత్రలో ఇన్స్పైరింగ్ రోల్ చేశారు. ఈ సినిమాకి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ హైలైట్ గా ఉంటుంది. ఈ సినిమా మిక్సింగ్ అంతా చెన్నై లోని ఏఆర్ రెహమాన్ గారి స్టూడియోలో జరిగింది. థియేటర్లో సౌండ్ పవర్ పాక్డ్ ఉంటుంది. టెక్నికల్ పరంగా అన్ని విషయాల్లోనూ కేర్ తీసుకున్నాం.

## అమర్ దీప్, సుప్రిత చిత్రం ప్రారంభం



బిగ్ బాస్ ఫేమ్ అమరదీప్ చౌదరి హీరోగా, నటి సురేఖావాణి కుమార్తె సుప్రీత హీరోయిన్గా నూతన చిత్రం ప్రారంభం అయింది. మహర్షి కూండ్ల సమర్పణలో ఎం3 మీడియా బ్యానర్పై మహా మూవీస్తో కలిసి ప్రొడక్షన్ నెం 2గా మహేంద్ర నాథ్ కూండ్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నాడు హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్లో పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి బసిరెడ్డి క్లాప్ కొట్టగా.. ఏఎం రత్నం కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం మీడియాతో చిత్ర యూనిట్ మాట్లాడింది. ఈ కార్యక్రమంలో నిర్మాత మహేంద్ర నాథ్ కూండ్ల మాట్లాడుతూ.. ఎం 3 బ్యానర్ మీద ప్రొడక్షన్ నెం. 2 గా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అమర్ దీప్ చౌదరి, సుప్రితలు హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇండియన్ సినిమాలో ఇంత వరకు ఎవ్వరూ టచ్ చేయని పాయింట్. ఈ చిత్రాన్ని మా దర్శకుడు ఎలా తీస్తాడు.. సినిమా ఎలా ఉంటుందని తరువాత మాట్లాడుతుంది. ఇది మాత్రం చాలా కొత్త పాయింట్ అని అన్నారు. అమర్ దీప్ చౌదరి మాట్లాడుతూ.. బిగ్ బాస్ కంటే ముందే ఈ చిత్రాన్ని ఓకే చేశాను. డైరెక్టర్ మాల్యా నా ఫ్రెండ్.

## ఎల్ఎస్‌డి సిరీస్ ట్రైలర్ విడుదల ఫిబ్రవరి 2న స్ట్రీమింగ్



అనిల్ మోదుగ , శివ కోన నిర్మాణంలో శివ కోన దర్శకత్వంలో వస్తోన్న సరికొత్త వెబ్ సీరీస్ ఎల్ఎస్డి. ప్రాచీ టకర్, నేహా దేస్పాండే, ప్రభాకర్ , కునల్, అభిలాష్ బందారి, రమ్య దినేష్ తదితరులు నటించిన ఈ సీరీస్ కు ప్రవీణ్ మని, శశాంక్ తిరుపతి సంగీతం అందిస్తున్నారు. అలాగే పవన్ గుంటుకు, హర్ష ఈడిగా సినిమాటోగ్రఫర్స్ గా వర్క్ చేశారు. తెలుగు, హిందీ భాషల్లో ఏకకాకంలో ఫిబ్రవరి 2న ఎమ్ఎక్స్ ప్లేయర్ లో విడుదల కానున్న ఈ వెబ్ సీరీస్ సైకలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో డార్క్ కామెడీ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలైన ట్రైలర్ కు మంచి స్పందన లభిస్తోంది. అన్ని ఎలిమెంట్స్ తో ఈ సీరీస్ రాబోతోందని ట్రైలర్ చేస్తే తెలుస్తోంది. మూడు జంటల మధ్య జరిగే ఆసక్తికరమైన సన్నివేశాలు, వారి ఫారెస్ట్ ట్రిప్ ఎల్ఎస్డి వెబ్ సీరీస్‌లో ప్రేక్షకులను థ్రిల్ చెయ్యబోతున్నాయి. నెక్స్ట ఏం జరుగుతుందో అనే సస్పెన్స్‌ను మెయింటైన్ చేస్తూ దర్శకుడు శివ కోన ఈ సీరీస్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకొని రాబోతున్నారు.

## ఫిబ్రవరి 23న సుందరం మాస్టర్



ఆర్ టీ టీం వర్క్స్, గోల్ డెన్ మీడియా పతాకాలపై మాస్ మహారాజా రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మిస్తున్న చిత్రం 'సుందరం మాస్టర్'. ఈ చిత్రంలో హర్ష చెముడు, దివ్య శ్రీపాద ప్రధాన పాత్రలు పోషించారు. ఆల్రెడీ ఇది వరకు వదిలిన కంటెంట్ అందరిలోనూ ఆసక్తి కలిగించిన సంగతి తెలిసిందే. ఒక గ్రామంలో కష్టపడే ఉపాధ్యాయుడి చుట్టూ సుందరం మాస్టర్ కథ తిరుగుతుంది. మిర్యాల మెట్ట అనే మారుమూల గ్రామంలో ఇంగ్లీషు టీచర్గా సుందరం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అన్ని వయసుల వారు ఇంగ్లీష్ నేర్చుకోవడానికి విద్యార్థులుగా నమోదు చేసుకుంటారు. సుందరం మాస్టర్ వాళ్ళందరికీ భాషని ఎలా బోధిస్తారనే దాన్ని వినోదాత్మక చిత్రంగా రూపొందించారు. 'సుందరం మాస్టర్' విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ హిలేరియస్ ఎంటర్టైనర్ ఫిబ్రవరి 23న థియేటర్లలో విడుదల కానుంది. ఫిబ్రవరి 23న గ్రాండ్ గా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుందని ప్రకటించారు. ఈ కామెడీ డ్రామాని చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హర్ష చెముడు టీజర్ లో నవ్వించాడు. కొత్త దర్శకుడు కళ్యాణ్ సంతోష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మిర్యాల మెట్ట విలేజ్ బ్యాక్డ్రాప్లో సాగే కామెడీ డ్రామా. మాస్ మహారాజ్ రవితేజ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండడంతో ఈ చిత్రానికి మంచి బజ్ ఏర్పడింది.




PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.